www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★




నేటి సామ్రాజ్యవాదం కొత్తరూపాలు – మన పోరాటం 06
డెమోక్రాట్ల ఉచ్చులో చిక్కుకోవద్దు 02
20న బిహార్‌లో కొత్త ప్రభుత్వం 05

సంపుటి 08, సంచిక: 347 | మంగళవారం | 18-11-2025 | ఖమ్మం    Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar    పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## కాంగ్రెస్ తరుపున బిసిలకు
# 42 % రిజర్వేషన్లు

### తొలుత పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తాం

- రూ.3వేల కోట్ల కేంద్ర నిధులు కోల్పోకుండా ఉండేందుకే నిర్ణయం
- కోర్టు కేసులు తెలిన తర్వాతే ఎంపిటిసి, జెడ్‌పిటిసి, మున్సిపల్ ఎన్నికలు



- ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ పేరుతో స్మృతి వనం
- పాఠ్యపుస్తకాల మొదటి పేజీల్లో జయజయహే తెలంగాణ గీతం ముద్రణ
- దత్తసాయికి డిగ్రీ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగం
- డిసెంబర్ 1నుంచి 9వరకు ప్రజాపాలన వారోత్సవాలు
- గిగ్‌వర్కర్లకు భద్రత, భరోసా కల్పిస్తూ బిల్లు
- ఎస్ఎల్‌బిసి ప్రాజెక్టుకు ఆర్‌డిఆర్ పేరు
- రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయం



ప్రజాపక్షం/హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. బిసి రిజర్వేషన్ల అమలు విషయంలో కోర్టులో న్యాయ పోరాటం చేస్తూనే స్థానిక సంస్థలకు కేంద్ర నుంచి రావాల్సిన రూ.3 వేల కోట్ల నిధులను కోల్పోకుండా వెంటనే గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఇటీవల మరణించిన ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ పేరుతో స్మృతి వనం ఏర్పాటు చేయాలని, ఆయన రచించిన తెలంగాణ రాష్ట్ర గీతం 'జయజయహే తెలంగాణ' గీతాన్ని ప్రతి పాఠ్య పుస్తకంలోని మొదటి పేజీలో పొందుపర్చాలని, అందెశ్రీ కుమారుడు దత్తసాయికి డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయించింది. డిసెంబర్ 1 నుంచి 9 వరకు ప్రజాపాలన వారోత్సవాలు నిర్వహించాలని, ఆ తర్వాత గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని, నాలుగు లక్షల మంది గిగ్ వర్కర్లకు భద్రత, భరోసా కల్పిస్తూ గిగ్ వర్కర్ల బిల్లును మంత్రివర్గం ఆమోదించింది. అదే విధంగా ఎస్ఎల్‌బిసి ప్రాజెక్టుకు ఇటీవల మరణించిన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పేరును పెట్టాలని తరువాయి 2లో

## షేక్ హసీనాకు
# ఉరిశిక్ష

### బంగ్లాదేశ్ ప్రత్యేక ట్రిబ్యునల్ సంచలన తీర్పు

**నాటి హోం మంత్రి కమల్‌కూ అదే శిక్ష**

**ప్రజాస్వామ్యబద్ధమైన తీర్పు కాదు : హసీనా**



**ఢాకా:** పదవీచ్యుతురాలైన బంగ్లాదేశ్ ప్రధానమంత్రి, అవామీ లీగ్ నాయకురాలు షేక్ హసీనా (78)కు ఆ దేశ ప్రత్యేక కోర్టు ఉరిశిక్ష విధించింది. కోర్టుకు హాజరు కాకపోయినప్పటికీ అంతర్జాతీయ ట్రిబ్యునల్ కోర్టు (ఐసిటి) నిందితురాలి వాదనలు వినకుండా ఏకపక్షంగా తీర్పు ప్రకటించింది. విద్యార్థుల ఆందోళన అణచివేత, హింస వెనుక హసీనాను కీలక సూత్రధారిగా ధర్మాసనం తీర్పులో పేర్కొంది. బంగ్లాదేశ్‌లో మరో మూడు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆదరాబాదరాగా ఈ తీర్పు వెలువడింది. ఎన్నికల్లో పోటీ చేయకుండా హసీనా పార్టీ అవా మీ లీగ్‌పై నిషేధం విధించారు. గత ఏడాది జులైనెలలో దేశంలో తలెత్తిన ప్రభుత్వ వ్యతిరేక తిరుగుబాటును మారణాయుధాలతో కఠినంగా అణచివేయాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు రుజువు కావడంతో న్యాయస్థానం ఆమెను దోషిగా తేల్చింది. ఈ కేసులో ఆమెతోపాటు సహనిందితుడుగా ఉన్న నాటి హోంమంత్రి అసదుజ్జాన్ ఖాన్ కమల్‌కు కూడా ప్రత్యేక కోర్టు ఉరిశిక్ష విధించింది. నాటి పోలీస్ డైరెక్టర్ జనరల్ ఛౌదురి అబ్దుల్లా మా మన్‌కు ఐదేళ్ళ శిక్ష పడింది. మొత్తం ఐదు కారణాలను చూపిస్తూ ఈ శిక్షలు ప్రకటించారు. ప్రజాస్వామ్య పద్ధతులలో ప్రదర్శకులను అరెస్టు చేసి చట్టప్రకారం న్యాయస్థానం ముందు ఉంచి శిక్షలు విధించడంలో హసీనా ప్రభుత్వం విఫలమైందని, మానవత్వం మరచి ప్రవర్తించిందని ధర్మాసనం మొదటి కారణంగా చూపించింది. నిరాయుధులైన ప్రదర్శకులను అణచివేసేందుకు మారణాయుధాలు, డ్రోన్లు, హెలికాప్టర్లు తరువాయి 2లో

## మక్కా యాత్రలో మహావిషాదం
# 45 మంది బస్సు అగ్ని కీలల్లో భస్మీపటలం

### • మృతులంతా హైదరాబాదీలే • ఒకే ఒక మృత్యుంజయుడు

**మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన 18 మంది విద్యానగర్ వాసులు**

- ఘటన పట్ల ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి
- మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5.లక్షలు పరిహారం చెల్లించాలని కేబినెట్ నిర్ణయం



ప్రజాపక్షం/హైదరాబాద్

సౌదీ అరేబియాలో మక్కా–మదీనా మార్గంలో సోమవారం జరిగిన ఘోర ప్రమాదం హైదరాబాద్‌ను శోకసంద్రంలో ముంచింది. ఉమ్రాకు వెళ్ళిన యాత్రికులను మదీనాకు తీసుకెళ్తున్న బస్సు ఒక డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో మంటలు వ్యాపించి 45 మంది సజీవదహనం అయ్యారు. మృతులందరు హైదరాబాద్ వాసులు కావడంతో పాతబస్తీ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. బస్సు ఢీకొన్న కొన్ని క్షణాలలోనే భారీగా పొగ, అగ్నిజ్వాలలు చెలరేగడంతో ప్రయాణికులలో చాలా మంది బయటకు రాలేకపోయారు. ప్రమాదంలో ఒకే ఒక్క వ్యక్తి మాత్రమే ప్రాణాలతో బయటపడినట్లు సౌదీ స్థానిక అధికారులు తెలిపారు. హైదరాబాద్‌లోని ఆసీఫ్‌నగర్, జిర్రా, టప్పాచబుత్రా, కార్వాన్, దత్తాత్రేయ కాలనీ, ఫలక్‌నుమా, నవాబ్‌సాబ్‌కుంట, తీగలకుంట, నల్లకుంట, విద్యానగర్‌కు మొత్తం చెందిన 45 మంది ఉమ్రా యాత్రకు ఈ నెల 9న శంషాబాద్ విమానాశ్రయం నుంచి వెళ్ళారు. వీరిలో 28 మంది మహిళలు, 17 మంది పురుషులు ఉన్నారు. మరుసటి రోజు వీరంతా సౌదీకి చేరుకున్నారు. మొదటగా వీరంతా 10వ తేదీన మక్కాకు చేరుకుని ఏడు రోజులు అక్కడే ప్రార్థనలు ముగించుకున్నారు. అక్కడి నుంచి మదీనా (ప్రొఫెట్ మహ్మద్ సమాధి) సుమారు 1100 కిలో మీటర్లు ఉంటుంది. ఇక్కడ కూడా ఏడు రోజులు ప్రార్థనలు జరిపేందుకు సోమవారం వారంతా (46 మంది) ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో బయలుదేరారు. మదీనాకు 25 కిలోమీటర్ల దూరంలో వీరి బస్సును ఆయిల్ ట్యాంకర్ తరువాయి 2లో



# అమరుల రక్తతర్పణంతో అనేక విజయాలు

- దేశ రాజకీయ చరిత్రలో సిపిఐ ప్రత్యేక స్థానం
- సాయుధ పోరాటం పలు ఉద్యమాలకు నాంది
- ప్రచారజాతాలో సిపిఐ జాతీయకార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్/డిండి

శతాబ్ది కాలంలో ఎన్నో పోరాటాలు, త్యాగాలు, ఎంతో మంది అమరుల రక్తతర్పణంతో ఎన్నో విజయాలు సాధించి భారత దేశ రాజకీయచరిత్రలో సిపిఐ తన కంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకున్నదని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి గద్దె దించడానికి జరిగిన మహోత్తర తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగున్నర వేల మంది ప్రాణ త్యాగాలతో మూడు వేల గ్రామాల విముక్తి, పది లక్షల ఎకరాల భూమిని పంచిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదేనని వారు గుర్తు చేశారు. ఆనాటి సాయుధ పోరాటమే పలు ఉద్యమాలకు నెలువై అనేకమంది వీరులకు జన్మనిచ్చిందని, ఆ స్ఫూర్తితోనే నేటికి పోరాట గడ్డగా భాసిల్లుతున్నదన్నారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాలు ముగింపును పురస్కరించుకుని గద్వాలలో ప్రారంభమైన బస్సు ప్రచార జాతా సోమవారం నాగర్ కర్నూల్‌కు తరువాయి 12లో

# 50 % కోటా దాటొద్దు

- పరిమితి దాటకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించండి
- మహారాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు కీలక సూచన
- కోటా పరిమితులు ఉల్లంఘిస్తే ఎన్నికలు నిలిపివేయాల్సి ఉంటుందని హెచ్చరిక



**న్యూఢిల్లీ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల పరిమితికి సంబంధించి సుప్రీంకోర్టు సోమవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. వచ్చే నెలలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతం పరిమితికి మించకుండా చూడాలని మహారాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. ఒకవేళ రిజర్వేషన్ కోటా పరిమితులను ఉల్లంఘిస్తే ఎన్నికలను నిలిపివేయాల్సి వస్తుందని హెచ్చరించింది. 2022లో జెకె బాంథియా కమిషన్ తన నివేదికలో ఇతర వెనుకబడిన తరగతుల (ఒబిసి)కు 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సిఫార్సు చేసింది. దానికంటే ముందున్న పరిస్థితి ప్రకారం మాత్రమే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిలతో కూడిన సుప్రీం ధర్మాసనం పేర్కొంది. అయితే మహారాష్ట్ర సర్కార్ తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభ్యర్థన మేరకు తదుపరి విచారణను నవంబర్ 19కి వాయిదా వేసింది. అయితే ఎన్నికల్లో రిజర్వేషన్ల పరిమితి 50 శాతానికి మించకూడదని స్పష్టం చేసింది. 'ఇప్పటికే ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైందని, కోర్టు తన ఆర్డర్‌ను నిలిపివేయాలన్నదే పిటిషన్ సారాంశమైతే, మేము ఎన్నికలను నిలిపివేస్తాం. ఈ సర్వోన్నత న్యాయస్థానం అధికారాలను మీరు పరీక్షించవద్దు. రాజ్యాంగ ధర్మాసనం నిర్దేశించిన 50 శాతం రిజర్వేషన్ పరిమితిని మేము ఎప్పుడూ పెంచాలని అనుకోలేదు. ఈ ధర్మాసనంలో కూర్చున్న మేము అలా చేయలేము కూడా. బాంథియా కమిషన్ నివేదిక ఇప్పటికీ సబ్‌జ్యూడిస్ పరిధిలో ఉంది. అందుకే అంతకు ముందు ఉన్న పరిస్థితి ప్రకారం ఎన్నికలు తరువాయి 12లో



# స్పీకర్‌కు నాలుగు వారాలు గడువు

- ఎమ్మెల్యేల అనర్హత విషయంలో జాప్యంపై 'సుప్రీం' ఆగ్రహం
- కోర్టు ధిక్కార చర్య కింద నోటీసు జారీ

**న్యూఢిల్లీ :** తెలంగాణ రాష్ట్రంలో ఎమ్మెల్యేల అనర్హత సంబంధిత పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. పదిమంది భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను నిర్ణయించడానికి అనర్హతపై నిర్ణయం తీసుకోవాలన్న తన ఆదేశాలను పాటించకుండా జాప్యం చేయడంపై సుప్రీంకోర్టు తెలంగాణ శాసనసభ స్పీకర్‌పై మండిపడింది. కోర్టు ధిక్కార నోటీసు జారీ చేసింది. జులై 31న ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం 10మంది తరువాయి 12లో

# చిలీ అధ్యక్ష ఎన్నికల్లో కమ్యూనిస్టు అభ్యర్థి జారా ఆధిక్యం

**డిసెంబరు 14న తుది విడత పోలింగ్**




**శాంటియాగో:** దక్షిణ అమెరికా దేశం చిలీలో అధ్యక్ష పదవికి జరిగిన మొదటి విడత పోలింగ్ ప్రక్రియలో 80 శాతం ఓట్ల లెక్కింపు పూర్తయ్యేసరికి అధికార కమ్యూనిస్టు పార్టీ కూటమి అభ్యర్థి జీన్నెత్ జారా (51) ఆధిక్యం సంపాదించారు. డిసెంబరు 14వ తేదీన జరిగే తుది విడత ఎన్నికల్లో దేశాధ్యక్ష పదవి చేపట్టేది ఎవరో తేలిపోతుంది. అధికారం పొందాలంటే ఏ అభ్యర్థికైనా 50 శాతం ఓట్లు రావాలి. కానీ ఏ అభ్యర్థికీ ఆ మేరకు ఓట్లు రాకపోవడంతో రన్నాఫ్ పోలింగ్ అనివార్యంగా మారింది. నవంబరు 16వ తేదీన జరిగిన పోలింగ్ ప్రక్రియలో మొత్తం ఎనిమిది మంది అభ్యర్థులు అధ్యక్ష పదవికి పోటీ పడ్డారు. వామపక్ష కూటమి అభ్యర్థి జారాకు ట్రంప్ అనుచరుడుగా చెప్పుకుంటున్న పచ్చిమితవాది జోస్ ఆంటోనియో కాస్ (59) కు మధ్య హోరాహోరీ పోరాటం జరుగుతోంది. మొదటి విడత తరువాయి 2లో


# పేదల ఇళ్లపై బుల్డోజర్లు

- ఖమ్మం జిల్లా అశ్వారావుపేటలో 250 గుడిసెలు నేలమట్టం పేదల ఆర్తనాదాలు, ఆందోళనలతో ఉద్రిక్త వాతావరణం
- సిపిఐ నాయకుల ముందస్తు అరెస్టు



ప్రజాపక్షం/అశ్వారావుపేట

బడుగులపై మరోసారి అధికార యంత్రాంగం తమ ప్రతాపాన్ని చూపింది. వందల ఎకరాలు కబ్జాకు గురవుతున్న పట్టించుకోని అధికార యంత్రాంగం నిరుపేదలు తలదాచుకునేందుకు ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక నివాసాలపై ఐదు జెసిబిలతో తరువాయి 2లో




# మహిళా టెకీ నుంచి రూ.32 కోట్లు కొట్టేసిన కేటుగాళ్లు

### డిజిటల్ అరెస్ట్ పేరుతో బెదిరింపులు

**బెంగళూరులోని ఇందిరానగర్‌లో వెలుగు చూసిన ఘటన**

**ముంబయి:** రోజురోజుకు సైబర్ నేరగాళ్ల రెచ్చిపోతున్నారు. సామాన్యులనే కాకుండా, విద్యావంతులను, టెక్ నిపుణులను కూడా మోసం చేస్తున్నారు. బెంగళూరుకు చెందిన ఓ సీనియర్ మహిళా ఐటి ఉద్యోగిని డిజిటల్ అరెస్ట్ చేస్తామని బెదిరించి ఏకంగా రూ.32 కోట్లు కొట్టేసి న ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. డిజిటల్ అరెస్టు పేరుతో జరిగిన సైబర్ మోసాల్లో ఇదే అతి పెద్దదని పోలీసులు చెబుతున్నారు. బెంగళూరులోని ఇందిరానగర్‌లో ఉమారాణి (57 ఏళ్లు) తరువాయి 12లో



## 'ఐబొమ్మ' ప్లాట్‌ఫామ్‌తో బెట్టింగ్ యాప్స్ ప్రమోట్

- రూ.కోట్లు కొల్లగొట్టిన నిర్వాహకుడు ఇమ్మడి రవి

03

## క్రమంగా 'నరేగా'కు మంగళం

- ఒక్క నెలలోనే 27లక్షల మంది పేర్లు తొలగింపు




05

## కేరళలో బిఎల్ఒ ఆత్మహత్య

## అందరికీ ఇళ్లు, ఆహారం, విద్య



# ప్రపంచం
WORLD NEWS

## జపాన్‌లో బద్దలైన అగ్నిపర్వతం

### విమానాలు రద్దు



**టోక్యో:** జపాన్‌లో సకురాజిమా అగ్నిపర్వత్వం బద్దలైంది. దీంతో లావా, బూడిద 4,400 మీటర్ల ఎత్తున ఆకాశంలోకి ఎగసిపడుతున్నది. ఆ ప్రాంతం అంతా బూడిద కారుమబ్బుల్లా కమ్ముకుంది. గడచిన 48 గంటలుగా ఈ అగ్నిపర్వతం అనేకసార్లు బద్దలై భారీ ఎత్తున టన్నులకొద్దీ బూడిదను బయటకు వెదజల్లుతోంది. దీంతో విమానాల రాకపోకలు రద్దయ్యాయి. ఈ అగ్నిపర్వత విస్ఫోటనంవల్ల ఎవరైనా గాయపడ్డారా,మరణించారా అనే విషయం ఇంకా తెలియరాలేదు. జపాన్ క్రూషూ దీవిలో ఉన్న ఈ అగ్నిపర్వతాన్ని స్ట్రాటో వాల్కనోగా పిలుస్తారు.

## ఢాకా యూనివర్సిటీలో స్వీట్లు పంచుకున్న విద్యార్థులు

**ఢాకా:** హసీనాకు ఉరిశిక్ష తీర్పు ప్రకటించిన తర్వాత ఢాకా యూనివర్సిటీలో విద్యార్థులు స్వీట్లు పంచుకున్నారు. ఉత్సాహభరిత వాతావరణం సృష్టించారు. జులై ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన విద్యార్థులకు మేలు జరిగిందని సర్వత్రా వ్యాఖ్యలు వినిపించాయి. ఢాకా యూనివర్సిటీలో కోర్టు తీర్పు వినడం, చూడటం కోసం లైవ్ టెలీకాస్ట్ నిమిత్తం పెద్ద పెద్ద టీవీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం 11 గంటల నుండే వందలమంది విద్యార్థులు ఈ స్క్రీన్ల వద్ద కొలువుతీరారు. తీర్పు వెలువడిన వెంటనే కేరింతలు కొట్టారు. ఇదిలా ఉండగా, దేశ న్యాయ చరిత్రలో మైలురాయి వంటి తీర్పు అని బంగ్లాదేశ్ అటార్నీ జనరల్ మహ్మద్ అసదుజ్జామన్ అన్నా రు. దేశ ప్రజలు, ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, చట్టపాలన, అమరవీరుల పట్ల ఉన్న బాధ్యతలను నెరవేర్చడంలో భాగంగా ఈ తీర్పు వెలువడిందన్నారు. గత ఏడాది జులై ఉద్యమంలో మరణించిన కుటుంబాలకు, గాయపడినవారికి నష్టపరిహారం చెల్లించాలని కూడా కోర్టు తీర్పు చెప్పిందన్నారు. అవామీలీగ్ పార్టీపై నిషేధంలో కోర్టు జోక్యం చేసుకోలేదన్నారు. అదేవిధంగా బంగ్లాదేశ్ చట్ట విభాగం సలహాదారు ఆసిఫ్ నస్రుల్లా స్పందిస్తూ మాజీ హోంమంత్రి అసదుజ్జామన్ ఖాన్ కమల్ చేసిన తప్పులకు తగిన శిక్ష పడిందని అన్నారు. ఆయనకు విధించిన ఉరిశిక్షను సమర్థించారు.

**హసీనాను దేశానికి రప్పించండి: జమాతే ఇస్లామీ డిమాండ్**

షేక్ హసీనాను దేశానికి రప్పించాలని బంగ్లాదేశ్ జమాత్‌‌–ఎ–ఇస్లామీ ప్రధాన కార్యదర్శి మియా గోలమ్ పోర్వార్ డిమాండ్ చేశారు. హసీనాకు కోర్టు శిక్ష విధించిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ తీర్పును గట్టిగా సమర్థించారు. వెంటనే హసీనాను తమ దేశానికి పంపాలని భారత్‌ను ఆయన నేరుగా డిమాండ్ చేశారు. భారత్ ఒక మంచి పొరుగుదేశంగా ఉండాలనుకుంటే, ఒక మంచి మిత్రదేశంగా బంగ్లాదేశ్‌కు ఉండాలనుకుంటే, వెంటనే హసీనాను తమ దేశానికి పంపించడమే భారత ప్రభుత్వ ప్రథమ, ప్రధాన బాధ్యత, కర్తవ్యమని ఆయన అన్నారు. అదేవిధంగా ట్రైబ్యునల్ ధర్మాసనం ఇచ్చిన తీర్పుకు తిరుగులేదని అన్నారు. ఈ తీర్పు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడుకున్నదని, ఇక ఈ తీర్పును, విచారణను ఎవ్వరూ ప్రశ్నించడానికి వీలులేనిదన్నారు. కోర్టు తీర్పును హసీనా తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ తీర్పు రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నదని ఆమె వ్యాఖ్యానించడంతో పోర్వార్ పైవిధంగా స్పందించారు.



**ఫాసిజానికి హెచ్చరిక: బిఎన్‌పి**

బంగ్లాదేశ్‌లో భవిష్యత్‌లో ఫాసిజం తలెత్తకుండా ఇది కొత్త తరం నాయకులకు ఒక హెచ్చరిక అని బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బిఎన్‌పి) ప్రధాన కార్యదర్శి మీర్జా ఫక్రుల్ ఇస్లాం అలంఘీర్, స్థాయీ సంఘం సభ్యుడు సలాహుద్దీన్ అహ్మద్ వ్యాఖ్యానించారు. ఈ తీర్పు కేవలం హసీనాకు మాత్రమే సంబంధించినది కాదనీ, ఈ దేశం గడ్డమీద జరిగే అన్ని రకాల ఫాసిజానికి, నియంతృత్వానికీ వ్యతిరేకంగా చెప్పిన తీర్పు అనీ మీర్జా ఫక్రుల్ అలంఘీర్ అన్నారు. అవామీలీగ్ నేత, మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనాకు ప్రత్యేక ట్రైబ్యునల్ ఉరిశిక్ష విధిస్తూ ఇచ్చిన తీర్పుపై ఆయన సోమవారం అలంఘీర్ మాట్లాడుతూ, దేశ చరిత్రలో ఈ తీర్పు ఒక మైలురాయి ఘట్టమని అన్నారు. స్వచ్ఛమైన, న్యాయబద్ధమైన తీర్పుకు, భవిష్యత్ నాయకులకు ఒక హెచ్చరికగా హసీనాకేసు తీర్పు ఒక గుణపాఠంగా మారిందని అన్నారు. దేశంలో ఫాసిజం పాలన చెల్లదని, ఏకవ్యక్తి ఇష్టానుసార రాజ్యం సాగదని, ఇక ఎవ్వరూ ఫాసిస్టు పాలకుడుగా మారకూడదని చెప్పడానికి ఈ తీర్పు గుణపాఠమన్నారు. ఇంతకంటే కఠినమైన శిక్షలను చట్టం విధించలేదన్నారు.

## డెమోక్రాట్ల ఉచ్చులో చిక్కుకోవద్దు

### ఎప్స్టీన్ ఫైల్స్‌కు మద్దతుగా ఓటేయాలని ట్రంప్ పిలుపు



**వాషింగ్టన్:** జెఫ్రీ ఎప్స్టీన్ ఫైల్స్‌ను విడుదల చేసేందుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మద్దతు తెలియజేశారు. ఎప్స్టీన్ పత్రాలపై ట్రంప్ మాట మార్చారు. ఎప్స్టీన్ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరపాలన్న డిమాండ్ రోజు రోజుకూ దేశంలో పెరుగుతున్న తరుణంలో ట్రంప్ తన మాట మార్చారు. కాంగ్రెస్‌లో ఈ పత్రాలను విడుదల చేసేందుకు అనుకూలంగా ఓటు వేయాలని తన సొంత రిపబ్లికన్‌పార్టీ నాయకులకు, ప్రజా ప్రతినిధులకు పిలుపు ఇచ్చారు. డెమోక్రాట్లు పన్నిన ఉచ్చులో చిక్కుకోకుండా జాగ్రత్తగా ఉండాలని కోరారు. పార్టీని, ప్రభుత్వాన్ని భ్రష్టు పట్టించడంకోసం రిపబ్లికన్లపై డెమోక్రాట్లు ఉచ్చు బిగించారని, ఈ ఉచ్చులో మనం చిక్కుకోకూడదని హెచ్చరిక చేశారు. "ఇది మన సమస్య కాదు, డెమోక్రాట్ల సమస్య, డెమోక్రాట్లు సృష్టించిన సమస్య, జెఫ్రీ ఎప్స్టీన్ ఒక డెమోక్రాట్, ఇది వారి సమస్యేగానీ మన సమస్య కాదు, అందువల్ల జెఫ్రీ ఎప్స్టీన్‌కు సంబంధించిన పత్రాలన్నీ బహిరంగంగా ప్రజల చేతికి వచ్చేందుకు, అవన్నీ విడుదలయ్యేందుకు వీలుగా చట్టసభలో అనుకూలంగా ఓటు వేయాలని రిపబ్లికన్లకు పిలుపు ఇచ్చారు. ఎప్స్టీన్ పత్రాలతో తమకు సంబంధం లేదని, తన పాత్ర లేదని ఆయన అన్నారు. తన పాత్ర ఉందన్నదాన్ని ఆయన తిరస్కరించారు. హౌస్ ఓవర్‌సైట్ కమిటీతో తమకు సంబంధం లేదని, అనుకూలంగా ఓటు వేయాలని రిపబ్లికన్లను కోరారు. గడచిన పది నెలలుగా మన సాధించిన విజయాలను ప్రచారం చేసుకోవడానికే మనం ప్రాధాన్యత నిద్దాం, ఆ విజయాలను ప్రజల్లో ప్రచారం చేసుకోవడానికే మనం ప్రాముఖ్యతనిద్దాం, డెమోక్రాట్ల ఉచ్చులో చిక్కుకోవద్దు అన్నారు. ఎప్స్టీన్ వ్యవహారం పూర్తిగా ట్రంప్‌కు తెలుసునని, అతగాడితో ట్రంప్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, అతడితో తీయించుకున్న ఫోటోలు ఉన్నాయని పత్రాలు చెబుతున్నప్పటికీ ట్రంప్ ఈ విషయాన్ని వ్యతిరేకిస్తున్నారు. రాబోయే 30 సంవత్సరాలలో ఈ అగ్నిపర్వతం భారీ ఎత్తున బద్దలై తీవ్ర విధ్వంసం సృష్టిస్తుందని 2016లోనే బ్రిస్టోల్ యూనివర్సిటీ అధ్యయన బృందం ఈ ప్రాంతాన్ని పరిశీలించి ఒక నివేదిక సమర్పించింది. ఈ సకురోజిమా అగ్నిపర్వతంలో అతిపెద్దదైన కిటా–డమా శిఖరాగ్రం సముద్రమట్టానికి 3,66 అడుగుల ఎత్తులో ఉంది.

## అమెరికా సైనిక స్థావరాలకు ఈక్వెడార్ ప్రజల తిరస్కృతి

**క్వీటో:** అమెరికా సైనిక స్థావరాలను ఏర్పాటు చేసేందుకు ఈక్వెడార్ ప్రజలు తిరస్కరించారు. విదేశీ స్థావరాలు ఏర్పాటు చేసే విషయంపై జరిగిన రిఫరెండంలో ప్రజలు గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని వ్యతిరేకంగా ఓటు వేశారు. దీంతో ఈక్వెడార్ ప్రతిపక్ష శిబిరంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఈక్వెడార్ ప్రజలు తిరస్కరించడంతో తూర్పు పసిఫిక్ ప్రాంతంలో తన ఉనికిని విస్తరించుకోవాలని అమెరికా చేస్తున్న ప్రయత్నాలు విఫలమయ్యాయి. అమెరికా ప్రభుత్వం తీవ్ర నిరాశకు గురైం ది. అమెరికాకు పూర్తి మద్దతు తెలియజేసే ఈక్వెడార్ అధ్యక్షుడు డేనియల్ నోబోయాకు ఈ రిఫరెండంలో ఓటమి పెద్ద శరాఘాతంగా మారింది. ఈక్వెడార్‌లో విదేశీ సైనిక స్థావరాలు ఏర్పాటు చేయకుండా 2008లో రాజ్యాంగాన్ని సవరిస్తూ ఈక్వెడార్ చట్టసభ ఒక తీర్మానం చేసింది. ఐతే అధ్యక్షుడు నోబోయా ట్రంప్ అనుచరుడుగా ఈ సంప్రదాయాన్ని తిరగరాసేందుకు విశ్వప్రయత్నం చేశారు. రిఫరెండంకోసం జరిగిన ప్రచారంలో రాజ్యాంగాన్ని మారుస్తామని ప్రకటించారు. దేశాధ్యక్షుడి అభిప్రాయాలతో విభేదించిన ప్రజలు ఆయనకు వ్యతిరేకంగా రిఫరెండంలో ఓటు వేశారు. ప్రతిపక్షాలకు మంచి విజయం లభించినట్లయింది. దేశంలో వ్యవస్థీకృత నేరాలను అరికట్టేందుకు, హింసను అరికట్టేందుకు, ప్రపంచంలో మాదక ద్రవ్యాల బెడదకు ఆజ్యం పోస్తున్న దేశంలో ఎదురవుతున్న వ్యతిరేక శక్తులను అరికట్టేందుకు తన ప్రతిపాదన ఎం తో ఉపయోగపడుతుందని ప్రజల్లో ఆయన ప్రచార ం చేశారు.

## బిసిలకు 42 % రిజర్వేషన్లు

(మొదటి పేజీ తరువాయి)

మంతివర్గం తీర్మానించింది. తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం సాయంత్రం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగింది. మంత్రివర్గం సమావేశం నార్ణయాలను అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మ ణ్, ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ, జి.వివేక్ వెంకట్‌స్వామి మీడియాకు వెల్లడించారు. సౌదీ అరేబియాలో బస్సు ప్రమాదంలో మరణించిన బాధిత కుటుంబాలకు రూ.5 లక్షలు పరిహారం అందించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. అదే విధంగా మంత్రి అజారుద్దీన్, ఎంఐఎం ఎంఎల్‌ఎ, మైనారిటీ విభాగానికి చెందిన ఒక అధికారితో కూడిన ప్రభుత్వ ప్రతినిధి బృందాన్ని వెంటనే సౌదీకి పంపించాలని నిర్ణయించింది. చనిపోయిన వారి మృతదేహాలను మత సంప్రదాయం ప్రకారం అక్కడే అంత్యక్రియలు చేయాలని, బాధితకుటుంబ సభ్యులను ఒక్కో కుటుంబానికి ఇద్దరిని తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేయాలని మంతివర్గంలో నిర్ణయించారు.

మంత్రి మంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించి స్థానిక సంస్థలకు వెళ్లాలని అసెంబ్లీలో బిల్లును ఆమోదించినప్పటికీ రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నదని, అయినప్పటికీ ప్రభుత్వం చిత్తశుద్ధితో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను కలిపంచాలని శతవిధాలుగా ప్రయత్నించినా కేంద్రం సహకారం లేకపోవడంతో , బిల్లులు రాష్ట్రపతి వద్దనే ఉన్నదని, కోర్టులలో వ్యతిరేకంగా నిర్ణయం వచ్చిందన్నారు. ఈ విషయంలో న్యాయస్థానంలో పోరాటం చేస్తూనే, 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.3 వేల కోట్లు కొల్పోయే ప్రమాదం ఉన్నదని, ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లు సీట్లు కేటాయిస్తూ, ముందుగా గ్రామ పంచయతీ ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించామని, ఆ తర్వాత కోర్ట్‌లో ఒక నిర్ణయం వచ్చిన తర్వాత ఒక నిర్ణయం తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నదని వివరించారు.

డిసెంబర్ 9 నాటికి ఇందిరమ్మ ప్రభుత్వం రెండేళ్ల పూర్తవుతుందని, సంక్షేమ కార్యక్రమాలతో పాటుఅభివృద్ధి, హైదరాబాద్ కోర్ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి, ఇండస్ట్రీ పాలసీ, సమ్మిట్ అన్నింటినీ ఫోర్త్ సిటీలో డిసెంబర్ 8, 9న గ్లోబల్ సమ్మిట్ ఏర్పాటు చేయాలని , దీనికి సంబంధించిన ఏర్పాట్లు యుద్ధప్రాతిపాదికన చేపట్టాలని, డిసెంబర్ 9న విజన్ డాక్యుమెంట్‌ను ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఒఆర్ఆర్ లోపల ఇండస్ట్రీలు ఉండ కూదనే నియమనిబంధనలు ప్రకారం వాటిని రిప్లేస్ చేయాలని, ఈ స్థలాల్లో మినీ యూత్ జోన్లుగా ఏర్పాటు చేసి, రోడ్డు వేడల్పు ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానికి ఫీజులను వసూలు చేయాలని నిర్ణయించామన్నారు. మంత్రి వివేక్ మాట్లాడుతూ గిగ్ వర్కర్లకు న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. గిగ్ వర్కర్ల చట్టం వారికి న్యాయం చేయడంలో ప్రారంభం దశ మాత్రమేనని, ఇందులో ఏది మంచిది అనే అంశాలను పరిశీలించి అవసరమైతే మార్పులు చేస్తామన్నారు.

**ప్రభుత్వానికి టిజిపిడబ్ల్యుయు కృతజ్ఞతలు**

గిగ్ వర్కర్స్ బిల్లుకు తెలంగాణ మంత్రివర్గం ఆమోదం తెలిపినందుకు తెలంగాణ గిగ్, ప్లాట్ ఫామ్ వర్కర్స్ యూనియన్ (టిజిపిడబ్ల్యుయు) మంత్రివర్గం చారిత్రాత్మక, ప్రగతిశీల నిర్ణయం తీసుకున్నందుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, కార్మిక శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామికి యూనియన్ అభినందనలు తెలియజేసింది. ఈ నిర్ణయం ద్వారా తెలంగాణ ప్రభుత్వం లక్షలాది గిగ్, ప్లాట్ ఫామ్ కార్మికుల సామాజిక భద్రత, గౌరవం, రక్షణ పట్ల ఉన్న అంకితభావాన్ని మరొకసారి చాటిచెప్పిందని టిజిపిడబ్ల్యుయు వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ సలావుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. మన నగరాలు సజావుగా నడవడానికి ప్రతిరోజూ శ్రమిస్తున్న కార్మికుల భవిష్యత్తును మరింత న్యాయబద్ధమైనదిగా, సమగ్రంగా, భద్రంగా మార్చే దిశగా ఇది కీలక అడుగు అని ఆయన పేర్కొన్నారు.

టిజిపిడబ్ల్యుయు ఈ మార్గదర్శక నిర్ణయాన్ని హర్షిస్తున్నదని, గిగ్, ప్లాట్ ఫామ్ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టే అమలు చర్యల్లో యూనియన్ సంపూర్ణంగా సహకరిస్తుందని ఆయన తెలిపారు.

## జారా ఆధిక్యం

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల్లో జారాకు 26.85 శాతం ఓట్లు లభించగా, జాక్‌గా పిలిచే మితవాది ఆంటోనియో కాస్‌కు 23.92 శాతం ఓట్లు లభించాయి. జారాకు మొత్తం 3,475,206 ఓట్లు లభించగా, జాక్‌కు 3,096,653 ఓట్లు లభించాయి. ఇక మధ్యేవాద మితవాదపార్టీ నాయకుడు, ఆర్థికవేత్త ఫ్రాంకో పరిసి అందరినీ ఆశ్చర్యపరుస్తూ మొదటి విడత పోలింగ్‌లో మూడోస్థానంలో నిలిచారు. మాజీ యూట్యూబ్ ప్రొవొకేటర్ రాడికల్, లిబరల్ అభ్యర్థి జోహన్నెస్ కైజర్ నాలుగో స్థానం సంపాదించారు. ఎంతమంది పోటీ చేసినప్పటికి ఎక్కువ ఓట్లు సంపాదించిన మొదటి ఇద్దరు అభ్యర్థుల మధ్య తుది విడత ఎన్నికల పోరాటం జరుగుతుంది. ఈ మేరకు జారాకు, జాక్‌కు మధ్య నువ్వా? నేనా? అనే రీతిలో డిసెంబరు 14న రన్నాఫ్ ఎన్నికలో ప్రజలు తీర్పు ఇవ్వనున్నారు. మూడు మితవాద పార్టీలకు చెందిన అభ్యర్థులు రన్నాఫ్ ఎన్నికల నుండి వైదొలడంతో తుది విడత ఈ ఓట్లన్నీ ఎవరికి వస్తాయన్న ఉత్కంఠ భరిత, ఉద్విగ్న వాతావరణం ఇప్పుడు కొనసాగుతున్నది.

## బుల్డోజర్లు

(మొదటి పేజీ తరువాయి)

దాడి చేసి నేలమట్టం చేశారు. ఆ ఉన్న కొద్ది సామానును బయట వేసుకునేందు కు కూడా అవకాశం ఇవ్వలేదు. కాళ్లా వేళ్లా ప్రాధేయపడిన కనికరించ లేదు. 200 మంది పోలీసులు ఒక యుద్ధ వాతావరణాన్ని తలపించే రీతిలో బడుగుల నివాసాలను కూల్చిన ఘటన సోమవారం తెల్లవారు జామున అశ్వారావుపేటలో జరిగింది. పేదల ఆర్తనాదాలు, ఆందోళనలతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడిం ది. చంటి పిల్లలు, వృద్ధులు చలికి గజగజ వణికిపోయారు.



అశ్వారావుపేటలోని 1228 సర్వే నెంబర్‌లో దాదాపు 250 మంది పేదలు గుడిసెలు వేసుకుని మూడేళ్లుగా జీవిస్తున్నారు. వీటిని కూల్చేందుకు అర్థరాత్రి సమయంలో ఇండ్లలో నిద్రిస్తున్న సిపిఐ నాయకులను అరెస్టు చేసి దమ్మపేట పోలీస్ స్టేషన్‌కు తరలించి ఆ తర్వాత జెసిబిలతో పేదల నివాసాలను నేలమట్టం చేశారు. కాళ్లా వేళ్లా పడ్డ కనికరించ లేదు. కొంతమంది పేదలు అధిక వడ్డీలకు తెచ్చి రేకులు వేసుకుని జీవిస్తున్నారు. ఉన్న గూడు కాస్త కూలిపోవడంతో వారి వేదన వర్ణణాతీతంగా ఉంది. తమకు ప్రభుత్వం వెంటనే ప్రత్యామ్నాయం చూపాలని పేదలు వేడుకుంటున్నారు.

**ప్రత్యామ్నాయం చూపే వరకు కదిలేది లేదు : పాషా**

సిపిఐ ఆధ్వర్యంలో అశ్వారావుపేటలో ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న వారి జీవితాలను అధికార యంత్రాంగం ఛిద్రం చేసిందని ప్రత్యామ్నాయం చూపే వరకు ఆ స్థలం నుంచి కదిలేది లేదని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా తేల్చి చెప్పారు. సోమవారం ధ్వంసమైన ఇండ్లను ఆయన పరిశీలించారు. పేదల గోడును విన్నారు. నిర్దాక్షిణ్యంగా కూల్చివేయడాన్ని సాబీర్‌పాషా తీవ్రంగా ఖండించారు. ఈ కూల్చివేతకు జారే ఆదినారాయణ బాధ్యత వహించాలని సాబీర్‌పాషా తెలిపారు. ప్రజాప్రతినిధి అయి ఉండి పేదల పక్షాన ఆలోచన చేయకుండా పేదల గుడిసెలను కూల్చడం దుర్మార్గమన్నారు. అభివృద్ధికి కమ్యూనిస్టు పార్టీ అడ్డు కాదని కానీ యంగ్ ఇండియా స్కూల్‌కు కేటాయించిన భూమి 18 ఎకరాలు ఉందని పక్కనే ఓ భూస్వామి వందల ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించినా దానిని తీసుకోకుండా పేదలపై కక్ష కట్టారని పాషా తెలిపారు. మాఫియాను తలపించే రీతిలో వ్యవహరిస్తున్న స్థానిక తహసీల్దార్ రామకృష్ణ పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పేదలు ఉండే స్థలమే యంగ్ ఇండియా స్కూల్‌కు అవసరమైతే పేదలకు ప్రత్యామ్నాయం చూపించి వారితో చర్చలు జరిపి భూమిని స్వాధీనం చేసుకుంటే మంచిదన్నారు. యంత్రాలను తీసుకువచ్చి పారా మిలట రీ ద్వారా ధ్వంసం చేయడం దేనికి సంకేతమని ఆయన ప్రశ్నించారు. కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి పేదల విషయం తెలపడంతో పట్టాలు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని కానీ ఇంతలోనే స్థానిక అధికార యంత్రాంగం ఈ దారుణానికి ఒడిగట్టిందన్నారు. ప్రత్యామ్నాయ స్థలం చూపేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, నరాటి ప్రసాద్, సయ్యద్ సలీం, కె. వెంకటేశ్వరరావు, మండల నాయకులు గన్నిన రామకృష్ణ, వి.అర్జున రావు, విజయ్‌కాంత్ , తదితరులు పాల్గొన్నారు.

## భస్మీపటలం

(మొదటి పేజీ తరువాయి)

ఢీ కొట్టింది. క్షణాల్లో మంటలు వ్యాపించి బస్సు మొత్తం దగ్ధమైంది. సహాయ చర్యలు ఆరంభించేలోపే ప్రయాణికులంతా దగ్ధమయ్యారు. ఈ ప్రమాదంలో హైదరాబాద్ ఆసీఫ్‌నగర్‌కు చెందిన షోయబ్ సఫీ అనే యువకుడు ఈ ప్రమాదం నుం చి క్షేమంగా బయటపడ్డాడు. ప్రస్తుతం అతను సౌదీలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇతని ప్రాణాలకు ఎలాంటి హానీ లేదని డాక్టర్లు ధృవీకరించారు. హైదరాబాద్ విద్యానగర్‌కు చెందిన రిటైర్డ్ రైల్వే అధికారి కుటుంబంలోని 18 మంది కూడా ఇదే ప్రమాదంలో దుర్మణం చెందారు.

**సహాయక చర్యల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు**

ప్రమాదానికి సంబంధించిన సమాచారం అందుకున్న వెంటనే భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ సౌదీలోని భారత మిషన్‌లకు పూర్తి సహాయం అందించాలని ఆదేశించారు. కుటుంబాలకు అవసరమై న సమాచారం అందించేందుకు జెడ్డాలో 24/7 కంట్రోల్ రూమ్‌ను తెరిచినట్లు భారత కాన్సులేట్ ప్రకటించింది. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఈ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, మృతుల వివరాలను తక్షణం సేకరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

**హెల్ప్‌లైన్ నంబర్లు ఏర్పాటు !** ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు సహాయం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం రెండు హెల్ప్‌లైన్ నంబర్లను ఏర్పాటు చేసింది. +9179979 59754, +91 99129 19545 నంబర్ల ద్వారా బాధితులకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చు.

**కుటుంబాల ఆర్తనాదం :** సౌదీ ప్రమాదంలో తెలంగాణవాసులు కూడా ఉన్నారని తెలిసిన వెంటనే హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ ప్రాంతాల్లోని అనేక కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురయ్యాయి. తమ సన్నిహితుల మృతదేహాలను స్వదేశానికి తీసుకురావాలని కుటుంబ సభ్యులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను వేడుకుంటున్నారు.



**నాలుగు ట్రావెల్స్ ద్వారా ...**

సౌదీ ఉమ్రా యాత్ర కోసం ఇక్కడి నుంచి నాలుగు ట్రావెల్స్ ఏజెన్సీల ద్వారా మొత్తం 45 మంది వెళ్లారు. వీరిలో మహిళలు 28 మంది ఉండగా పురుషులు 17 మంది ఉన్నారు. అల్‌మక్కా ట్రావెల్స్ నుంచి 15 మంది, బాబుల్ హర్మైన్ ట్రావెల్స్ నుంచి 21 మంది, హఫ్సా ట్రావెల్స్ నుంచి ఐదుగురు, మహమూద్ భాయిజాన్ ట్రావెల్స్ నుంచి నలుగురు వెళ్లారు.

**ఉమ్రా యాత్రకు వెళ్లిన వారి పేర్లు**

మహిళలు : హుమేరా నజ్నీన్, సబీహా సుల్తానా, నసీరుద్దీన్, ఉమైజా, మరియం ఫాతిమా, మెహ్రీష్, రిడా తజీన్, అక్తర్ బేగం, అనీస్ ఫాతిమా, అమీనా బేగం, సారా బేగ్యమ్, షబానా బేగం, రిజ్వానా బేగం, ఫరానా సుల్తానా, తస్మియా తహ్రీన్, సనా, గౌసియా బేగం, జహీన్ బేగం, ఫర్హీన్ బేగం, షౌకత్, జకియా, పర్వీన్ బేగం, షెహ్నాజ్, రహమత్‌బిన్, రహీమ్ ఉన్నిసా, రేయీస్ బేగం, షాజెహాన్, సారా మహమూద్.

పురుషులు : ఇర్ఫాన్ అహ్మద్, హమదాన్, ఇజాన్, షేక్ జైన్ ఉద్దీన్, మహమ్మద్, ఉజైరుద్దీన్, సలీమ్, హుజైఫా జాఫర్, సలావుద్దీన్, మహమ్మద్ అలీ, అబ్దుల్ ఖాదీర్, మొహమ్మద్ షోయబ్, మహమ్మద్ మంజూర్, మస్తాన్, సోహైల్, మొహమ్మద్ మౌలానా, శిరహట్టి.

**నష్ట పరిహారం అందించాలని కేబినెట్ నిర్ణయం**

సౌదీ ఆరేబియాలో మక్కా నుంచి మదీనాకు ప్రయాణిస్తున్న బస్సు ప్రమాదానికి గురైన దుర్ఘటనలో మరణించిన తెలంగాణాకు చెందిన బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందించాలని తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశం ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ నేతృత్వంలో ఎంఐఎం ఎంఎల్‌ఎ, మైనారిటీ విభాగానికి చెందిన ఒక అధికారితో కూడిన ప్రభుత్వ ప్రతినిధి బృందాన్ని వెంటనే సౌదీ అరేబియాకు పంపించాలని మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. చనిపోయిన వారి కుటుంబ సభ్యుల నిర్ణయం మేరకు మృతదేహాలకు మత సంప్రదాయాల ప్రకారం అక్కడే అంత్యక్రియలు చేయాలని, అందు కోసం బాధిత కుటుంబ సభ్యులను ఒక్కో కుటుంబం నుంచి ఇద్దరిని సౌదీ అరేబియా తీసుకెళ్లడానికి వీలుగా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు.

**ప్రధాని మోదీ, సిఎం దిగ్భ్రాంతి**

'మదీనాలో జరిగిన ప్రమాదంలో హైదరాబాద్ వాసులు 45 మంది మరణించడం తనకు చాలా బాధ కలిగించింది. తమ ప్రియమైన వారిని కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నాను. గాయపడిన వారంతా త్వరగా కోలుకోవాలి' అని ప్రధాని తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. రియాద్‌లోని భారత రాయబార కార్యాలయం, జెడ్డాలోని కాన్సులేట్ సాధ్యమైనంత సహాయం అందిస్తున్నాయని ప్రధాని తెలిపారు. భారత అధికారులు సౌదీ అరేబియా అధికారులతో సహాయక చర్యల్లో ఉన్నారని వెల్లడించారు.

సౌదీ అరేబియాలో తెలంగాణ యాత్రికులతో ఉన్న బస్సు ఘోర ప్రమాదంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మక్కా నుంచి మదీనా వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని తెలిసిన వెంటనే స్పందించిన సిఎం పూర్తి వివరాలు తెలుసుకోవాలని సిఎస్, డిజిపిని అదేశించారు. తెలంగాణకు చెందిన వారు ఎంత మంది ఉన్నారని ఆరా తీశారు. కేంద్ర విదేశాంగ శాఖ, సౌదీ ఎంబసి అధికారులతో మాట్లాడాలని సూచించారు. వెంటనే తగిన సహాయక చర్యలకు రంగంలోకి దిగాలని అదేశించారు. సిఎం అదేశాలతో సిఎస్ రామకృష్ణారావు ఢిల్లీలో ఉన్న కోఆర్డినేషన్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్‌ను అప్రమత్తం చేశారు. ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారు ఎంత మంది ఉన్నారనే వివరాలు సేకరించి వెంటనే అందించాలని అదేశించారు. సచివాలయం లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.

## ఉరిశిక్ష

(మొదటి పేజీ తరువాయి)

ఉపయోగించాలని హసీనా ఆదేశాలు ఇచ్చారని రెండో కారణంగా చూపించింది. జులైలో ప్రారంభమైన ఉద్యమంలో దాదాపు 1400 మంది మరణించారని, వీరిలో ఎక్కువమంది భద్రతా దళాల కాల్పుల్లోనే మరణించారని ఐక్యరాజ్యసమితి మానవహక్కుల సంఘం నివేదిక ఇంతకుముందే ప్రకటించింది.

మానవత్వానికి వ్యతిరేకంగా అణచివేత, హత్యలు, చిత్రహింసలు వంటి నేరాలు సహా మొత్తం ఐదు ప్రధాన కారణాలను చూపిస్తూ త్రిసభ్య ధర్మాసనం సోమవారం సంచలన తీర్పు ఇచ్చింది. గత ఏడాది జులైనెలలో నిరాయుధులైన యువతరం తిరుగుబాటును కుట్రపూరితంగా వ్యవహరించి మారణాయుధాలతో అణచివేశారని, ప్రజల సమస్యలు అర్థం చేసుకోకుండా మానవత్వానికి వ్యతిరేకంగా హత్యలకు పాల్పడ్డారని పేర్కొంది. తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు, పేలుడు ఘటనలు, హింసాకాండ కొనసాగుతున్న తరుణంలో భారీ భద్రత మధ్య ధర్మాసనం తీర్పును లైవ్ టెలికాస్ట్ చేశారు. నెలలపాటు విచారణ అనంతరం ప్రాసిక్యూషన్ ముందునుండీ కోరిన విధంగా తీర్పు వెలువడింది.

**భారత్–బంగ్లాదేశ్ దౌత్య సంబంధాలకు అగ్నిపరీక్ష !**

హసీనా కేసు తీర్పుతో భారత్–బంగ్లాదేశ్ సంబంధాలపై పలు వ్యాఖ్యలు వెలువడుతున్నాయి. ఈ రెండు దేశాలమధ్యా దౌత్య సంబంధాలు ఇక మరింత అగ్ని పరీక్షకు గురవుతాయని అంతర్జాతీయ మీడియా వ్యాఖ్యానాలు ప్రారంభించింది. ఈ తీర్పుతో భారత్‌కు సమస్యలు మొదలవుతాయని, హసీనాను అప్పగించాలని మహ్మద్ యూనుస్ మోదీ ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తీసుకురావడం ద్వారా ఈ అంశం బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో ప్రచారాంశంగా మారుతుందని పేర్కొన్నాయి. ఐతే హసీనాను అప్పగించాలని భారత్‌పై బంగ్లాదేశ్ ఒత్తిడి తెచ్చేఅవకాశం ఉండదని బిబిసి వ్యాఖ్యానించింది. కానీ హసీనాను తరలించాలని బంగ్లాదేశ్ హై కమిషన్ ఇప్పటికే పలుసార్లు భారత్‌ను కోరింది. కేంద్రం ఎలాం టి సమాధానం చెప్పలేదు.

రెండు దేశాల మధ్య ఇప్పటికే దౌత్య సంబంధాలు తీవ్ర ఒడిదొడుకులు ఎదుర్కొంటున్నాయి. భారత్ వ్యాపారానికి నష్టం కలుగుతోందన్న కారణంగా మోదీ ప్రభు త్వం భారత మౌలిక సదుపాయాలను బంగ్లాదేశ్ వ్యాపారులకు సమకూర్చడం మానేసింది. దీంతో ఆ దేశానికి ఎగుమతుల నష్టం వాటిల్లింది. మహ్మద్ యూనుస్ ప్రభుత్వానికి చైనా,పాకిస్థాన్‌లతో క్రమంగా గాఢానుబంధం పెరుగుతోంది. పాకిస్థాన్,బంగ్లాదేశ్ మధ్య విమాన రాకపోకలు ప్రారంభమయ్యాయి. వాణిజ్యానికి తమ ఓడరేవులను ఉపయోగించుకోవాలని పాకిస్థాన్ బంపర్ ఆఫర్ ఇచ్చింది.

**ఉగ్రవాదుల కుట్ర ప్రపంచానికి తెలిసింది : హసీనా**

భారత్‌లో అజ్ఞాతవాసంలో ఉన్న షేక్ హసీనా బంగ్లాదేశ్ ప్రత్యేక ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పుపై స్పందించారు. ఈ తీర్పు ప్రజాస్వామ్యబద్ధమైనది కాదని, రాజ్యాంగబద్ధంగా ఎన్నిక కాని ఒక తాత్కాలిక ప్రభుత్వం దురుద్దేశంతో ఈ ప్రత్యేక ట్రైబ్యునల్‌ను ఏర్పాటు చేసిందని, ఈ తాత్కాలిక ప్రభుత్వానికీ, ట్రైబ్యునల్‌కు ప్రజాతీర్పు లేదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక న్యాయబద్ధమైన ధర్మాసనం ఎదుట, తనపై నిందలు వేసినవారిని ఎదుర్కొనేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, కానీ విచారణ న్యాయబద్ధంగా జరగాలన్నారు. ఈ ట్రైబ్యునల్ న్యాయబద్ధంగా విచారణ చేయలేదని, ఇది మోసపూరితమైన ట్రైబ్యునల్ అనీ విమర్శించారు.

ధర్మాసనం తీర్పును,ప్రాసిక్యూషన్ చేసిన ఈ ఆరోపణలను తాను సంపూర్ణంగా తిరస్కరిస్తున్నానని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన తన ప్రభుత్వాన్ని తొలగించేందుకు తాత్కాలిక ప్రభుత్వంలో ఉన్న ఉగ్రవాద శక్తుల హత్యాపూర్వకమైన దుర్మార్గపు ఉద్దేశాలు ఈ తీర్పుతో బహిర్గతమయ్యాయని విమర్శించారు. బంగ్లాదేశ్‌లో ఒక ప్రధాన రాజకీయశక్తిగా ఉన్న అవామీ లీగ్‌ను నామరూపాలు లేకుండా చేసేందుకు, ఎన్నికైన ప్రధానమంత్రిని పదవి నుండి తొలగించేందుకు వారు చేసిన కుట్రలు ఈ తీర్పుతో ప్రపంచానికి తెలిసి వచ్చాయన్నా రు.

రాజకీయ దురుద్దేశంతోనే ప్రత్యేక కోర్టు ఇలాంటి తీర్పు ప్రకటించిందని హసీనా విమర్శించారు. ధర్మాసనం తీర్పు పక్షపాత ధోరణితో కూడుకున్నదని విమర్శించారు. "ఇది మోసపూరితమైన ధర్మాసనం, మోసం చేయడంకోసం ఈ ట్రైబ్యునల్ ఏర్పాటుచేశారు, రాజకీయ దురుద్దేశంతోనే ఈ తీర్పు ప్రకటించారు" అని హసీనా తన ప్రకటనలో ఉరిశిక్ష తీర్పును తిరస్కరించారు. తాను అజ్ఞాతంలో ఉన్న సమయంలో తను చెప్పకుండా, తాను కోర్టు సమక్షంలో లేకుండా పక్షపాత ధోరణితో న్యాయ విచారణ జరిపారని తప్పుపట్టారు. ఈ పరిణామాలను ముందుగానే ఊహించిన హసీనా గతవారంలో పిటిఐ వార్తాసంస్థకు ఇచిన్న ఆన్‌లైన్ ఇంటర్వ్యూలో, "దేశంలో అందరిభాగస్వామ్యంతో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించి న్యాయబద్ధమైన పరిపాలనకు అవకాశం కల్పిస్తే తాను దేశానికి తిరిగి వస్తానని, కోర్టు ఎదుట కూడా హాజరవుతానని ప్రకటించారు. అదేవిధంగా బిబిసికి కూడా తీర్పుకు ముందుగా బిబిసికి ఇచ్చిన ఇంటర్వ్యూలో హసీనా మాట్లాడుతూ, తాను లేకుండా జరిగిన ఈ విచారణ ప్రక్రియను "కంగారూ కోర్టు"గా అభివర్ణించారు.

ఉద్యమకారులు అదుపు చేయడానికి సాధ్యంకానిరీతిలో వేలాదిమంది ప్రధానమంత్రి నివాసంమీదకు దూసుకురావడంతో ఎటూపాలుపోని స్థితిలో గత ఏడాది ఆగస్టు ఐదో తేదీన ప్రత్యేక వాహనంలో గగనమార్గం ద్వారా షేక్ హసీనా భారత్‌కు వచ్చి తలదాచుకున్నారు. దీంతో 15 సంవత్సరాలపాటు బంగ్లాదేశ్‌లో నిరాఘాటంగా కొనసాగిన ఆమె పరిపాలనకు తెరపడింది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఇంటర్నేషనల్ పారా స్విమ్మర్ అజీమ్‌ను అభినందించిన మంత్రి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇంటర్నేషనల్ పారా స్విమ్మర్ మొహమ్మద్ అజీమ్‌ను క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఘనంగా సన్మానించారు. నగరంలోని గచ్చిబౌలిలో జరుగుతున్న 25వ పారా నేషనల్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్‌లో కేరళ రాష్ట్రానికి చెందిన అజీమ్ 3 స్వర్ణ పతకాలు సాధించాడు. ఈ సందర్భంగా రాష్ట్ర సచివాలయంలో మర్యాదపూర్వకంగా మంత్రి వాకిటి శ్రీహరిని కలిశారు. గోల్డ్ మెడల్స్ సాధించినందుకు అజీమ్‌ను ఆప్యాయంగా హత్తుకొని మరీ అభినందించారు. పుట్టుకతోనే అంగవైకల్యంతో రెండు చేతులు లేకున్నా, ఒక కాలు చిన్నదిగా ఉన్నా కూడా స్విమ్మింగ్‌లో ప్రతిభ కనబరచి మూడు గోల్డ్ మెడల్స్ సాధించడం అంత ఆషామాషీ విషయం కాదన్నారు.

# ఎర్రజెండాలన్నీ ఏకమైతేనే ప్రజాస్వామ్య లౌకిక వ్యవస్థ పరిరక్షణ



### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

**ప్రజాపక్షం/కరీంనగర్/చిగురుమామిడి :** అబద్ధాల పునాదులపై ఏర్పడ్డ బిజెపి ప్రభుత్వం దేశంలోని సంపదనంతా కార్పోరేట్ పెట్టుబడిదారి వర్గాలకు దోచిపెడుతోందని, బిజెపి దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య, రాజ్యాంగ, లౌకిక వ్యవస్థ పరిరక్షణ కోసం ఎర్రజెండాలన్నీ ఏకమై పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయడం కోసం ఈ నెల 15న జోడే ఘాట్‌లో ప్రారంభమైన ప్రచార జాత సోమవారం కరీంనగర్‌కు చేరుకుంది. జాతాకు నాయకత్వం వహిస్తున్న చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాస్‌రావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్‌లతో పాటు జాతాలో వస్తున్న రాష్ట్ర నాయకులకు సిపిఐ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో పద్మనగర్‌లో పూలమాలలు వేసి ఎర్ర కండువాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన పార్టీ జెండాను చాడ వెంకటరెడ్డి ఎగురవేశారు. పద్మనగర్ నుంచి రాంనగర్, మంకమ్మతోట, గీతాభవన్ చౌరస్తా వరకు సిపిఐ శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. గీతాభవన్ చౌరస్తా వద్ద చాడ వెంకటరెడ్డి మాట్లాడారు. కార్మికులు, కర్షకులు, ప్రజల పక్షాన నిలబడుతూ పెట్టుబడిదారీ విధానానికి వర్గ దోపిడీకి వ్యతిరేకంగా సమాజంలో అంతరాలు లేని సమసమాజ స్థాపన కోసం ఆవిర్భవించిన పార్టీ సిపిఐ అన్నారు. దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలు సింగరేణి, టెలికాం, రైల్వే విమానయాన సంస్థలతో పాటు అనేక సంస్థలను ప్రైవేట్‌పరం చేసి ఆదానీ, అంబానీలాంటి వారికి కట్టబెడుతూ దేశ సంపదనంతా నిర్వీర్యం చేస్తున్నాడని ఆరోపించారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్‌లు మాట్లాడుతూ ఖమ్మంలో డిసెంబర్ 26న భారీ బహిరంగసభ నిర్వహిస్తున్నామని, దేశం నలుమూలల నుంచి లక్షలాదిమంది తరలి రానున్నారని, ఆ బహిరంగసభను విజయవంతం చేయడం కోసం రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో రాష్ట్ర జాతాలు పర్యటిస్తున్నాయని తెలిపారు. జాతాలో తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, రాష్ట్ర నాయకులు రెహ్మాన్, కన్నం లక్ష్మి నారాయణలు ఉన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, అందె స్వామి, జిల్లా కార్యవర్గ కౌన్సిల్ సభ్యులు కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, పిట్టల సమ్మయ్య, పైడిపల్లి రాజు, కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్, న్యాలపట్ల రాజు, బీర్ల పద్మ, కొట్టె అంజలి, ఉమ్మెంతల రవీందర్‌రెడ్డి, కంది రవీందర్‌రెడ్డి, బండ రాజిరెడ్డి, మచ్చ రమేష్, బామండ్లపెల్లి యుగేందర్, పిట్టల శ్రీనివాస్, బూడిద సదాశివ, నాయకులు కాశెట్టి లక్ష్మణ్, అలిశెట్టి భారతి, కసిబోజుల సంతోష్‌చారి, చెంచల మురళి, గామినేని సత్యం, రాము, సత్యనారాయణ, మమత తదితరులున్నారు.

**ప్రజల సమస్యల పరిష్కారం కోసమే సిపిఐ పోరాటం**

చిగురుమామిడి మండల కేంద్రంలో బస్టాండ్ చౌరస్తా వద్ద మండల నాయకత్వం జాతకు స్వాగతం పలికింది. బస్టాండ్ చౌరస్తాలో ఉన్న డా.బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి చాడ వెంకటరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకు ముందు తిమ్మాపూర్ మండలం ఇంద్రనగర్ గ్రామంలో బస్సు జాత చేరుకోగా మండల కార్యదర్శి బోయిని తిరుపతి ఆధ్వర్యంలో జాతకు ఘన స్వాగతం తెలిపారు. కళాకారుల ఆటపాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి సిపిఐ వందేళ్ల పోరాట పటిమను ప్రజలకు తెలిసేలా సిపిఐ జాతీయ, రాష్ట్ర నాయకులు వివరించారు. జాతాలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి సురేందర్ రెడ్డి, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నర్సింహా, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ ఉన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యు లు అందె స్వామి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, గూడెం లక్ష్మి, జిల్లా కౌన్సిల్ సభ్యులు అందె చిన్నస్వామి, చాడ శ్రీధర్‌రెడ్డి, బోయిని సర్దార్ వల్లభాయ్ పటేల్, మావురపు రాజు, కాంతాల శ్రీనివాస్ రెడ్డి, తేరాల సత్యనారాయణ, మండల సహాయ కార్యదర్శులు బూడిద సదాశివ, పైడిపల్లి వెంకటేష్‌తో పాటు మండల నాయకులు పాల్గొన్నారు.

# భవిష్యత్తు వామపక్షాలదే

### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ



**ప్రజాపక్షం/సదాశివపేట/సంగారెడ్డి:** భవిష్యత్తు వామపక్షాలదే అని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ అన్నారు. ఈ దేశంలో పెట్టుబడిదారి అలాగే మత తత్వ వాదులు ఎన్ని కుట్రలు చేసినా భవిష్యతు వామపక్షాలు అని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ తెలిపారు. సోమవారం రోజున సిపిఐ శతాబ్ది ఉత్సవాలు రాష్ట్రజాత సదాశివపేటకు రావడం జరిగింది. జాతకు నాయకత్వం వహిస్తున్న పశ్యపద్మ మాట్లాడుతూ భారతదేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పుట్టి వంద సంవత్సరాలు అవుతున్న తరుణంలో పార్టీ యొక్క మన కీర్తిని రాష్ట్ర వ్యాప్తంగా తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం అనే నినాదంతో సీపీఐ పార్టీ అనేక పోరాటాలు చేసి లక్షలాది మంది నిరుపేదలకు సాగు భూములు ఇళ్ల స్థలాలు ఇప్పించిన చరిత్ర సిపిఐది అలాంటి పేదల పార్టీ ఈ దేశంలో వంద సంవత్సరాలు పూర్తి చేసుకోవడం నిజంగా పేదల విజయం అన్నారు. రాబోవు కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాలు రాష్ట్ర జాత సంగారెడ్డి, పటాన్‌చెరులో సోమవారం కొనసాగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాల్, ఎం.రహ్మాన్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.తాజుద్దీన్, ఎండి.షఫీ, పాండు జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎం.గంగమ్మ, ముస్తఫా, శంకరప్పా, సాదిక్ అలీ, వెంకట్ గౌడ్, పులమ్మా, చంద్రయ్య, యశ్వంత్, అనుసూజ, బుజ్జమ్మ, లక్ష్మి, బిపాపా దేవిలు పాల్గొన్నారు.

**భరత్‌నగర్‌లో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్న నాయకులు**

రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న బస్సు యాత్రతో జహీరాబాద్ పట్టణ జాతీయ రహదారిపై ప్రదర్శన, ర్యాలీని నాయకులు నిర్వహించారు. ఈ ర్యాలీలో ముఖ్యఅతిథులుగా స్థానిక ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ ఇంచార్జ్ ఎ.చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు. జహీరాబాద్ పట్టణ పరిధిలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న బస్సు యాత్ర జహీరాబాద్‌లోకి సిపిఐ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జహీరాబాద్ పట్టణ పటేల్ గార్డెన్ ఫంక్షన్ హాల్ నుండి జాతీయ రహదారిపై బైక్ ర్యాలీ నిర్వహిస్తూ భరత్‌నగర్ వరకు నిర్వహించారు. భరత్ నగర్ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా డప్పుసప్పుల్లతో పాటలు నిర్వహించారు. అనంతరం భరత్ నగర్‌లో సుమారు 25 కేజీల కేక్ కట్ చేసి భరతనగర్ వాసులతో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ సంబరాలు చేసుకున్నారు. భరత్ నగర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ మాట్లాడుతూ సిపిఐ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్నది అంటే ఈ సంవత్సరాలలో ఎంతో మంది నాయకులు కార్యకర్తలు త్యాగాలు చేసి ఆ రోజులలో బ్రిటిష్ పరిపాలనకు వ్యతిరేకంగా కొట్లాడింది. కూడా సిపిఐ ఎక్కడ సమస్య ఉంటే అక్కడ నిరంతరం పోరాటం చేసి ప్రజలకు ఎల్లప్పుడు అండగా నిలబడే భారత దేశంలో ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని కొనియాడారు. జహీరాబాద్ ప్రాంతంలో కూడా గతంలో టీఆర్ఎస్ హయాంలో నిమ్స్ పేరుతో పేద ప్రజల భూములు లాక్కొని వాళ్లను మోసం చేసింది. టీఆర్ఎస్ ఏ రోజు కూడా భూ బాధ్యతల పక్షాన నిలబడి భూ పోరాటం చేసిన చరిత్ర కూడా సిపిఐదే అన్నారు. ఇక ముందు కూడా ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చినా ఎర్రజెండా సిపిఐ నిలబడతదని పేర్కొన్నారు. డిసెంబర్ 26న జరిగే ఖమ్మంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి నరసింహ, సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు ,తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జహీరాబాద్ శాసనసభ్యులు కొనేంటి మాణిక్ రావు, మాజీ మంత్రి ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ ఎ.చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ యువత మండల అధ్యక్షులు పట్టణ మాజీ టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు సయ్యద్ మ్యూజియం భరత్‌నగర్ వాసులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# 'ఐబొమ్మ' ప్లాట్‌ఫామ్‌తో బెట్టింగ్ యాప్స్ ప్రమోట్

### రూ.కోట్లు కొల్లగొట్టిన నిర్వాహకుడు ఇమ్మడి రవి
### పోలీసులకు చిక్కకుండా వేరే దేశ పౌరసత్వం
### వివరాలు వెల్లడించిన హైదరాబాద్ సిపి వి.సి.సజ్జనార్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఐబొమ్మ, బప్పం ఫ్లాట్‌ఫామ్‌ల ద్వారా పైరసీ సినిమాలను ప్రేక్షకులకు అందించడంతో పాటు ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తూ రూ.కోట్లు కొల్లగొడుతున్న ఐబొమ్మ, బప్పం ఫ్లాట్ ఫామ్ నిర్వాహకుడు ఇమ్మడి రవిని కటకటాల్లోకి పంపామని హైదరాబాద్ సిపి. విసి. సజ్జనార్ తెలిపారు. బంజారాహిల్స్‌లోని ఐసిసిసిలో సోమవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొత్త సినిమాలను థియేటర్‌లోకి వచ్చిన కొద్దిగంటల్లోనే పైరసీ చేస్తూ టాలీవుడ్ ఫిల్మ్ ఇండస్ట్రీతో పాటు కొలివుడ్, మాలివుడ్ ఇండస్ట్రీలకు రూ.వేల కోట్ల నష్టం కలిగజేస్తున్న నిందితుడు ఇమ్మడి రవిని సైబర్ క్రైమ్ పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. నిందితుడిపై ఐటీ యాక్ట్, కాపీ రైట్ యాక్ట్ కింద మరో 4 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. పోలీసుల నుంచి తప్పించుకోవడానికి ఒక వెబ్‌సైట్‌ను బ్లాక్ చేస్తే మరో కొత్త వెబ్‌సైట్‌ను తయారు చేసేవాడని, ఇలా మొత్తం 65 మిర్రర్ వెబ్‌సైట్లను నిర్వహించినట్లు సిపి వెల్లడించారు. 1972లో విడుదలైన గాడ్‌ఫాదర్ నుంచి ఇటీవల వచ్చిన ఓజి వరకు మొత్తం 21 వేల సినిమాలు అతడి హార్డ్‌డిస్క్‌లో గుర్తించమన్నారు. పైరసీ, బెట్టింగ్ ప్రమోషన్స్ ద్వారా సుమారు రూ.20 కోట్ల వరకు సంపాదించాడని, అందులో రూ.3 కోట్లు సీజ్ చేశామన్నారు. నిందితుడి వద్ద 50 లక్షల మంది సబ్‌స్క్రైబర్ల డేటా ఉందని, దీన్ని సైబర్ నేరగాళ్లు వాడుకునే అవకాశం ఉందని హెచ్చరించారు.

**ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్‌తో అమాయకులకు వల..**

పైరసీ వెబ్‌సైట్ల ద్వారా లక్షలాది మంది వినియోగదారులను 1విన్, 1ఎక్స్‌బెట్ వంటి అక్రమ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌లకు మళ్లించాడని, దీని కారణంగా ఎంతో మంది అమాయకులు జీవితాలను నాశనం చేసుకున్నారని సిపి సజ్జనార్ పేర్కొన్నారు. ఈ బెట్టింగ్‌కు వ్యసనపరులై కొందరు ఆత్మహత్యలు కూడా చేసుకున్నారని విచారణ వ్యక్తం చేశారు. పైరసీ కేసుతో పాటు బెట్టింగ్ యాప్‌ల కోణాన్ని మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నామని సిపి తెలిపారు. గేమింగ్, బెట్టింగ్ యాప్‌ల ప్రకటనల ద్వారా కోట్ల రూపాయల ఆదాయం సంపాదించి, ఆ డబ్బుతో ఆధునిక డొమెయిన్లు, హోస్టింగ్ వ్యవస్థలు ఏర్పాటు చేసుకున్నాడని, నెదర్లాండ్స్, స్విట్జర్లాండ్ వంటి దేశాలలో ఫిజికల్ సర్వర్లను ఏర్పాటు చేసుకున్నట్లు గుర్తించామన్నారు. ఈ ఏర్పాట్ల వల్ల అతడి పైరసీ నెట్‌వర్క్‌ను గుర్తించడం, బ్లాక్ చేయడం 'లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీస్'కు చాలా కష్టమైన పనిగా మారిందన్నారు. భారత చట్టాల(శిక్షలు) నుంచి తప్పించుకోవడానికి ఆయన భారత పౌరసత్వాన్ని వదిలి సెయింట్ కిట్స్‌ఎల్ అండ్ నెవిస్ అనే దేశ పౌరసత్వం పొందాడని తెలిపారు. నెదర్లాండ్స్, స్విట్జర్లాండ్, అమెరికా, థాయ్‌లాండ్, ఫ్రాన్స్, దుబాయ్ వంటి దేశాలకు తరచూ ప్రయాణించి బెట్టింగ్ అప్లికేషన్ ఆపరేటర్లతో కలిసి పనిచేశాడని, ప్రపంచవ్యాప్తంగా భారీ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నట్లు గుర్తించమన్నారు. ఈ కేసుల్లో కోట్లాది రుపాయాలు మనీలాండరింగ్ జరిగినట్లు దర్యాప్తులో గుర్తించామని, డబ్బును విదేశాలకు అక్రమంగా తరలించినట్లు రుజువులు లభించడంతో ఈ వ్యవహారంపై ఈడీకి కూడా సమాచారం ఇస్తామని సిపి తెలిపారు.



అదనపు సిపి ఎం.శ్రీనివాసులు, డిసిపి దారా కవిత మార్గదర్శకత్వంలో సైబర్ క్రైమ్ యూనిట్ అధికారులు క్లిష్టమైన పైరసీ సైబర్ నెట్‌వర్క్‌ను పూర్తిగా నిర్వీర్యం చేశారని తెలిపారు. తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ యాంటిపైరసీ సెల్, హైదరాబాద్ సిటీ పోలీస్ పైరసీని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాయని, అధికారిక ఒటిటి ప్లాట్‌ఫాంలలో మాత్రమే సినిమాను వీక్షించాలని, అనుమానాస్పద వెబ్‌సైట్లు గుర్తిస్తే వెంటనే 1930 లేదా cybercrime.gov.in కు నివేదించాలని సిపి. విసి.సజ్జనార్ ప్రజలను కోరారు. పాత్రికేయుల సమావేశానికి హాజరైన హీరోలు చిరంజీవి, నాగార్జున, ప్రొడ్యూసర్లు దిల్‌రాజు, సురేష్‌బాబు, దర్శకుడు రాజమౌళి మాట్లాడుతూ పైరసీని ప్రోత్సహించకూడదని విజ్ఞప్తి చేశారు. ఒక సినిమా నిర్మించడానికి లైట్ బాయ్ నుంచి మొదలు కొని వేల మంది కష్టపడాల్సి ఉంటుందని, ఒక్క వ్యక్తి మోసానికి ఇంతమంది బాధపడాల్సి వస్తుందన్నారు. సినిమా పైరసీతో పాటు బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్‌తో అమాయకుల జీవితాలను బలి చేస్తున్నాడని మండిపడ్డారు. పైరసీ చేయడానికి వీలు లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకురావాలని కోరారు.

## లెవెల్ క్రాసింగ్ వద్ద భద్రత ముఖ్యం

### దక్షిణ మధ్య రైల్వే జిఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైలు కార్యకలాపాల భద్రత నిర్వహణలో లెవెల్ క్రాసింగ్ వద్ద అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అన్నారు. అన్ని లెవెల్ క్రాసింగ్ గేట్ల వద్ద భద్రతా ప్రోటోకాల్లను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో సోమవారం ఆయన భద్రత ట్రాఫిక్ సౌకర్యాల పనులపై అధికారులతో వివరణాత్మక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షాసమావేశంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ శ్రీ సత్య ప్రకాష్, వివిధ శాఖలకు చెందిన ప్రధానాధిపతులతోపాటు మొత్తం సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు నాందేండ్ డివిజనల్ రైల్వే మేనేజర్లు (డి.ఆర్.ఎంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మూసాపేట సర్కిల్-23** GHMC

NIT No.38/GHMC/MPT/EE/2025-26 తేది:17.11.2025

పని పేరు: నాలుగు (04) సివిల్ పనుల కోసం బిడ్లను ఆహ్వానిస్తున్నారు. ఈ బిడ్‌లను సమర్పించడానికి బిడ్ల స్వీకరణ తేది:19.11.2025 ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుంది. బిడ్ల ఆఖరి తేదీ: 26.11.2025 ఉదయం 10.30 గంటలుగా నిర్ణయించారు. టెండర్‌కు సంబంధించిన అధికారి పేరు & చిరునామా: శ్రీ ఇ.యు. రమేష్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిహెచ్‌ఎంసి, మూసాపేట్ సర్కిల్ – 23, మరియు ఆయన సెల్ నెంబర్ 9949994029. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిహెచ్‌ఎంసి, మూసాపేట్ సర్కిల్-23

DIPR R.O. No. : 10837-PP/CL/ADVT/1/2025-26, Date: 17-11-2025

తెలంగాణ ప్రభుత్వం దేవాదాయ శాఖ
**శ్రీ యల్లమ్మ అమ్మవారి దేవస్థానము**
దర్వేశిపురం గ్రామం, కనగల్లు మండలం, నల్గొండ జిల్లా.
టెండరు కం బహిరంగవేలము

టెండర్ నోటీస్ నెం. 33/SYT/2025 తేది: 15/11/2025

ఇందు మూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా! సదరు దేవస్థానమునకు సంబంధించిన టెండరు కం బహిరంగవేలము వేలము ది:25.11.2025 మంగళవారం రోజున మ॥ 1:00 గంటలకు దేవాలయ ప్రాంగణమందు దేవాదాయ శాఖ అధికారుల సమక్షములో నిర్వహించబడును. పూర్తి చేసిన టెండరు టెండరు షెడ్యూలు తేది: 25.11.2025 మ॥ 12:00 గంటల వరకు దేవస్థానమందు ఏర్పాటు చేసిన టెండరు బాక్స్ నందు వేయవలెను. అదే రోజు మ॥ 01:00 గంటలకు టెండరుదారులసమక్షములో బహిరంగ వేలము నిర్వహించబడును.

| క్ర. సం. | వేలము వివరములు | కాలపరిమితి 1 సం॥ము | డిపాజిట్ డబ్బు | సీల్డు టెండర్ షెడ్యూల్ ధర |
|---|---|---|---|---|
| 1 | లడ్డు పులిహోర అమ్ముకొను హక్కు | తేది: 01.01.2026 నుండి 31.12.2026 వరకు | రూ.2,00,000/- | రూ. 1000/- |
| 2 | గాజులు అమ్ముకొను హక్కు | తేది: 01.01.2026 నుండి 31.12.2026 వరకు | రూ. 1,00,000/- | రూ. 1000/- |
| 3 | దేవస్థాన యొక్క ఫంక్షన్ హాల్ కిరాయికి ఇచ్చుకొను హక్కు | తేది: 01.01.2026 నుండి 31.12.2026 వరకు | రూ.50,000/- | రూ.500/- |
| 4 | బొమ్మలు మరియు కిరాణ సామాగ్రి అమ్ముకొను హక్కు (షాప్ నెం. 2 పాత పూల షాపు) | తేది: 01.01.2026 నుండి 31.12.2026 వరకు | రూ.50,000/- | రూ.500/- |
| 5 | దేవస్థానము వద్ద ఫోటోలు తీయుటకు | తేది: 01.01.2026 నుండి 31.12.2026 వరకు | రూ.20,000/- | రూ.500/- |

1. టెండర్ – కం– బహిరంగ వేలము పాటలో పాల్గొనువారు ముందుగా నిర్దేశించిన టెండర్ షెడ్యూల్ డిపాజిట్ చెల్లించి వేలము పాటలో పాల్గొనవలెను.
2. డిపాజిట్ డి.డి.లు మాత్రమే స్వీకరించబడును. డి.డి.లు Executive Officer Sri Yellamma Ammavari Devasthanam - Darveshpuram Village పేరుమీద తీయవలెను.

సదా శ్రీ అమ్మవారి సేవలో...

చీదేటి వెంకట్రెడ్డి, ఛైర్మన్ మరియు ధర్మకర్తల మండలి సెల్: 9441562155


సం/- అంబటి నాగిరెడ్డి, కార్యనిర్వహణాధికారి సెల్:9959198949

వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు 9000010884, 9949609848, 9441823191.

DIPR R.O. No. : 10788-PP/CL/ADVT/1/2025-26 Date: 17-11-2025


# ఎసిబికి చిక్కిన డిప్యూటీ తహసీల్దార్

### లంచం తీసుకున్న వారితో పాటు ఇచ్చిన వారినీ అదుపులోకి తీసుకున్న అధికారులు



**ప్రజాపక్షం/ఖమ్మం/ఇల్లందు :** లంచం తీసుకోవడం అధికారులకు పట్టుబడటం ఆయనకు అలవాటైపోయింది. రేషన్ దుకాణాల పేరుతో అందిన మేరకు దోచుకుంటున్న ఓ అవినీతి తిమింగలం మరోసారి అవినీతి నిరోధక శాఖాధికారులకు పట్టుబడింది. గతంలో పట్టుబడిన కేసు విచారణ జరుగుతుండగానే మరోసారి సారూ అవినీతి అధికారులకు చిక్కారు. వివరాల్లోకి వెళితే... ఇల్లందులో పౌర సరఫరాల శాఖలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న మహ్మది యాకూబ్ పాషాతో పాటు అతని వద్ద పని చేస్తున్న మరో ఉద్యోగి విజయ్ వీరికి లంచం ఇవ్వడానికి వచ్చిన రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షున్ని అవినీతి నిరోధక శాఖాధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారం రోజుల క్రితం టేకితం మండలంలోని ఒక రేషన్ షాపును యాకూబ్ పాషా తనిఖీ చేశారు. ఉండాల్సిన దాని కంటే స్టాకు తక్కువగా ఉందని కేసు నమోదు చేశారు. ఈ విషయమై మహిళా డీలర్ ఎంత ప్రాధేయపడ్డ పాషా పట్టించుకోలేదు. చివరకు ఇల్లందు మండల రేషన్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షులు శబరీష్ ద్వారా యాకూబ్ పాషాను సంప్రదించగా రూ.30వేలు ఇస్తే ఎటువంటి కేసు లేకుండా తిరిగి రేషన్ దుకాణాన్ని నిర్వహించుకోవచ్చునని చెప్పడంతో శబరీష్ ద్వారా రూ.30వేలను రేషన్ డీలర్ పంపించారు. శబరీష్ స్థానిక జగదాంబ సెంటర్‌లో టెక్నికల్ అసిస్టెంట్ విజయ్‌కు నగదు అందిస్తుండగా ఏసిబి అధికారులు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో పౌర సరఫరాల అధికారి యాకూబ్ పాషా, టెక్నికల్ అసిస్టెంట్ విజయ్‌తో పాటు లంచం ఇచ్చేందుకు వచ్చిన శబరీష్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. యాకూబ్ పాషా గతంలో కొణిజర్లలో పని చేస్తున్నప్పుడు ఓ ఆర్ఎంపి వద్ద లంచం తీసుకుంటూ ఎసిబికి అధికారులకు చిక్కారు. ఇప్పటికి ఆ కేసు విచారణలోనే ఉంది. మరోసారి యాకూబ్ పాషా అధికారులకు పట్టుబడటం గమనార్హం. ఈ సందర్భంగా ఎసిబి డిఎస్‌పి రమేష్ మాట్లాడుతూ లంచం ఇచ్చినా తీసుకున్న నేరమేనన్నారు. ఎవరైనా లంచం అడిగితే వెంటనే తమను సంప్రదించాలని రమేష్ తెలిపారు. పేర్లు గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు.

# 25 శాతం పంటలకు ఇన్ని నిబంధనలా?

### రైతులు ఇబ్బందుల్లో ఉన్నారు
### నిబంధనలు.. పరిమితులు సడలించండి
### కేంద్రాన్ని కోరిన వ్యవసాయ శాఖ మంత్రి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పత్తి రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా జిన్నింగ్ మిల్లర్లతో మాట్లాడి, వారి సమస్యలు పరిష్కారమయ్యే దిశగా సిసిఐ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రైతుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని, పత్తి కొనుగోళ్ళలో ఆటంకం ఏర్పడకుండా, వెంటనే కొనుగోళ్లను ఆరంభించాలని జిన్నింగ్ మిల్లుల అసోషియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డిని కోరారు. సిసిఐ అధికారులతో మరోసారి మంగళవారం సమావేశమై జిన్నింగ్ మిల్లుల సమస్యలను ప్రస్తావిస్తామని, సిఎం సూచనలతో సానుకూల నిర్ణయం వచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని సహాయ, సహకారాలు అందిస్తామని హామీనిచ్చారు. పత్తి కొనుగోళ్లపై, జిన్నింగ్ మిల్లుల సమస్యలపై కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కేంద్ర జౌళిశాఖ కార్యదర్శి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశంలో నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిన్నింగ్ మిల్లుల అసోషియేషన్ అధ్యక్షులు రవీందర్ రెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న పత్తి కొనుగోళ్లు, జిన్నింగ్ మిల్లుల సమస్యలను హైదరాబాద్‌లోని సచివాలయం ద్వారా మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వివరించారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ తేమ శాతం,ఎకరానికి విధించిన కొనుగోలు పరిమితులపై మరోసారి సమీక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

రైతులు రేయింబవలు కష్టపడి సాగు చేసిన పంటలు, వాతావరణ మార్పులు, అకాల వర్షాలు, తుఫాను లాంటి ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్నప్పటికి, ప్రభుత్వాలపైన నమ్మకంతో రైతులు తాము పడించిన పంటను కొనుగోలు కేంద్రాలకుతీసుకొస్తే, అక్కడికి వచ్చాక కేంద్రం పెట్టిన నిబంధనలతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతకుముందు పెసర్లు, కందులు, పొద్దుతిరుగుడ వంటి పంటలపై 25 శాతం కొనుగోలుకు మాత్రమే పరిమితి విధించి, రైతుల పంటలో కేవలం 25 శాతం మాత్రమే కనీస మద్దతు ధరకు అమ్ముకుని, మిగతా పంటను తక్కువ ధరకు అమ్ముకోవల్సిన పరిస్థితిని తీసుకొచ్చారని వివరించారు. 25 శాతం పరిమితిని ఎత్తివేయాలని రాష్ట్ర ప్రభుత్వం తరపున అనేక సార్లు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని తుమ్మల గుర్తు చేశారు. రైతులు ఆర్థికంగా నష్టపోకుడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వమే మద్దతు ధరను చెల్లించి, గత రెండు సంవత్సరాల నుండి మిగిలిన పంటలను కొనుగోలు చేస్తుందన్నారు.

**25 శాతం పంటలకు ఇన్ని నిబంధనలా..**

అకాల వర్షాల కారణంగా సోయాబీన్ రంగు మారిందనే నెపంతో కొనుగోళ్లు జరపకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఈ విషయంలో నాఫెడ్, కేంద్రం నుండి ఎటువంటి స్పందన లేకపోవడం శోచనీయమని, 25 శాతం పంటలకు ఇన్ని నిబంధనలా అని మంత్రి తుమ్మల కేంద్రాన్ని ప్రశ్నించారు. రైతులు ఇప్పటికే చాలా రకాలుగా నష్టపోయారని, వారి పంటను సమయానికి కొనుగోలు చేసి, వారికి ఆర్థికదన్నుగా నిలబడాల్సిన అవసరం ఎంతైనా ఉందని మంత్రి తుమ్మల కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.


**కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయం, వరంగల్**

Roc. No. C2/654/2022 డ్రాఫ్ట్ నోటిఫికేషన్ తేది: 03.11.2025

కుడా(KUDA) మాస్టర్ ప్లాన్- 2041కి సంబంధించిన ఈ క్రింది డ్రాఫ్ట్ నోటిఫికేషన్, G.O.Ms.No.202, MA & UD (Plg.II) డిపార్ట్‌మెంట్, తేది.17.11.2024 నాడు జారీచేయబడిన దాని ద్వారా మరియు తెలంగాణ గెజిట్ No.329, తేది.18.11.2024 నాడు ప్రచురించబడిన దాని ద్వారా నోటిఫై చేయబడింది. దీనిలో సెక్షన్ (9) తెలంగాణ అర్బన్ ఏరియాస్ (డెవలప్‌మెంట్) యాక్ట్, 1975 ద్వారా ఇవ్వబడిన అధికారాలను ఉపయోగించి మార్పులు చేయాలని ప్రతిపాదించబడింది. సెక్షన్ 12(3) ప్రకారం ఇందుమూలంగా ప్రచురించబడింది.

ఈ డ్రాఫ్ట్‌ను ప్రచురించిన తేదీ నుండి నాలుగు వారాల కాలం ముగిసిన తర్వాత ముసాయిదాను పరిగణనలోకి తీసుకోబడుతుందని, మరియు ఈ పేర్కొన్న గడువు ముగియడానికి ముందు దీనికి సంబంధించి ఎవరైనా వ్యక్తుల నుండి అయినా ఏవైనా అభ్యంతరాలు లేదా సూచనలు అందితే వాటిని తెలంగాణ ప్రభుత్వం పరిశీలిస్తుందని, అభ్యంతరాలు, సూచనలను ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ, పురపాలక పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ, తెలంగాణ సెక్రటేరియట్, హైదరాబాద్ వారికి సమర్పించాలని దీని ద్వారా నోటీసు ఇవ్వబడింది.

డ్రాఫ్ట్ వేరియేషన్

"ABCDEFOHA" ద్వారా సరిహద్దులు కలిగి ఉన్న స్థలం, సర్వే నం. 468, 471 & 472 మరియు ఇంటి నం. 66-6-9(కొత్త) 6-08(పాత) & 66-6-10 (కొత్త) 6-09(పాత) స్తంభంపల్లి గ్రామం, ఖిలా వరంగల్ మండలం, వరంగల్ జిల్లాలో 16,797.34 చ.మీ. విస్తీర్ణంలో ఉంది. దీని సరిహద్దులు క్రింద షెడ్యూల్‌లో ఇవ్వబడ్డాయి. ఈ స్థలం ప్రస్తుతం కుడా(KUDA) మాస్టర్ ప్లాన్-2041లో పారిశ్రామిక ఉపయోగం కోసం కేటాయించబడింది. ఈ ప్లాన్ G.O.Ms.No.202, MA & UD (Plg.II) డిపార్ట్‌మెంట్, తేది.17.11.2024 ద్వారా నోటిఫై చేయబడింది మరియు తెలంగాణ గెజిట్ No.329, తేది.18.11.2024 నాడు ప్రచురించబడింది. ఇప్పుడు సవరించిన మాస్టర్ ప్లాన్.10/2024లో చూపిన విధంగా మిశ్రమ వినియోగ జోన్ (Mixed Use Zone)గా మార్చబడింది. ఈ ప్లాన్ కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, వరంగల్ కార్యాలయంలో అందుబాటులో ఉంది.

స్థలం యొక్క సరిహద్దులు
ఉత్తరం: హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్
దక్షిణం: ప్రస్తుత నర్సంపేట 100 అడుగుల రోడ్డు (మాస్టర్ ప్లాన్-2041 ప్రకారం 150 అడుగులకు విస్తరించాల్సి వుంటుంది).
తూర్పు: విజయబాబు భూమి
పడమర: హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్

సం/- వైస్ ఛైర్మన్

DIPR R.O. No. :10818-PP/CL/ADVT/1/2025-26 Date: 17-11-2025

## మత్స్యకారుల సంక్షేమానికి కృషి

**ప్రజాపక్షం/చింతపల్లి :** మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఉన్న పెద్ద చెరువు, చిన్న చెరువులలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం సబ్సిడీతో అందించిన చేప పిల్లల విడుదల కార్యక్రమాలని బాలునాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా బాలునాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఆయన వెంట జిల్లా మత్స్య శాఖ అధికారి రాజారాం, జిల్లా మత్స్యశాఖ చీఫ్ ప్రమోటర్ కనుకు వెంకటనారాయణ, మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, డైరెక్టర్లు రవి, శ్రీను, లక్ష్మి, వీరయ్య, ఎఫ్టిఓ మారయ్య, పార్టీ మండల అధ్యక్షులు అంగిరేకుల నాగభూషణం పాల్గొన్నారు.



## రూ.25లక్షల విరాళం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** చనిపోయిన మృతదేహాలను భద్రపరించేందుకు అవసరమైన బాడీ ఫ్రీజర్ల కోసం మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ తరుపు రూ.25లక్షల ఆర్థిక సహాయం చెక్కును సోమవారం మంత్రులు కోమటిరెడ్డి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌లకు అందచేశారు. ఈ నిధులతో నాలుగు ఫ్రీజర్లను కొనుగోలు చేసి ఏరియా ఆసుపత్రిలో అందుబాటులో ఉంచాలని మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్‌లు కోరారు. ఆర్థిక సహాయం అందించిన మిల్లర్స్‌కు మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి వెంకటరమణచౌదరి, ఉపాధ్యక్షుడు గోళ్ల రామశేఖర్, కార్యదర్శి2 పొలిశెట్టి ధనుంజయ, కోశాధికారి గందె రాము తదితరులు పాల్గొన్నారు.





## రైతులను ఇబ్బందులు పెడితే చర్యలు

### ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి: కలెక్టర్

**ప్రజాపక్షం/యాదాద్రి :** ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల కేంద్రంలో మార్కెట్ యార్డులో ఉన్న ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు వేగంగా పూర్తి చేయాలన్నారు. ఇప్పటివరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు టాబ్ ఎంట్రీలు పూర్తి చేశారా అని అడిగి ఎప్పటికపుడు పూర్తి చేయాలన్నారు. కొనుగోలు చేసినంత వరకు రైతుల ఖాతాల్లో డబ్బులు పడ్డాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. మిల్లర్ల వద్ద లారీలు ఆగుతున్నాయని, లారీలు వచ్చిన వెంటనే అన్లోడ్ చేసి లారీలను కొనుగోలు కేంద్రాలకు పంపాలన్నారు. అవసరమైతే అదనంగా లారీలు పంపాలని తెలిపారు. కొనుగోలులో రైతులను ఇబ్బందులు పెడితే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్ ఉండొద్దు

### రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి



**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి, స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ భాస్కరరావు కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి 41 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 29, ఎస్సీ వెల్ఫేర్ 4, జిల్లా పంచాయతీ 2, ఎంప్లాయిమెంట్ టీమ్, మత్స్య శాఖ, మార్కెటింగ్, ఆర్.టి.సి, చీఫ్ ప్లానింగ్, పోలీస్ శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. వివిధ శాఖలకు వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ జయమ్మ, జడ్పీ సీఈవో శోభారాణి పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీలలో అప్రమత్తం




**ప్రజాపక్షం/అర్వపల్లి (నాగారం) :** ప్రజల భద్రత రక్షణలో భాగంగా నాగారం పోలీస్ స్టేషన్ పరిధి నాగారం మండల కేంద్రంలో జనగామ రహదారిపై వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ కమలాకర్ రోడ్డు ప్రమాదంలో మరణించిన సంగతి తెలిసిందే. రోడ్డు ప్రమాదం జరిగిన స్థలాన్ని జిల్లా ఎస్‌పి కె నరసింహ సోమవారం సంబంధిత పోలీస్ అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో పోలీస్ సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండాలని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. తనిఖీలు నిర్వహించే చోట బారికేడ్స్ ఏర్పాటు చేసుకోవాలని, తనిఖీలు నిర్వహించే చోట ఎక్కువ లైటింగ్ ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్నకుమార్, సిఐ నాగేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, రోడ్డు సెఫ్టీ సిబ్బంది ఉన్నారు.

## కుటుంబ కలహాలతో భార్యను చంపిన భర్త



**ప్రజాపక్షం/మోతె :** కుటుంబ కలహాలతో భార్యను చంపిన భర్త సంఘటన ఆదివారం అర్థరాత్రి మండల పరిధిలోని సిరికొండ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం కుటుంబ కలహాల నేపథ్యంలో భర్త కారింగుల వెంకన్న గౌడ్ తన భార్య కారింగుల పద్మ (45)ను రోకలిబండతో కొట్టి హతమార్చినట్లు చెప్పారు. హత్య చేసిన వెం టనే వెంకన్న స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూ ర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరి మధ్య సాగుతున్న దాంపత్య కలహాలే ఈ ఘటనకు కారణమని స్థానికులు చెబుతున్నారు. ఎస్‌ఐ అజయ్‌కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

## దాసయ్య మృతి సిపిఐకి తీరనిలోటు



**ప్రజాపక్షం/చందంపేట :** చందంపేట మండలంలోని పెద్దమూల గ్రామానికి చెందిన సిపిఐ మాజీ సర్పంచ్ గద్దల దాసయ్య మృతి బాధాకరం అని సోమవారం సిపిఐ చందంపేట మండల సమితి పక్షాన ప్రగాఢ సానుభూతి తెలిపి దాసయ్య పార్థివదేహంపై ఎర్ర జెండాను కప్పి నివాళులర్పించారు. 1984లో సిపిఐ పార్టీ నుండి సర్పంచ్‌గా పార్టీకి ప్రజలకు సేవలందించారని అన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ చందంపేట మండల కార్యదర్శి ఉప్పునూతల వెంకటయ్య, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంగళయ్య, బిక్షమయ్య, పోలేపల్లి మాజీ ఎంపిటిసి లాలయ్యలు ఉన్నారు.

# ఉమ్మడి నల్లగొండను మోడల్‌గా తీర్చిదిద్దుతాం

మిర్యాలగూడలో రూ.250కోట్లతో రోడ్ల నిర్మాణం

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ప్రతి ధాన్యం గింజ కొనుగోలు

పెండింగ్ ప్రాజెక్టులన్ని పూర్తి చేస్తాం ...

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్ధులను గెలిపించాలని ఆర్‌అండ్‌బీ రోడ్డు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. సోమవారం మిర్యాలగూడ మండలంలోని కాల్వపల్లి వద్ద రూ.74కోట్లతో చేపట్టే శెట్టిపాలెం అవంతీపురం నాలుగు లైన్ల రోడ్డు పనులకు ఆయన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో జరిగిన సభలో మంత్రి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధిలో ఉమ్మడి నల్లగొండ జిల్లాను మోడల్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కొత్తగా రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. మిర్యాలగూడ పట్టణ, మండలంలో రూ.250కోట్లతో రోడ్ల నిర్మాణ పనులు చేపట్టేందుకు శంకుస్థాపన చేశామన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో అనేక కొత్త రోడ్లలో నిర్మించి మోడల్ మిర్యాలగూడ చేస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను 15రోజుల్లో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేస్తామని, 48గంటల్లో డబ్బులు రైతుల ఖాతాల్లో వేస్తామన్నారు. అన్నివర్గాల ప్రజలకు మేలు కోరే ప్రభుత్వం అన్నార. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎత్తిపోతల పథకాలు త్వరగా పూర్తి చేసి రైతులకు అందుబాటులో తీసుకొస్తామన్నారు. 200యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నామని, దేశంలోని 29 రాష్ట్రాల్లో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రతి వ్యక్తికి ఆరు కిలోల చొప్పున క్వాలిటి నెంబర్ 1 సన్నబియ్యం అందించడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆదరించాలని, ఆశీర్వదించాలని మంత్రి కోరారు. మిర్యాలగూడ పట్టణంలో రూ.75.25కోట్లతో రోడ్లు, డ్రైనేజీ, సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

**అదనపు తరగతి గదులు ప్రారంభం...**

మిర్యాలగూడ పట్టణంలోని కేఎన్‌ఎం డిగ్రీ కళాశాలలో కొత్తగా నిర్మించిన అదనపు తరగతి గదులను, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతనంగా నిర్మించిన కళాశాల భవనాన్ని మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌లు ప్రారంభించారు. ప్రభుత్వ కళాశాల గుర్తింపు పొందే విధంగా ఎంతో కృషి చేశామని, కళాశాలలో గ్రంథాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. అవసరమైన సహకారాలు అందిస్తామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మక విద్యను అందించాలన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్, ఎంపీడీవో శేషగిరిశర్మ, నాయకులు నూకల వేణుగోపాల్‌రెడ్డి, గాయం ఉపేందర్‌రెడ్డి, జొన్నలగడ్డ శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గుండు నరేందర్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, పొదిల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాస్వామ్య పరిరక్షణ సిపిఐ ధ్యేయం

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల కేంద్రంలో సీపీఐ బస్సు జాతా కరపత్రం ఆవిష్కరణ చేసి ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఫ్లోరైడ్, మూసి, కలుషిత జలాలతో పరిశ్రమలతో పరిశ్రమల రసాయనాల కాలుష్య ప్రాంతంగా మారడంతో పుట్టిన శిశువు నుండి అనేక వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు అనేక గ్రామాలలో ఫ్లోరైడ్‌తో జీవచ్ఛవాలుగా బతికి ఉన్న శవాలుగా మారారని అన్నారు. సాగు, త్రాగు నీరుకై ప్రాజెక్టులు నిర్మించి ఈ ప్రాంతం సస్యశ్యామలం కోసం మూడు దశలుగాసీపీఐ పాదయాత్ర నిర్వహించి అప్పటి ముఖ్యమంత్రి కి కనువిప్పు కలిగేలా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని ఉద్యమాలు చేపట్టిందని గుర్తు చేశారు. ఈ నెల 19న చౌటుప్పల్ పట్టణానికి విచ్చేస్తున్న బస్సు జాత బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, ఉడుత రామలింగం, పిల్లి శంకర్, కొండూరు విప్లవ్, బద్దుల సుధాకర్, టంగుటూరి రాములు,నీళ్ల బిక్షపతి, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డ సంరక్షణ అందరి బాధ్యత

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి




**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** ఇటీవల జిల్లాలో చోటు చేసుకున్న ఆడపిల్లల అక్రమ దత్తత, బాల్య వివాహాలు,లింగ నిర్ధారణ పరీక్షలు,బాల్య దశలోనే గర్భం దాల్చడం వంటి సంఘటనలను దృష్టిలో ఉంచుకుని ఆడబిడ్డను సంరక్షించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సేవ్ ద చైల్డ్ జిల్లాస్థాయి కార్యాచరణ ప్రణాళిక పై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇందుకు గాను గ్రామ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ (విసిపిసి) లో పంచాయతీ కార్యదర్శి ,అంగన్వాడీ టీచర్, గ్రామ పాలన అధికారులను చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులుగా ఏర్పాటు చేయాలని,ప్రతి గ్రామపంచాయతిలో విసిపిసి సమావేశాలను తప్పనిసరిగా నిర్వహించాలని,మారుమూల గిరిజన ప్రాంతాలలో లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా పకడ్బంది తీసుకోవాలని,ఎవరైనా ఇలాంటి పరీక్షలు నిర్వహిస్తే వెంటనే సమాచారం తెలియజేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసి సమాచారం వచ్చే విధంగా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. ముఖ్యంగా సంఘటనలు ఎక్కువగా జరుగుతున్న పెద్దవూర,తిరుమలగిరి సాగర్,దామరచర్ల,పీఏ పల్లి వంటి మండలాలలో విస్తృతంగా అవగాహన కల్పించాలని చెప్పారు.జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ ఆడపిల్లల అక్రమ దత్తత, బాల్యవివాహాలు, చిన్న వయసులోనే గర్భం దాల్చడం, తదిత అంశాలపై అందరికీ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, ప్రత్యేకించి ఆడబిడ్డ సంరక్షణపై అవగాహన కల్పించాలని, ఇందుకు సంఘటనలు జరిగే ప్రాంతాలపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని, బాలికల హాస్టళ్లు, పాఠశాలలతో పాటు, బాలుర హాస్టల్లో కూడా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు.జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ అధ్యక్షులు కృష్ణ, స్థానిక సంస్థల ఇంచార్జి అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్ కుమార్, చారుమతి ఎన్జీవో అధ్యక్షులు నాగసేనారెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, డీఈవో బిక్షపతి,ఆర్‌డిఓ వై. అశోక్ రెడ్డి,సంక్షేమ శాఖల అధికారులు, ఆర్ సి ఓ లు పాల్గొన్నారు.



## రూ. 485 కోట్లతో కాలువల నిర్మాణం పూర్తి చేస్తాం : ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** యాదాద్రి భువనగిరి జిల్లాలోని బునాదిగాని, పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి పల్లి కాల్వల నిర్మాణానికి 485 కోట్లు మంజూరైనట్లు మరో ఏడాదిన్నర కాలంలో పూర్తి చేయనున్నట్లు భువనగిరి ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం భువనగిరిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పది సంవత్సరాలు పరిపాలించిన బిఆర్‌ఎస్ ప్రభుత్వం కాల్వల నిర్మాణం పూర్తి చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహించిందని ఎమ్మెల్యే అన్నారు. తిరిగి ప్రజా పాలన వచ్చిన ఏడాది కాలంలోనే ఈ కాలువల నిర్మాణానికి టెండర్లు పూర్తిచేసి 2025 ఏప్రిల్ లో పనులు ప్రారంభించడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. వర్షా కాలానికి సమయం తక్కువ ఉన్నందున పనులు పూర్తిస్థాయిలో చేయలేకపోయామన్నారు. మిగతా పనులను తిరిగి ప్రారంభించడానికి ఇరిగేషన్ అధికారులు సమయతమవు తున్నారన్నారు. 2026 ఏప్రిల్ నుండి జూలై మాసం వరకు కాల్వలను పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కాల్వల పనులు పూర్తి చేయడానికి క్రాప్ హాలిడే ప్రకటించాల్సి ఉండగా రైతులు నష్టపోతున్నారని పునాది గాని ఫిలాయిపల్లి కాలువలకు మినహాయింపు ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ధర్మారెడ్డి పల్లి కాల్వకు పూర్తిగా క్రాప్ హాలిడే ప్రకటించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పోతాంశెట్టి వెంకటేశ్వర్లు, పోత్నాక్ ప్రమోద్ కుమార్, నాయకులు, ఇరిగేషన్ అధికారులు మనోహర్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎంప్లాయిస్ యూనియన్ రీజినల్ కౌన్సిల్ సమావేశం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** టిజిఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ నల్లగొండ రీజినల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం ఉదయం 11.00 గంటలకు స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం మగ్దుమ్ భవన్ నందు ఏర్పాటు చేసినట్లు రీజినల్ కార్యదర్శి ఎన్‌ఆర్‌సి రాజు తెలిపారు.సమావేశానికి యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావుతో పాటు పలువురు రాష్ట్ర నాయకులు, జోనల్ నాయకులు విచ్చేయుచున్నారు.కావున నల్లగొండ రీజియన్‌లోని అన్ని డిపో కమిటీల అధ్యక్ష,కార్యదర్శులు, రాష్ట్ర,జోనల్, రీజినల్ నాయకులకు,ముఖ్య కార్యకర్తలు హాజరకావాలని కోరారు.సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు మ్యానిఫెస్టోలో పెట్టిన హామీలను అమలు పరచకుండా అనుసరిస్తున్న విధానాల పట్ల రాష్ట్ర వ్యాప్తంగా కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై యాజమాన్యం అనుసరిస్తున్న విధానాల పట్ల కార్యాచరణ రూపొందించుటకై,రీజియన్, డిపో స్థాయిలో పేరుకు పోయిన సమస్యల పరిష్కారానికై దిశా నిర్దేశం చేయబడును.

# ధాన్యం డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకోవాలి

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట (సూర్యాపేట రూరల్) :** రైతుల అకౌంట్‌లో 48 గంటల్లో ధాన్యం డబ్బులు జమ అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. సోమవారం పిల్లలమర్రి పిఏసిఎస్ ఆధ్వర్యంలో గాంధీనగర్, యర్కారంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అలాగే ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాలెంల1 కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి తేమ శాతంను తేమ కొలిచే యంత్రం ద్వారా పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో సీరియల్ రిజిష్టర్‌ను తనిఖీ చేసి తేమ శాతం 17 వచ్చిన ధాన్యం సీరియల్ ప్రకారం ధాన్యం కాంటా వేసి మిల్లులకు తరలించాలని వెంటనే ట్రక్ షీట్, ట్యాబ్ ఎంట్రీ చేసి రైతులకు డబ్బులు జమ చేసేలా చూడాలని అధికారులకు సూచించారు. సరైన తేమ శాతం వచ్చిన ధాన్యం కాంటా విషయంలో జాప్యం చేస్తే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. రైతులు ధాన్యమును సరైన తేమ శాతం వచ్చేంత వరకు ఆరబెట్టాలని అలాగే ధాన్యములో మట్టి, తాలు, దుమ్ము, గడ్డి లేకుండా శుభ్రం చేసి నాణ్యమైన ధాన్యంను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్ధతు ధర పొందాలని సూచించారు. ఇప్పటి వరకు గాంధీనగర్‌లో 28 లారీలు, బాలెంలలో 34 లారీలు, యర్కారంలో 6 లారీలు ధాన్యంను మిల్లులకు తరలించటం జరిగిందని నిర్వాహకులు కలెక్టర్‌కు వివరించగా ఎక్కువ మంది హమాలీలను ఏర్పాటు చేసుకొని కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. డిఎస్‌ఓ మోహన్‌బాబు, డిఎం రాము, తహశీల్దార్ కృష్ణయ్య, ఏఓ సందీప్, ఏఈఓలు, ఏపియం, పిఏసిఎస్ కార్యదర్శులు నాగరాజు, వెంకటరెడ్డి, నిర్వాహకులు వెంకటమ్మ ఉన్నారు.

## పనులలో నిర్లక్ష్యం.. కాంట్రాక్టర్‌పై చర్యలకు డిమాండ్






**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భువనగిరి పట్టణంలోని హౌజింగ్ బోర్డ్ కాలనీ 10వ వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులలో నిర్లక్ష్యం చేస్తున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి.ఇమ్రాన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల కోసం గల్లీలలో పైప్ లైన్ వేయడానికి తోవ్వడం జరిగింది. 10 రోజులు అవుతున్న నేటికి పనులు పూర్తి చేయలేదు. తవ్వి పైప్ లైన్ వేసినారు, మీకు ఇష్టముంటే పైప్ లైన్ కలుపుకోండి లేకుంటే లేదు అని చెప్పడంతో ఇంటి యజమానులు 3000 ఖర్చుపెట్టి పైప్ లైన్ డ్రైనేజీలో కలపడం జరిగింది, తవ్వినప్పుడు మున్సిపల్ నల్ల పైపులు కూడా డ్యామేజ్ అవ్వడంతో ప్రతి ఇంటికి 2000 ఖర్చు పెట్టి నల్ల కలెక్షన్లు సొంతంగానే తీసుకోవడం జరిగింది. తవ్విన మట్టి తీయకపోగా మ్యాన్ హోల్ పై కవర్ వేయకపోవడంతో విపరీతమైన దోమలు పెరిగిపోయినాయి. ఇంటి లోపలికి వెళ్లాలన్న వృద్ధులు చిన్నపిల్లలు ఇబ్బంది పడుతున్నారు. గల్లీలో చెత్త బండి రావడం లేదు త్రాగడానికి నీళ్ల సప్లై చేసే మినరల్ వాటర్ ఆటో రావడం లేదు మరియు వాహనాలు ఇంటి నుండి దూరంగా పెట్టి రావడంతో వాహనాలు పోతాయని భయం కూడా ఉంది. హౌసింగ్ బోర్డ్‌లో నిత్యం దొంగతనాలు జరుగుతూనే ఉంటాయి. దీనివల్ల గల్లీ వాసులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పనులలో ఆలసత్యం వహించి కాలనీవాసులను ఇబ్బందులకు గురిచేసిన కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని ఇమ్రాన్ డిమాండ్ చేశారు. ఇట్టి విషయాన్ని మున్సిపల్ కమిషనర్, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని అని తెలిపారు.

## యువ కౌలురైతు ఆత్మహత్య



**ప్రజాపక్షం/మునుగోడు:** కౌలు యువ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. మండల కేంద్రానికి చెందిన కౌలు యువ రైతు పిట్టల సురేందర్(28) గత రెండు సంవత్సరాల నుండి 7 ఎకరాల భూమిని కౌలు తీసుకొని వ్యవసాయం చేసుకుంటూ దానితోపాటు ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. పండించిన పంటలో దిగుబడి రాక అప్పుల పాలయ్యాడు. ఈ సంవత్సరం కాలం అయితే అప్పులు తీరుతాయన్న ఆశతో లక్షల రూపాయలు అప్పులు తేచి పెట్టుబడి పెట్టి సాగు చేశాడు. కాలానుగుణంగా వర్షాలు పడక పంట తీసే సమయానికి అధిక వర్షాలు కురవడంతో పండించిన పంట పూర్తిగా ఆగం కావడంతో దానికి తోడు సమయానికి కూలీలు రాక పూర్తిగా దిగ్భ్రాంతిలోనై కౌలు తీసుకున్న పంట పొలంలోని పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు అప్పటికే మృతి చెందగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.తండ్రి పిట్టల బుచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

**ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతును ఆదుకోవాలి** వ్యవసాయం చేస్తే దండగ అనే రోజులలో యువకుడు వ్యవసాయాన్ని నమ్ముకొని భూములను కౌలుకు తీసుకొని పంటలు సాగుచేస్తే వచ్చిన నష్టాన్ని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరమని ఆత్మహత్య చేసుకున్న కౌలు యువ రైతు పిట్టల సురేందర్ కుటుంబని ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురజా రామచంద్రం ప్రభుత్వాన్ని కోరారు. రైతులకు ఇస్తున్న రైతు బీమా పథకం, పెట్టుబడి సహాయం కౌలు రైతులకు కూడా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాని డిమాండ్ చేశారు.



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## 'ఫెమా' కేసులో అనిల్ అంబానీ..

**న్యూఢిల్లీ :** రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ సోమవారం విదేశీమారక ద్రవ్యనిర్వహణ చట్టం (ఫెమా) కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ముందు హాజరు కావడానికి రెండవసారి నిరాకరించారు. నవంబరు 14న మొదటిసారి సమన్లను దాటవేసినప్పుడు తాను చేసిన స్టేట్‌మెంట్‌ను వర్చువల్ అప్పియరెన్స్ వీడియో ద్వారా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ముందు సమర్పించడానికిసిద్ధంగా ఉన్నానని వ్యాపారవేత్త అనిల్‌అంబానీ చెప్పారు. కాగా, ఇడిఅనిల్‌అంబానీఆఫర్‌ను తిరస్కరించింది. సోమవారం ఆయనకు తాజాగా సమన్లు జారీచేసింది.అయితే ఇడి ఇప్పుడు మూడవ సమన్లు జారీ చేస్తుందో, లేదోఅనేవిషయమై స్పష్టత లేదు.మనీల్యాండరింగ్ నిరోధక చట్టం కింద ఉన్న క్రిమినల్‌ప్రక్రియలకువిరుద్ధంగావిదేశీమారకద్రవ్యనిర్వహణ చట్టం (ఫెమా) కింద చర్యలు సివిల్ స్వభావాన్ని కలిగి ఉంటాయి. 'మిస్టర్ అనిల్ అంబానీ తనస్టేట్‌మెంట్‌రికార్డింగ్‌కోసంఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు అనుకూలమైనవి తేదీ,సమయంలోనైనవర్చువల్ /రికార్డుచేసిన వీడియో ద్వారా అం దుబాటులోకిఉండటానికిముందుకొచ్చారు'అనివ్యాపారవేత్త ప్రతినిధి తెలిపారు.

# క్రమంగా 'నరేగా'కు మంగళం

## ఒక్క నెలలోనే 27 లక్షల మంది పేర్లు తొలగింపు

**న్యూఢిల్లీ :** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని (నరేగా) క్రమంగా ఎత్తివేసేందుకు కేంద్ర ప్రభుత్వ కుట్ర పన్నుతోంది. తక్కువ సంఖ్యలో సభ్యులను పథకంలో చేర్చుతూ అందుకు మూడింతలు ఇతరులను తొలగిస్తోంది. ఈ ఏడాది అక్టోబరు 10వ తేదీ నుంచి ఈనెల 14వ తేదీ వరకు డేటాబేస్ నుంచి దాదాపు 27 లక్షల పేర్లను తొలగించింది. సభ్యులు తప్పనిసరిగా ఇకెవైసి చేయించాలని కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి షరతు విధించింది. చేయని వారి పేర్లను తొలగిస్తోంది. కేవలం నెల రోజుల్లోనే 27 లక్షల మందిను తొలగించగా, కేవలం 10.5 లక్షల మందిని మాత్రమే కొత్తగా పథకంలో చేర్చింది. అనర్హులను తొలగించేందుకు ఇకెవైసిని తీసుకువచ్చినట్లు సమర్థించుకుంటుంది. ఉపాధిహామీ పథకం నుంచి పేర్ల తొలగింపులను అసాధారణమని కార్యకర్తలు, విద్యావేత్తల కన్సార్టియం లిబ్ టెక్, అని పేర్కొంది. గత ఆరు నెలల్లో తొలగింపులు దాదాపు 15 లక్షలకు చేరగా, కేవలం ఒక నెలలోనే 27 లక్షలకు పెరిగాయాని, ఇది అందకు ముందటి ఆరు నెలల మొత్తం కంటే దాదాపు రెట్టింపు అని తెలిపింది. లిబ్ టెక్ విశ్లేషణ ప్రకారం 2025–26 ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో, ఉపాధిహామీ పథకంలో నికరంగా 83.6 లక్షల మంది కార్మికులు ఉండగా, 98.8 లక్షల మంది కార్మికులు చేరారు. అయితే 15.2 లక్షల తొలగింపులు జరిగాయి. ఆ తర్వాత, నవంబర్ మధ్య నాటికి నికర చేరికలు 66.5 లక్షలకు తగ్గాయి. అంటే ఒకే నెలలో 17 లక్షల మంది కార్మికులు అదృశ్యమయ్యారు. ఈ లబ్ధిదారులలో 6 లక్షల మంది క్రియాశీల కార్మికులు లిబ్ టెక్ విశ్లేషించింది. అంటే వారు గత మూడు సంవత్సరాలలో కనీసం ఒక రోజు పనిచేశారు. అధిక ఇకెవైసి పూర్తి రేట్లు ఉన్న రాష్ట్రాలు తొలగింపుల ధోరణిలో ముందున్నాయని విశ్లేషణ వెల్లడించింది. 78.4% మంది కార్మికులు ఇకెవైసి పూర్తి చేసిన ఆంధ్రప్రదేశ్ 15.92 లక్షల తొలగింపులతో అగ్రస్థానంలో ఉంది. అధికంగా తొలగించిన ఇతర రాష్ట్రా ల్లో తమిళనాడులో 30,529 మందిని తొలగించారు. ఈ రాష్ట్రంలో ఇకెవైసి పూర్తి రేటు 67.6 శాతంగా ఉంది. ఛత్తీస్‌గఢ్‌లో 1.04 లక్షల మందిని తొలగించగా, ఇకెవైసి పూర్తి రేటు 66.6 శాతంగా ఉంది. కాగా, కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖలోని సీనియర్ అధికారులు ఇకెవైసి డ్రైవ్, తొలగింపుల మధ్య ఎటువంటి సంబంధం లేదని తోసిపుచ్చినట్లు ఓ వార్తా పత్రిక పేర్కొంది. ఏదైనా జాబ్ కార్డు తొలగింపు కోసం తాము ఒక ప్రామాణిక ఆపరేటింగ్ విధానం (ఎస్ఒపిలు) జారీ చేశామని, ఇందులో తొలగింపు కోసం ఖరారు చేసిన జాబ్ కార్డులను పబ్లిక్ డొమైన్‌లో ఉంచడం, లబ్ధిదారులు అప్పీల్ దాఖలు చేయడానికి సమయం ఇవ్వడం, గ్రామసభ నుండి తుది ఆమోదం పొందడం వంటివి ఉన్నాయనిమంత్రిత్వ శాఖలోని ఒక ఉన్నతాధికారి ఆ వార్తాపత్రికకు తెలిపారు.



### క్రమబద్ధమైన ప్రయత్నం : కాంగ్రెస్



ఉపాధిహామీ పథకంలో పేర్లను తొలగించడంతో ప్రభుత్వంపై కాంగ్రెస్ మండిపడింది. పథకానికి పేదలను దూరం చేసే చర్యే కాదని, పథకాన్ని అంతం చేయడానికి 'క్రమబద్ధమైన ప్రయత్నం' అని పేర్కొంది. పథకం కింద రోజుకు రూ. 400 కనీస వేతనం, ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ (ఎబిపిఎస్), నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్), ఇకెవైసి తప్పనిసరి చేయడాన్ని వెంటనే నిలిపివేయాలన్న తమ డిమాండ్లను కాంగ్రెస్ పునరుద్ఘాటించింది. 'భారతదేశంలోని గ్రామీణ పేదలకు వారి శాసనపరమైన ఉపాధి హక్కును నిరాకరించడానికి మరొక ప్రయత్నం. గత ఒక నెలలో అక్టోబర్ 10, నవంబర్ 14 మధ్య మోదీ ప్రభుత్వం నరేగా లబ్ధిదారుల డేటాబేస్ నుండి 27 లక్షల పేర్లను తొలగించింది. ఈ లబ్ధిదారులలో ఆరు లక్షల మంది క్రియాశీల కార్మికులు' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ఎక్స్‌లో పేర్కొన్నారు. లబ్ధిదారులను సామూహికంగా తొలగించడం కార్మికుల కోసం ఇకెవైసి ప్రక్రియను ప్రవేశపెట్టడంతో సమానంగా ఉందని ఆయన అన్నారు. తాము పదే పదే లేవనెత్తినట్లుగా, ఇది ఒక వివిక్త చర్య కాదు, పారదర్శకత ముసుగులో తీసుకువచ్చిన ఆధార్ ఆధారిత డిజిటల్ ప్రక్రియలను ప్రవేశపెట్టడం ద్వారా నరేగా అంతం చేయడానికి ఒక క్రమబద్ధమైన ప్రయత్నం అని రమేష్ అన్నారు.

## 20న బిహార్‌లో కొత్త ప్రభుత్వం



**పాట్నా :** బిహార్‌లో కొత్త ప్రభుత్వం కొలవుదీరనుంది. ఈనెల 20వ తేదీన ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగే అవకాశముందని అధికార వర్గాలు తెలిపాయి. కార్యక్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు సహ ఎన్‌డిఎలోని పలువురు అగ్ర నాయకులు పాల్గొంటారని వారు తెలిపారు. అయితే ఈనెల 19వ తేదీన ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తన రాజీనామాను గవర్నర్‌కు సమర్పించనున్నారు. కాగా, బిహార్ బిజెపి అధ్యక్షుడు దిలీప్ జైస్వాల్ సోమవారం ఉదయం విలేకరులతో మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన శాసనసభ్యులు తమ శాసనసభ పక్ష నాయకుడిని ఎన్నుకోవడానికి మంగళవారం సమావేశమవుతారని చెప్పారు. కొత్త ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమం నవంబర్ 20 లేదా నవంబర్ 21న జరిగే అవకాశం ఉంది అని ఆయన అన్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పాట్నాలోని గాంధీ మైదానంలో సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రస్తుత ప్రభుత్వ చివరి మంత్రివర్గ సమావేశం సోమవారం జరిగింది. అసెంబ్లీ రద్దుకు సిఫార్సు చేయడానికి ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌కు అధికారం ఇచ్చినట్లు రాష్ట్ర మంత్రి ఒకరు తెలిపారు. సమావేశం ముగిసిన వెంటనే ముఖ్యమంత్రి గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్‌ను కలిసి మంత్రివర్గ నిర్ణయం గురించి ఆయనకు వివరించారు. సమావేశంలో 19న అసెంబ్లీ రద్దుకు సిఫార్సు చేయడానికి మంత్రి మండలి ఒక తీర్మానాన్ని ఆమోదించిందని జెడి(యు) సీనియర్ నాయకుడు, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి విజయ్ చౌదరి విలేకరులకు తెలిపారు. కేబినెట్ సమావేశం అనంతరం నితీశ్ కుమార్ డిప్యూటీ సిఎం సామ్రాట్ చౌదరి, ప్రధాన కార్యదర్శి ప్రత్యాయ అమృత్‌లతో కలిసి గవర్నర్‌ను కలిశారు. బిహాలో ఎన్‌డిఎ ఘన విజయం సాధించినందుకు సిఎంకు కృతజ్ఞతలు తెలుపుతూ మంత్రివర్గం మరో తీర్మానాన్ని ఆమోదించింది. 'నితీష్ కుమార్ నాయకత్వంలో బిహార్‌లో కూటమి ఇప్పటివరకు సాధించిన అత్యుత్తమ ప్రదర్శన ఇది... రాష్ట్ర ప్రభుత్వ దార్శనిక విధానాల వల్ల ఇది సాధ్యమైంది' అని విజయ్ చౌదరి అన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డిఎ 243 మంది సభ్యులున్న సభలో 200 కంటే ఎక్కువ సీట్లను గెలుచుకుంది. బిజెపి గరిష్టంగా 89 సీట్లను గెలుచుకోగా, జెడి(యు) 85 స్థానాల్లో విజయం సాధించింది.

## బిహార్‌లో నగదు బదిలీపై చర్చిస్తాం

### ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రభుత్వం నగదు బదిలీ చేయడం కొత్తగా ఉంది : శరద్ పవార్



**పుణె :** బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు 'ముఖ్యమంత్రి రోజ్‌గారీ యోజన' పథకం కింది ప్రతి మహిళ ఖాతాల్లోకి రూ. 10 వేలు నగదు బదిలీ చేయడం వల్ల మహిళా ఓటర్లు అధికార ఎన్‌డిఎకు ఓటు వేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్‌సిపి (ఎస్‌పి) అధ్యక్షుడు శరద్ పవార్ స్పందిస్తూ ఫలితాలపై ప్రతిపక్షనాయకులతో చర్చల సందర్భంగా మహిళలకు ప్రత్యక్ష నగదు బదిలీ అంశాన్ని లేవనెత్తుతానని అన్నారు. ప్రతిపక్ష మహాఘట్బంధన్ కూటమిని ఓడించి బిహార్ ఎన్నికల్లో అధికార ఎన్‌డిఎ ఘన విజయం సాధించిన నేపథ్యంలో పవార్ వ్యాఖ్యలు చేశారు. 'పోల్ ఫలితం మా అంచనాలకు భిన్నంగా మారింది. అయితే, ప్రజల ఆదేశాన్ని అంగీకరించాలి. మహారాష్ట్ర, బిహార్‌లలో, లడ్కీ బహిన్, మహిళలకు రూ. 10,000 ప్రత్యక్ష ప్రయోజన బదిలీ వంటి పథకాలు ఎన్నికలకు ముందు ప్రవేశపెట్టడం అందరూ చూశారు. ఇలాంటివి ఇంతకు ముందు ఎప్పుడూ చూడలేదు' అని పవార్ ఆదివారం సోలాపూర్‌లో విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. బిహార్‌లో మహిళలు వ్యాపారం ప్రారంభించడానికి ప్రతి కుటుంబంలోని ఒకరికి నగదు అందించే ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గర్ యోజన గురించి ఆయన ప్రస్తావించారు. ఈ పథకం కింద ఎన్నికలకు ముందు మహిళల బ్యాంకు ఖాతాలకు ఒక్కొక్కరికి రూ. 10,000 బదిలీ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో డబ్బు పంపిణీ జరుగుతుందని తాను విన్నానని, కానీ రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా రూ. 10,000 అందించడం కొత్త విషయం అని పవార్ అన్నారు. బిహార్ ఎన్నికల్లో ఎన్‌డిఎ విజయం వెనుక రూ. 10,000 డిపాజిట్ చేయడం కారణమైతే దానిపై తీవ్రంగా చర్చించాలన్నారు. డిసెంబర్ 1న పార్లమెంట్ సమావేశం ప్రారంభం కానుందని, ఈ సమయంలో కీలకమైన ప్రతిపక్ష నాయకులను ఒక చోట చేర్చి ఈ అంశంపై చర్చించి, ప్రతిస్పందనను రూపొందిస్తామన్నారు. బిహార్‌లో ఎన్నికల ప్రక్రియలో నిధుల పంపిణీని ఎన్నికల కమిషన్ ఎలా అనుమతించిందో అని పవార్ ఆశ్చర్యపోయారు.

## కేరళలో బిఎల్ఒ ఆత్మహత్య

### రాష్ట్రవ్యాప్తంగా బిఎల్‌ఒల విధుల బహిష్కరణ ఇసి, కలెక్టరేట్‌ల వద్ద నిరసన 'సర్'పై తీవ్ర ప్రభావం



**తిరువనంతపురం :** కేంద్ర ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) ఉద్యోగుల పాలిట మృత్యువుగా మారుతోంది. ఈ నెల 4 నుంచి డిసెంబరు 4వ తేదీ వరకు 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో సర్ కొనసాగనుంది. అయితే పని ఒత్తిడి కారణంగా కేరళలో ఓ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం బూత్‌స్థాయి అధికారులు (బిఎల్‌ఒలు) విధులను బహిష్కరించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమంపై ప్రభావం పడింది. కన్నూర్ పయ్యన్నూర్‌లో బిఎల్‌ఒగా పనిచేస్తున్న 44 ఏళ్ల అనీష్ జార్జ్ ఆదివారం తన ఇంట్లో ఉరివేసుకుని కనిపించాడు. సర్ ప్రక్రియకు సంబంధించిన పని సంబంధిత ఒత్తిడి కారణంగా ఆయన ఈ తీవ్ర చర్య తీసుకున్నారని కుటుంబ సభ్యులు, నివాసితులు ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల యాక్షన్ కౌన్సిల్, ఉపాధ్యాయ సేవా సంస్థల జాయింట్ కమిటీతో సహా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు చెందిన వివిధ కార్మిక సంఘాలు తిరువనంతపురంలోని ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం, జిల్లా కలెక్టరేట్‌ల వద్ద నిరసనలు నిర్వహించాయి. అధికారులు బిఎల్‌ఒలపై అధిక ఒత్తిడిని కలిగించకుండా, సర్‌ను వాయిదా వేయడాన్ని పరిగణించాలని డిమాండ్ చేశారు. మరిన్ని ఆత్మహత్యలను నివారించడానికి సర్ విధానాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ కేరళ ఎన్‌జిఒ అసోసియేషన్ కూడా రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు నిర్వహించింది. కాగా, సోమవారం పోస్ట్‌మార్టం తర్వాత జార్జ్ మృతదేహాన్ని అతని బంధువులకు అప్పగించారు. జార్జ్ కుటుంబం సర్‌కు సంబంధించి తీవ్రమైన పని ఒత్తిడిలో ఉన్నారని పునరుద్ఘాటించారు. అతనికి ఆహారం, నిద్ర సరిగ్గా లేదని, సర్ ప్రక్రియలో భాగంగా కేటాయించిన పనిని పూర్తి చేయడానికి తీవ్ర ఒత్తిడిలో ఉన్నాడు అని జార్జ్ బావమరిది సైజు విలేకరులతో అన్నారు. జార్జ్‌ను సీనియర్ అధికారులు తరచుగా నవీకరణల కోసం సంప్రదిస్తున్నారని సైజు పేర్కొన్నారు.తీవ్రమైన పనిభారం చూసి, జార్జ్ తండ్రి ఉద్యోగం పోయినా చింతించవద్దని ధైర్యం చెప్పారన్నారు. ఇదిలా ఉండగా, జార్జ్ ఆత్మహత్యలో సిపిఐ(ఎం) కార్యకర్తల పాత్రను కూడా పరిశీలించాలని ప్రాథమిక దర్యాప్తులో తేలిందనిప్రతిపక్ష నాయకుడు విడి సతీశన్ అన్నారు. గణన కోసం కాంగ్రెస్ బూత్ లెవల్ ఏజెంట్ తనతో వచ్చిన తర్వాత జార్జ్‌ను బెదిరించారని తమకు తెలిసింది అని ఆయన ఆరోపించారు. బిజెపి, సిపిఐ(ఎం) రెండూ సాంప్రదాయ కాంగ్రెస్ ఓటర్లను జాబితా నుండి దూరంగా ఉంచడానికి ప్రయత్నిస్తున్నాయని కూడా ఆరోపించారు. బిఎల్‌ఒల భద్రతను నిర్ధారించి, సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని సతీశన్ రాష్ట్ర ప్రభుత్వం, భారతఎన్నికల కమిషన్ (ఇసిఐ)ను కోరారు. బిఎల్‌ఒలలో ఎక్కువ మంది మహిళలు ఉన్నారని, ఒక బూత్‌లోదాదాపు 700–1,200 మంది ఓటర్లు ఉండగా, తక్కువ వ్యవధిలో లక్ష్యాలను చేరుకోవడానికి బిఎల్‌ఒలు ప్రతి ఇంటికి అనేకసార్లు వెళ్లాల్సి ఉంటుంది అని ఆయన అన్నారు. గణన సమయంలో కాంగ్రెస్ బూత్ స్థాయి ఏజెంట్లతో పాటు వెళ్లినందుకు సిపిఐ(ఎం) కార్యకర్తలు తనను బెదిరించారని జార్జ్ చేసిన ఫోన్ సంభాషణలో వెల్లడైందని కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కెపిసిసి) అధ్యక్షుడు సన్నీ జోసెఫ్ అన్నారు. నిరసన తెలుపుతున్న బిఎల్‌ఓలకు కాంగ్రెస్ పార్టీ పూర్తిగా మద్దతు ఇస్తుందని ఆయన అన్నారు. సర్ ప్రక్రియకు వ్యతిరేకంగా కాంగ్రెస్ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తుందని జోసెఫ్ అన్నారు. సోషల్ ఇంపాక్ట్ రిజిస్టర్ (సర్) ప్రక్రియను వాయిదా వేయాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించాలని ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ కూడా నిర్ణయించింది. కాగా, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్‌లో ఇలాంటి బిఎల్‌ఒ ఆత్మహత్యలు జరిగాయని, వారు తీవ్ర ఒత్తిడిలో ఉన్నారన్నారు. జార్జ్ కుటుంబ సభ్యుల మాట వినడానికి బదులుగా, సతీశన్ సిపిఐ(ఎం)ను నిందించడానికి ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు.

## ఢిల్లీ పేలుడు ఘటన నిందితుడికి 10 రోజుల ఎన్ఐఎ కస్టడీ



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో ఇటీవల జరిగిన భారీ పేలుడు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. పేలుడుకు పాల్పడిన ఉమర్‌కు సహకరించిన నిందితుడు అమీర్ రషీద్ అలీని కట్టుదిట్టమైన భద్రత మధ్య పాటియాలా హౌస్ కోర్టు కాంప్లెక్స్‌లోని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ కోర్టు ముందు సోమవారం నాడు హాజరుపరిచారు. అనంతరం 10 రోజుల ఎన్ఐఎ కస్టడీకి కోర్టు ఆదేశించింది. ఆ వెంటనే రషీద్‌ను ఎన్ఐఎ కార్యాలయానికి తరలించారు. అమీర్ రషీద్ అలీని కోర్టుకు హాజరుపరిచే సమయంలో మీడియాను అనుమతించలేదు. కోర్టు కాంప్లెక్స్ చుట్టూ ఢిల్లీ పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది మోహరించారు. అల్లర్ల వ్యతిరేక టీమ్‌నూ సిద్ధం చేశారు. నవంబర్ 10న జరిగిన ఢిల్లీ పేలుడు ఘటనలో 10 మంది మృతిచెందగా, 13మంది గాయపడ్డారు. ఐఇడి అమర్చి పేల్చిన ఐ20 కారు అమీర్ పేరుతో రిజిస్టర్ కావడంతో ఎన్ఐఎ అతన్ని అదుపులోకి తీసుకుంది. సూసైడ్ బాంబర్ ఉమర్ నబీతో కలిసి ఈ దాడికి అమీర్ రషీద్ కుట్రపన్నినట్టు ఎన్ఐఎ వెల్లడించింది. అమీర్ జమ్ముకశ్మీర్‌లోని పంపోర్‌కు చెందిన వ్యక్తి కాగా, ఉమర్ ఫరీదాబాద్‌లోని అల్ ఫలాహ్ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. తదుపరి విచారణలో భాగంగా ఉమర్ ఉపయోగించిన మరో కారునూ ఎన్ఐఎ స్వాధీనం చేసుకుంది. ఇంతవరకూ గాయపడిన బాధితులతో సహా 73మంది సాక్ష్యులను ఎన్ఐఎ విచారించింది. మరోవైపు, ఫరీదాబాద్ టెర్రర్ మాడ్యూల్ కేసులో ప్రమేయం, మోసం, ఫోర్జరీకి పాల్పడిన ఆరోపణలపై అల్‌ఫలాహ్ యూనివర్శిటీ చైర్మన్‌కు ఢిల్లీ పోలీసులు రెండు సమన్లు జారీ చేశారు. యుజిసి, ఎన్ఎఎసి లేవనెత్తిన ఆందోళనలపై రెండు ఎఫ్ఐఆర్‌లనూ నమోదు చేశారు. యూనివర్శిటీ గుర్తింపు క్లెయిమ్స్‌పై జరిపిన సమీక్షలో పెద్దఎత్తున అవకతవకలు జరిగినట్టూ గుర్తించారు.

## క్రూడాయిల్‌పై ట్రంప్ జరిమానా రద్దవుతుందా?

### దగ్గరపడిన తొలిదశ ఒప్పందం!



**న్యూఢిల్లీ:** టారిఫ్‌ల సమస్య పరిష్కరించుకోవడానికి భారత్–అమెరికా కొనసాగిస్తున్న ద్వైపాక్షిక వాణిజ్య చర్చలు ఒప్పందానికి చేరువలో ఉన్నాయి. ఈ ఒప్పందం కుదిరితే ట్రంప్ పాలనాయంత్రాంగం భారత్ వస్తువులపై విధించిన 50 శాతం టారిఫ్‌ల సమస్య పరిష్కారానికి వీలు కలుగుతుంది. ముఖ్యంగా రష్యా ముడిచమురుపై విధించిన జరిమాన సమస్యకు ఒక పరిష్కారం వచ్చే అవకాశం ఉంది. దీంతోపాటే అమెరికా మార్కెట్‌ను అందిపుచ్చుకోవడానికి ఎదురవుతున్న అనేక సమస్యలు కూడా పరిష్కారం అవుతాయని న్యూఢిల్లీలో అధికారులు సోమవారం చెప్పారు. భారత్–అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య చర్చల్లో అనేక ఆటంకాలు ఉన్నాయి. అనేక ప్యాకేజీలు ఉన్నాయి. వీటిల్లో అన్నింటికంటే ముఖ్యమైనదీ, మొదటిదీ ముడిచమురుపై విధించిన జరిమానా సమస్యే. ఐతే ఇప్పుడు చర్చలు ఒప్పందం చేసుకోవడానికి సమీపంగా వచ్చాయి. రెండు దేశాలు పరస్పర అంగీకారంతో ఒక తేదీని నిర్ణయించి ఈ ఒప్పందాన్ని ప్రకటిస్తాయి. రెండు దేశాలమధ్యా ఇప్పటివరకూ ఆరు విడతల వాణిజ్య సమావేశాలు పూర్తయ్యాయి. 2025వ సంవత్సరం ముగిసేనాటికి మొదటి విడత దశ ఒప్పందాన్ని ఖరారు చేసేందుకు రెండు దేశాలూ ప్రణాళికలను ప్రకటించాయి. కేంద్ర వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ భారత్ తరపు బృందానికి నాయకత్వం వహిస్తున్నారు. గతనెలలో ఈ బృందం వాషింగ్టన్‌లో అమెరికా వాణిజ్యశాఖాధికారులతో సంభాషణలు జరిపింది. మూడు రోజులు జరిగిన చర్చలు అక్టోబరు 17న ముగిశాయి. రెండు దేశాలమధ్యా వాణిజ్య సంబంధాలు తీవ్ర ఒత్తిడికి గురై సమస్యల్లో పడినందువల్ల ఒప్పందం చేసుకోవడంలో సంప్రదింపులే అత్యంత కీలకమైనవి. ప్రస్తుతం జరుగుతున్న ప్రతిపాదిత ద్వైపాక్షిక సంప్రదింపులు ఫలిస్తే 2030 నాటికి రెండు దేశాలమధ్యా వాణిజ్యం 500 బిలియన్ డాలర్లకు చేరుతుంది. ప్రస్తుతం ఈ వాణిజ్యం విలువ 191 బిలియన్ డాలర్లు మాత్రమే. ట్రంప్ యంత్రాంగం భారత్ ఎగుమతి చేసే వస్తువులపై 25 శాతం టారిఫ్ విధించింది. రష్యా నుండి ముడి చమురు దిగుమతి చేసుకుని ఉక్రేన్‌పై యుద్ధానికి ప్రోత్సహిస్తున్నందుకు గాను జరిమానాగా అమెరికా మార్కెట్లలో ప్రవేశించే భారత వస్తువులపై మరో 25 శాతం సుంకాలను విధించారు. ఈ చర్చల ద్వారా ఈ మొత్తం టారిఫ్‌ల భారాన్ని గణనీయంగా తగ్గించుకోవాలని మోదీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. ఐతే ఉక్రేన్‌లో జరుగుతున్న యుద్ధం కూడా ఈ చర్చలపై ప్రభావం చూపిస్తూ ఉండటంతో ఈ ప్రక్రియ మెల్లిగా కొనసాగుతూ ఎట్టకేలకు ఒప్పందానికి దగ్గరయ్యాయి. ఈ ఒప్పందం వల్ల భారత్‌పై అమెరికా విధించిన 25 శాతం జరిమానా సమస్య పరిష్కారం అవుతుందని అంచనావేస్తున్నట్లు అధికారులు చెప్పారు. ఈ జరిమానాను గనుక పరిష్కరించుకోలేకపోతే ఈ ఒప్పందానికి ఇక అర్థమే ఉండదని కూడా అధికారులు పేర్కొన్నారు. ఇక భారత ప్రభుత్వం నడిపించే చమురు కంపెనీలు 2026లో అమెరికా నుండి ఎల్‌పిజి వంటగ్యాస్‌ను దిగుమతి చేసుకునేందుకు ఒక ఏడాది ఒప్పందంపై సంతకాల సమస్యకు సంబంధించి కూడా ఇంకా సమయం పట్టేలా ఉంది. ''అమెరికాతో వాణిజ్యాన్ని మొత్తం గా నిలబెట్టుకునే ఒప్పందాలతో ఈ అంశాలు ముడిపడి ఉంటాయి, దీనిపై కృషి చేయడానికి కొంత సమయం పడుతుంది, అమెరికాతో వాణిజ్యన్నా సమతుల్యం చేసుకునే క్రమంలో ఇవన్నీ సర్దుబాటు కావాల్సి ఉంది'' అని ఒక అధికారి చెప్పారు. అమెరికాకు, భారత్‌కు మధ్య ఉన్న వాణిజ్య మిగులును తగ్గించుకోవాలి. ముఖ్యంగా ట్రంప్ కోరుకున్న విధంగా అమెరికావల్ల భారత్ ఎక్కువగా లాభపడుతోంది. భారత్‌కు వాణిజ్య మిగులు ఉంది. కానీ భారత్‌తో వాణిజ్య చేయడం వల్ల అమెరికాకు ఆ మిగులు లేదు. ఎందుకంటే అమెరికా నుండి భారత్‌కు వచ్చే దిగుమతులు చాలా తక్కువగా ఉన్నాయి. ట్రంప్ మొదటినుండీ ఈ విషయాన్ని ప్రధానంగా ప్రపంచం ముందుంచారు. అమెరికాను భారతదేశం దోచుకుంటోందనీ, ప్రపంచంలో ఏ దేశమూ వసూలు చేయనంత భారీస్థాయిలో భారత్ తమనుండి సుంకాలు వసూలు చేస్తోందని ట్రంప్ విమర్శిస్తున్నారు. భారత్ ఎంత టారిఫ్ విధిస్తే మేం కూడా భారత్‌పై అంతే టారిఫ్ విధిస్తామనే విధానం ప్రకారం మన దేశంపై భారీగా సుంకాలు పెంచారు. ఐతే ఈ ద్వైపాక్షిక ఒప్పందం వల్ల బాగా లాభపడాలని ట్రంప్ భావిస్తున్నారు. భారతదేశంలో మార్కెట్లను అందిపుచ్చుకుని వాణిజ్య మిగులు పెంచుకోవాలని కోరుకుంటున్నారు. భారత్‌లో బాదం, పిస్తా, యాపిల్స్, ఇథనాల్, జన్యుపరంగా మార్పిడి చేసిన ఉత్పత్తుల మార్కెట్లను చేజిక్కించుకోవాలని ట్రంప్ ప్రయత్నం చేస్తున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో వరుసగా నాలుగోసారి కూడా భారతదేశానికి అమెరికా అతిపెద్ద వాణిజ్య భాగస్వామి హోదాను దక్కించుకుంది. ఈ మేరకు గత ఆర్థిక సంవత్సరంలో 131.84 బిలియన్ డాలర్లు విలువైన ద్వైపాక్షిక వాణిజ్యం( 86.5 బిలియన్ డాలర్ల ఎగుమతులు) నమోదైంది. భారతదేశం 18 శాతం వస్తువులను ఎగుమతి చేయగా, 6.22 శాతం దిగుమతులు చేసుకుంది. ఐతే భారీగా పెరిగిన టారిఫ్‌ల వల్ల ఈ ఏడాది సెప్టెంబరునెలలో అమెరికాకు భారత్ నుండి 11.93 శాతం ఎగుమతులు క్షీణించాయి. వీటి విలువ 5.46 బిలియన్ డాలర్లుగా నమోదైంది. అదేసమయంలో సెప్టెంబరునెలలో అమెరికా నుండి దిగుమతులు 11.78 శాతం పెరిగాయి. వీటి విలువ 3.98 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఈ విధంగా టారిఫ్‌ల వల్ల భారతదేశంలో అమెరికా తన వ్యాపారం పెంచుకుంది.

## అందరికీ ఇళ్లు, ఆహారం, విద్య

### కేరళలో ఎల్‌డిఎఫ్ మేనిఫెస్టో విడుదల



**తిరువనంతపురం:** కేరళలోని అధికార ఎల్‌డిఎఫ్ సోమవారం స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. ఎకెజి సెంటర్‌లోని ఉన్న సిపిఐ(ఎం) ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి ఎం.వి. గోవిందన్, లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) కన్వీనర్ టి.ఇపి.రామకృష్ణన్, సిపిఐ నేత సత్యన్ మోకేరి, ఆంటోనీ రాజు ఎమ్మెల్యే తదితర ప్రముఖ నాయకులు హాజరయ్యారు. పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించడం, అందరికీ గృహనిర్మాణం, ఆహారం, విద్య, వైద్యం వంటి హామీలను ఇచ్చింది. కేరళలో యువత అంచనాలకు అనుగుణంగా ఉపాధి అవకాశాలను సృష్టించడానికి వామపక్ష ప్రభుత్వం ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేయనున్నట్లు మేనిఫెస్టోలో పేర్కొంది. మరికొన్ని రోజుల్లోనే రెండు దఫాలుగా స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నందున ఎల్‌డిఎఫ్ మేనిఫెస్టోలో అందరికీ సంక్షేమం, అభివృద్ధిని హామీ ఇచ్చింది. కెఐఎఫ్‌బి ద్వారా కేరళలో అపూర్వమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి జరుగుతోందని, పాఠశాల విద్య విషయంలో మాదిరిగానే దేశంలో ఉన్నత విద్యా రంగాన్ని ముందంజలోనికి తీసుకురావడానికి సంస్కరణలు కూడా అమలు చేయబడుతున్నాయని మ్యానిఫెస్టో పేర్కొంది. 'అధికార వికేంద్రీకరణ కొత్త అభివృద్ధి వ్యూహంలో అంతర్భాగం. దీని ద్వారా, పాలన, ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధి, ప్రజా సంక్షేమంలో ఎక్కువ ప్రజా భాగస్వామ్యాన్ని నిర్ధారించడానికి లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ కట్టుబడి ఉంది' అని పేర్కొంది. 64,000 కుటుంబాలను ఇప్పటికే తీవ్ర పేదరికం నుండి బయటకు తీసుకువచ్చామని, అదేవిధంగా, అర్హులైన లబ్ధిదారులను గుర్తించిన తర్వాత రాష్ట్రం నుండి పేదరికాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని మేనిఫెస్టోలో వెల్లడించారు. అందరికీ గృహనిర్మాణం, ఆహారం, విద్య, వైద్యాన్ని నిర్ధారించడానికి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చింది. వామపక్ష మేనిఫెస్టోలో కాంగ్రెస్, బిజెపిలకు వ్యతిరేకంగా తీవ్ర వ్యాఖ్యలు చేసింది. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చింది , దేశంలో మత ధ్రువణతను సృష్టించడం ద్వారా దానిని నిలుపుకోవడానికి ప్రయత్నిస్తోందని మేనిఫెస్టో ఆరోపించింది. కాంగ్రెస్ రాజీ లేకుండా దీనిని వ్యతిరేకించలేకపోయిందని ఆరోపించింది.

ప్రజాపక్షం
మంగళవారం, 18 నవంబరు

## ఐబొమ్మ ఆటకట్టింది

పైరసీ... కొత్తగా తెరపైకి వచ్చిన పాత సమస్య. దశాబ్దాల తరబడి కొనసాగుతున్న రుగ్మత. చేతనైతే అరెస్టు చేయాలంటూ సవాళ్లు విసిరిన 'ఐబొమ్మ' నిర్వాహకుడు ఇమ్మడి రవి అరెస్టు కావడంతో పైరసీపై చర్చ మరోసారి 'తెర'పైకి వచ్చింది. పైరసీ నిరోధక చట్టాలు, చేపడుతున్న చర్యలకు కొదువ లేదు. కానీ, వీడియో ప్లేయర్లు, 'సిడి'ల కాలం నుంచి అత్యాధునిక సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ వరకూ, సాంకేతిక పరిజ్ఞానంతోపాటు పైరసీ కూడా విస్తరిస్తునే ఉంది. వేళ్లానుకున్న ఈ దుర్మార్గానికి రవి అరెస్టు ఆరంభం కాదు.. అంతం అంతకంటే కాదు. అనధికారికంగా సినిమాలను కాపీచేసి, దొంగ మార్గాల్లో అందించే అకృత్యానికి సినిమా టికెట్ల ధర పెంచడమే కారణంగా చూపడం విచిత్రం. చిత్ర పరిశ్రమపై ఆధారపడి లక్షలాది మంది బతుకుతున్నారు. నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు నష్టపోతే, సినిమాలు తగ్గుతాయి. ఎంతోమంది ఉపాధి కోల్పోతారు. సమస్యను ఈ కోణంలో కాకుండా, సినిమా టికెట్ల ధరలు ఎక్కువగా ఉన్నాయి కాబట్టే ఐబొమ్మ ద్వారా వాటిని ప్రజలకు అందిస్తున్న రవిని 'అభినవ రాబిన్‌హుడ్'గా కొన్ని సోషల్ ప్లాట్‌ఫామ్స్ కీర్తించడం దారుణం. ఒకే హార్డ్ డిస్క్‌లో సుమారు 21,000 సినిమాలను స్టోర్ చేయడం ప్రజలకు మేలు చేయడమా? కనీసం 20 కోట్ల రూపాయలు సంపాదించడం కూడా ప్రజల కోసమేనా? ఒకటి సైట్‌ను బ్లాక్ చేస్తే, మరొకటిగా 65కుపైగా డొమైన్లను నడిపించడంలోనూ సంక్షేమమే నిక్షిప్తమై ఉందా? పైరసీతోపాటు ఆన్‌లైన్ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్స్‌ను ప్రమోట్ చేయడం కూడా ప్రజాహితమేనా? ఆత్మవంచనకు ఇది పరాకాష్ట. సైబర్ క్రైమ్‌కు పాల్పడిన రవిపై కాపీరైట్, ఐటి యాక్ట్ కింద పెట్టిన కేసులు ఎంత వరకూ నిలబడతాయో చూడాలి. చట్టంలోని లొసుగులను ఉపయోగించుకొని అతను బయటపడితే, సినీ పరిశ్రమను కొల్లగొట్టే వందల మంది 'రవి'లు తయారవుతారు. ఐబొమ్మ నిర్వాహకుడి డొమైన్లకు కనీసం 50లక్షల మంది సబ్‌స్క్రైబర్లు ఉండడం పైరసీ ఏ స్థాయిలో వేళ్లానుకుందో స్పష్టం చేస్తున్నది. కరేబియన్ దీవుల్లో ఉంటూ, విదేశీ వెబ్‌హోస్టింగ్స్ ద్వారా నేరాలకుపాల్పడుతున్న అతనికి ఎవరూ ఏమీ చేయలేరన్న ధీమా..అందుకే, భారీ మోసం.. ప్రజాహితం పేరుతో పైరసీ వ్యాపారం. వేలాదిమంది కష్టాన్ని, బతుకు పోరాటాన్నీ దోచుకుంటున్న వైనం.

రవి అరెస్టు వ్యవస్థలోని లోపాలను కూడా బయటపెట్టింది. డిజిటల్ రైట్స్ మేనేజ్‌మెంట్ వ్యవస్థల్లోని లొసుగులు అతనికి ఉపయోగపడ్డాయి. వివిధ వ్యవస్థల్లో నరనరాన పాకిపోయిన అక్రమాల వికృత రూపం బయటపడింది. కొద్ది మంది మోసకారులు చేస్తున్న ఇలాంటి పైరసీల కారణంగా ప్రపంచంలోనే అతిపెద్ద చిత్ర పరిశ్రమల్లో ఒకటైన టాలీవుడ్ ఆర్థిక నష్టాలు ఎదుర్కొంటున్నది. ఎంతోమంది యూజర్ల డేటా కొంతమంది నేరగాళ్ల చేతికి చేరడం సైబర్ భద్రతకు పొంచి ఉన్న ముప్పును సూచిస్తున్నది. పైరసీ సైట్లను ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లతో కలిపి ఆదాయాన్ని పెంచుకోవడం, వినియోగదారులను మోసం చేయడం ప్రమాద ఘంటికలు మోగిస్తున్నది. కొత్త సినిమాలు థియేటర్లు లేదా ఒటిటి ప్లాట్‌ఫామ్స్‌కు వచ్చే ముందే ఐబొమ్మ వంటి ప్లాట్‌ఫామ్స్‌లో వాటిని ఉంచడం పరిశ్రమ ఉనికినే ప్రశ్నిస్తున్నది. డిజిటల్ డిస్ట్రిబ్యూషన్, స్ట్రీమింగ్, క్లౌడ్ సర్వర్లు ఉన్న నేపథ్యంలో, ఏకకాలంలో పెద్ద పరిమాణంలో సినిమాలను హ్యాక్ చేయడం, అప్‌లోడ్ చేయడం ఈ వ్యవస్థలో ఉన్న చీకటి కోణాలను చూపెడుతున్నాయి. యుద్ధ ప్రాతిపదికన చర్యల అవసరాన్ని గుర్తుచేస్తున్నాయి. అయితే, ప్రపంచవ్యాప్తంగా అన్ని పైరసీ వెబ్‌సైట్లను వెంటనే బ్లాక్ చేయడం కష్టం. డొమైన్ మార్పులు, వివిధ దేశాల్లోని హోస్టింగ్, ఐపి అడ్రస్ మార్పులు ఈ సమస్యను మరింత క్లిష్టతరం చేస్తున్నాయి. మరోవైపు 'పైరసీ' సులభమైన మార్గంలో భారీ ఆదాయాన్ని ఆర్జించే వనరుగా మారుతున్నది. కొత్త సినిమాలను ఉచితంగా చూడవచ్చన్న జనాల పేరాశ పైరసీని పెంచిపోషిస్తున్నది. లాగ్‌ఇన్ యూజర్లు, యాడ్స్ ద్వారా, బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ తదితర మార్గాల ద్వారా అక్రమార్జనలకు సహకరిస్తున్నది. తమ వ్యక్తిగత డేటా నేరగాళ్ల చేతికి వెళితే, రాబోయే భయానక సమస్యలపై అవగాహన పెరిగితే తప్ప, ఇలాంటి పైరసీ డొమైన్లకు తెర పడదు. ఇప్పుడు, ఐబొమ్మ వంటి పెద్ద నెట్‌వర్క్ నిర్వాహకుడి అరెస్టు ఇతర సైబర్ నేరగాళ్లకు హెచ్చరిక. పైరసీని పెంచి పోషిస్తున్న వారికి జాగ్రత్తగా ఉండాలన్న సూచన. అంతర్జాతీయ సర్వర్లు, మిర్రర్ సైట్లను ఉపయోగించే ముఠాల ఆటకట్టించడానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రయత్నాలు అవసరం. బలమైన కేసులు పెట్టడం ద్వారా, పైరసీకి వ్యతిరేకంగా చట్టపరమైన చర్యలను కఠినతరం చేయవచ్చు. ఐబొమ్మ నిర్వాహకుడి అరెస్టు మీడియాలో సంచలనంగా మారిన నేపథ్యంలో, పైరసీ సినిమాలు చూడడం లేదా ప్రోత్సహించడం అటు పరిశ్రమకు, ఇటు వ్యక్తిగత గోప్యతకు ఎంత నష్టమో ప్రజలకు తెలుస్తున్నది. వారు మారితేగానీ, పైరసీ ఆగదు. రవి అరెస్టు మార్పుకు శ్రీకారం కావాలి. చిత్ర పరిశ్రమ నిలబడాలి. దానిపై ఆధారపడిన వేలాది కుటుంబాలకు మేలు జరగాలి. అత్యంత క్లిష్టమైన ఆపరేషన్స్‌తో ముడివడిన అతిపెద్ద పైరసీ నెట్‌వర్క్ సూత్రధారిని కటకటాల్లో పెట్టిన హైదరాబాద్ సైబర్‌సెల్ పోలీసులు అభినందనీయులు.

# నేటి సామ్రాజ్యవాదం కొత్తరూపాలు – మన పోరాటం



డి.రాజా
ప్రధాన కార్యదర్శి, సిపిఐ

నేటి సామ్రాజ్యవాదానికి సాంప్రదాయక అర్థంలో ఇంకెంతమాత్రమూ వలస ప్రాంతాలు అక్కర్లేదు. అది ఫైనాన్స్, డేటా, టెక్నాలజీ నెట్‌వర్క్‌ల ద్వారా పరిపాలిస్తుంది – అవి పెట్టుబడి కూడబెట్టటమనే తర్కానికి దేశాలను నిబద్ధం చేసే అగోచర సంకెళ్లు. ప్రచ్ఛన్నయుద్ధ అస్థికల నుండి ఆవిర్భవించిన ప్రపంచం ప్రపంచీకరణ, నయా ఉదారవాదం బ్యానర్‌కింద అనంతమైన సౌభాగ్యాన్ని తప్పుగా వాగ్దానం చేసింది. అందుకు బదులుగా మనకు లెనిన్ గుర్తించిన ప్రపంచం వెనువెంటనే గుర్తుకు వస్తుంది : అది ''గుత్తపెట్టుబడిదారులు, ద్రవ్యపెట్టుబడి ఆధిపత్యం వహించే ప్రపంచం; లాభార్జనే ఏకైక సూత్రంగా కలిగిన కొద్ది ప్రభుత్వాల మధ్య విభజించబడిన ప్రభుత్వం''. ఎదురులేకుండా మూడు దశాబ్దాలపాటు ఆధిపత్యం చెలాయించిన అమెరికా సంయుక్త రాష్ట్రాలు ఇప్పుడు ఆ ఆధిపత్యం క్షీణింపును వెనక్కు మళ్లించలేని స్థితిని ఎదుర్కొంటున్నది. అయితే అంతకుముందున్న ప్రతి ఒక్క సామ్రాజ్యంలాగే అది తన అధికారాన్ని హుందాగా వదులుకోవటానికి తిరస్కరిస్తున్నది. డాలర్, నాటో, ఐఎంఎఫ్ ద్వారా విధేయతను విధించిన ఏక ధృవ ప్రపంచం దానిలోని వైరుధ్యాలతో కూలిపోతున్నది. దాని స్థానంలో బహుళ ధృవ కూర్పు ఆవిర్భవిస్తున్నది. బ్రిక్స్ బ్లాక్ అతి స్పష్టంగా దానికి ప్రాతినిధ్యం వహిస్తున్నది – అమెరికన్ పెత్తనంతో అలిసిపోయిన ప్రపంచంనుండి చారిత్రక అవసరంగా ఉద్భవించింది బ్రిక్స్.

అమెరికా సామ్రాజ్యవాదం బరితెగింపు ప్రతి చోట – అది విధించే ఆంక్షల్లో, వాణిజ్య యుద్ధాల్లో, సైనిక దిగ్బంధనాల్లో కనిపిస్తున్నది. డోనాల్డ్ ట్రంప్ సుంకాలను ఆయుధాలుగా మార్చటం ''స్వేచ్ఛా వాణిజ్యం'' ఒక ఎత్తుగడ తప్ప ఎన్నడూ ఒక సూత్రం కాదని వెల్లడిస్తున్నది. అమెరికా – ఒకప్పుడు గన్‌బోట్లను ప్రయోగించినట్లుగా ఇప్పుడు ఆర్థిక బలాత్కారాన్ని ఉపయోగిస్తున్నది. వాషింగ్టన్ ఇప్పటికీ బెదిరించగలదు, కాని ఎంతమాత్రం ఆదేశించలేదు. బ్రిక్స్ గ్రూపులో వృద్ధి చెందుతున్న సఖ్యత (పశ్చిమాసియా, ఆఫ్రికన్ రాజ్యాలను చేర్చుకుంటూ ఇప్పుడది విస్తరించబడింది) ఏకధృవ ప్రపంచకాలం ముగిసిందని సంకేతిస్తున్నది. ప్రపంచం రాజ్యాల బహుళ సమతౌల్యం దిశగా ప్రయాణిస్తున్నది. ఈ పరివర్తన గందరగోళంగా ఉన్నప్పటికీ అందులో విప్లవాత్మక శక్తి సామర్థ్యాలున్నాయి.

''తన ఉత్పత్తి సాధనాలను నిరంతరం విప్లవీకరించకుండా బూర్జువావర్గం మనజాలదు'' అని మార్క్స్ ఒకప్పుడు అన్నారు. ఇది సాంకేతిక విజ్ఞానరంగంలో కన్నా మరెక్కడా సత్యం కాజాలదు. కృత్రిమ మేథ(ఎఐ), ఆటోమేషన్, బయోటెక్నాలజీ, డిజిటల్ నెట్‌వర్క్‌లు పుష్కలత శకాన్ని వాగ్దానం చేస్తున్నాయి – అయినా అవి అసమానతను మరింత పెంచుతున్నాయి, సామాజికంగా ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ కింద టెక్నాలజీ మానవ అవసరాలను నెరవేర్చదు, లాభార్జనకు ఉపకరిస్తుంది. సాంకేతికవిజ్ఞాన శక్తి కొద్దిపాటి అమెరికా కంపెనీల్లో కేంద్రీకృతం కావటం (ఉదా: గూగుల్, యాపిల్, అమెజాన్, మెటా, మైక్రోసాఫ్ట్) లెనిన్ కాలం నాటి ద్రవ్య గుత్తసంస్థలను ప్రతిబింబిస్తున్నది. ఈ కంపెనీలు డిజిటల్ యుగంలో కొత్త ఈస్ట్ ఇండియా కంపెనీలు అవుతున్నాయి. అవి సుగంధ ద్రవ్యాలు లేదా పత్తి రాబట్టుకోవు, 21వ శతాబ్దం ముడిపదార్థమైన డేటాను బిలియన్‌లాది ప్రపంచవ్యాప్త వినియోగదారులనుంచి రాబట్టుకుంటాయి. ప్రపంచ మానవాళి సమష్టిగా ఈ డిజిటల్ శ్రమ ద్వారా ఉత్పత్తి చేసిన సంపద సిలికాన్ వ్యాలీలో కేంద్రీకరించిన కొద్దిపాటి సంపన్నుల వద్దకు ప్రవహిస్తుంది.

వైచిత్రి కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది : టెక్నాలజీ అభివృద్ధి చెందే కొలది మెజారిటీ శ్రమజీవుల ఉపాధి సందిగ్ధమవుతున్నది. పనిగంటలు తగ్గించటం లేదా జీవన ప్రమాణాల పెంపుదలకు బదులు డిజిటల్ పెట్టుబడిదారీ వ్యవస్థ నిఘా విస్తరిస్తున్నది, తొలగింపును ఆటోమేట్ చేస్తున్నది, సామాజిక భద్రతలను హరిస్తున్నది. గిగ్ వర్కర్స్ ఆహారం డెలివరీ చేస్తారు, సాఫ్ట్‌వేర్ కోడింగ్ చేస్తారు, ఆన్‌లైన్ సమాచారాన్ని అమరిక పరుస్తారు, అయినా వారు మనకు కనిపించరు, ఎప్పుడైనా ఉద్యోగం నుంచి తొలగించబడతారు. మార్క్స్ చెప్పినట్లు, ఈ ''శ్రామిక రిజర్వు ఆర్మీ'' యాప్ ఆర్థిక వ్యవస్థలో కొత్త జీవితం కనుగొంటారు – తక్కువ వేతనాలకు పనిచేసే కార్మికులు అపారంగా బటన్ నొక్కగానే దోపిడీకి శాశ్వతంగా లభ్యమవుతారు. బూర్జువా ఆర్థిక వేత్తలు ''డిజిటల్ ఎకానమీ'' అని పిలుస్తున్న దాని అసలు ముఖం ఇదీ. అది ప్రజలకోసం విప్లవం కాదు, వారికి వ్యతిరేకమైనది.

గ్లోబల్ సౌత్‌లో (వెనుకబడిన దేశాలని అర్థం) ముఖ్యంగా దక్షిణాసియాలో ఈ సాంకేతిక విజ్ఞాన వ్యవస్థ పరాధీనతను పునరుత్పత్తి చేస్తుంది. ''డిజిటల్ పరివర్తన'' అని ఈ ప్రాంతానికి చేసే వాగ్దానానికి అర్థం టెక్నాలజికల్ మౌలిక సదుపాయాల ద్వారా సామ్రాజ్యవాద నియంత్రణ విస్తరణ. పశ్చిమదేశాలు, బహుళజాతి గుత్త పెట్టుబడిదారులు ఇప్పుడు ఎక్కువగా ప్రమాణాలను, సొంత ప్లాట్‌ఫారంలను ఆదేశిస్తున్నారు. డేటా ప్రయాణాన్ని నియంత్రిస్తున్నారు. దిగుమతి చేసుకున్న హార్డ్‌వేర్‌పై, వారికి యాజమాన్య హక్కులున్న సాఫ్ట్‌వేర్‌పై, విదేశీ పెట్టుబడిపై ఆధారపడటం లేబర్ లోకల్ అయినప్పటికీ, మిగులు విలువ గ్లోబల్ అవుతుంది. ఈ అర్థంలో, డిజిటలైజేషన్ శ్రమ యొక్క వలసవాద విభజనను రద్దు చేయలేదు, మరింతగా పెంపు చేసింది.

ఈ వైరుధ్యానికి భారత్ పాఠ్యగ్రంథ నమూనా అందిస్తున్నది. తమది ఐటి పవర్‌హౌస్ అని, స్టార్ట్‌అప్‌ల భూమి అని, సాఫ్ట్‌వేర్ జైంట్స్ అని దేశం గొప్పలు చెప్పుకుంటున్నది. ఈ మెరుపు కింద వాస్తవికత దాగి ఉంది. లెనిన్ ఉన్న ఫళాన గుర్తించినట్టు అది నిజమైన ఆవిష్కరణకన్నా చౌక, బలహీనమైన శ్రమపై ఆధారపడిన పెట్టుబడిదారీ నిర్మాణ స్వరూపం. ''నవభారత్''కు ప్రతీకగా వేడుక చేసుకుంటున్న స్టార్ట్ అప్ పర్యావరణ పశ్చిమ కార్పొరేషన్‌లకు పొరుగు సేవలందించే తక్కువ వేతనాలకు లభ్యమయ్యే ఇంజినీర్లు, డేటా వర్కర్స్‌లపై దాదాపు పూర్తిగా ఆధారపడినట్టిది. భారత టెక్నాలజీ సంస్థలు జాతీయ పరివర్తనకు ఇంజిన్‌లుగా కాకుండా ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థకు బ్యాక్–ఆఫీసులుగా ఉపకరిస్తున్నాయి. వాటి లాభాల్లో ఎక్కువ భాగం భారతదేశ సొంత సమస్యలైన ప్రజారోగ్యం, గ్రామీణ మౌలిక వసతులు లేదా పర్యావరణ సంబంధ సంక్షోభం వగైరాలను పరిష్కరించే స్వదేశీ టెక్నాలజీని అభివృద్ధి చేయటం ద్వారా గాక, శ్రామికులను అందించటం ద్వారా ఆర్జిస్తున్నాయి.

ఫలితం పురోభివృద్ధిని అపహాస్యం చేస్తున్నది : భారతదేశం ప్రపంచంలోనే అత్యంత నిపుణులైన ప్రోగ్రామర్లు కొందరిని ఉత్పత్తి చేస్తున్నది. కాని దాని గ్రామాలు త్రాగునీటి కొరత ఎదుర్కొంటున్నాయి, నగరాలు కాలుష్యం కింద కూలుతున్నాయి. ''డిజిటల్ ఇండియా'' నినాదం ఒక లోతైన సత్యాన్ని దాచిపెడుతున్నది. టెక్నాలజీ విముక్తి శక్తిగా పనిచేసే బదులు, ప్రస్తుతమున్న అసమానతలను మరింత పెంచటానికి ఉపయోగించబడుతున్నది. సాధికారీకరణను వాగ్దానం చేస్తున్న ప్లాట్‌ఫాంలు సంశయాత్మకతను పాదుకొల్పాయి; ఆటోమేషన్ ఉద్యోగాలకు ముప్పు తెస్తున్నది, చదువు వాటిని భర్తీ చేయలేనంత వేగంగా తొలగిస్తున్నది. కార్పొరేట్ గుత్త పెట్టుబడి సంస్థలు ఆధిపత్యం వహిస్తున్న పాలకవర్గం ప్రపంచ ఫైనాన్స్‌తో చేతులు కలిపింది. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిదారులు టెక్నాలజీ విజయాలతో ఉత్సవాలు చేస్తున్నారు. అయితే దానివల్ల లాభపడిందెవరన్న ప్రశ్నను తొక్కిపెడుతున్నారు. మార్క్స్ ఇలా అన్నారు.. ''ఉత్పత్తి శక్తులు కొద్దిమంది ఆస్తిగా ఉన్నంతకాలం ఆ శక్తుల అభివృద్ధి మానవాళి అభివృద్ధి కాబోదు''.

వెనుకబాటుతనానికి చికిత్సగా 1991లో భారతదేశంలో ప్రవేశించిన నయా ఉదారవాదం సౌభాగ్యం ఉత్పత్తి చేయకపోగా విభజన తెచ్చింది. హిందూత్వతో దాని వివాహం కార్పొరేట్ లాభాపేక్షతో మత చాందసాన్ని కలగలిపిన ఒక సంకర వ్యవస్థను సృష్టించింది. మోదీ ప్రభుత్వ ఆత్మనిర్భర్ భారత్ వాగాడంబరం విదేశీ పెట్టుబడిపై విపరీతంగా ఆధారపడటాన్ని దాచిపెడుతున్నది, లఘుపరిశ్రమలను అంతరింపజేస్తున్నది. లేబర్‌కోడ్‌లు, ప్రభుత్వ ఆస్తుల ప్రైవేటీకరణ, వ్యవసాయాన్ని కార్పొరేట్‌లు స్వాధీనం చేసుకోవటం–ఇవన్నీ ఒకే తర్కం నుంచి వస్తున్నాయి. అదేమంటే, భారతదేశాన్ని దాని ప్రజలకు కాకుండా పెట్టుబడికి సురక్షితం చేయటం, ఎంతో ప్రశంసించబడిన ''మేక్ ఇన్ ఇండియా'' ప్రచారం కూడా చౌక శ్రమను, బలహీనమైన పర్యావరణ చట్టాలను అనువుగా వాడుకోవడానికి బహుళజాతి కార్పొరేషన్‌లకు ఆహ్వానంగా మారింది. అందువల్ల భారతదేశంలో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటాన్ని ప్రపంచ పెట్టుబడికి స్థానిక ఏజెంటుగా పనిచేస్తున్న దేశీయ బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా పోరాటంనుంచి వేరుచేయలేము. బ్రిక్స్‌లో, ఇతర బహుళధృవ వేదికల్లో భారత్ పాల్గొనటం వ్యూహాత్మక స్వయంప్రతిపత్తికి (స్ట్రాటజిక్ అటానమీ) నూతన అవకాశాలు ఆవిష్కరిస్తున్నది. అయితే సోషలిజం లేని స్వయంప్రతిపత్తి పరాధీనతను ఒక యజమాని నుంచి మరొక యజమానికి మార్చడం మాత్రమే చేస్తుంది. కార్మికవర్గం అంటే ఏమిటో రైతాంగం, స్వాతంత్ర్యం నిర్వచించాలి. అది కేవలం ప్రపంచ శిఖరాగ్రసభల్లో సీటు కాకూడదు, జాతీయ వనరులు, టెక్నాలజీ, శ్రమపై ఆజమాయిషీగా ఉండాలి. ఉత్పత్తి భావనను అనగా ప్రైవేటు లాభంకోసంగాక స్థానిక అవసరం ప్రకారం జరిగే ఉత్పత్తి అనే భావనను వామపక్షం తిరిగి సొంతం చేసుకోవాలి.

ప్రపంచవ్యాప్తంగా, బహుళధృవ ప్రపంచం వృద్ధి చెందటం ఆటోమేటిక్‌గా దోపిడీని అంతం చేయదు. ప్రపంచ ప్రగతిశీల శక్తులు సోషలిస్టు ప్రత్యామ్నాయం చుట్టూ ఐక్యం కాగలిగితే అది దాన్ని అనుభవంలోకి తెచ్చేందుకు అవసరమైన పరిస్థితులు సృష్టిస్తుంది. లెనిన్ హెచ్చరిక ప్రవక్త బోధలా ఉంది: ''పీడకులకు సహాయపడేటువంటి పీడిత దేశాల బూర్జువా వర్గంలేనిదే సామ్రాజ్యవాదం నిర్జీవమవుతుంది.'' ఈనాడు పోరాట రేఖలు తూర్పు–పశ్చిమం మధ్య కాదు; పెట్టుబడి–శ్రమ మధ్య, టెక్నాలజీపై గుత్తాధిపత్యం కలిగిన వారికీ – ఎవరి శ్రమ అయితే దాని మనుగడను నిలబెడుతుందో వారికీ మధ్యన.

ఈ చారిత్రక అధిక స్రావాన్ని చైతన్యయుతమైన పోరాటంగా పరివర్తన గావించటం కమ్యూనిస్టు ఉద్యమ కర్తవ్యం. సామ్రాజ్యవాదం నూతన రూపాలను – డిజిటల్, ఫైనాన్షియల్, పర్యావరణం మనం బట్టబయలు చేయాలి, సరిహద్దులకు అతీతంగా కార్మికుల మధ్య సంఘీభావం నిర్మించాలి. కీలకమైన టెక్నాలజీలపై ప్రభుత్వ స్వామ్యం (ఓనర్‌షిప్) కోసం, డేటాపై ప్రజాస్వామిక నియంత్రణ కోసం, ఆవిష్కరణల సామాజీకరణ కోసం మనం పోరాటం చేయాలి. ఆటోమేషన్, కృత్రిమ మేధ వాగ్దానం పెట్టుబడి యొక్క లాభం కన్నా మానవ అవసరాలకు టెక్నాలజీ ఉపయోగపడే సోషలిజం కింద మాత్రమే నెరవేరుతుంది. ''ప్రతి ఒక్కరి స్వేచ్ఛాయుత అభివృద్ధి అందరి స్వేచ్ఛాయుత అభివృద్ధికి షరతు'' అన్న మార్క్స్ ప్రకటన నినాదంగా కాకుండా కార్యక్రమం కావాలి. అమెరికా ఆధిపత్య సంజవెలుగు మానవాళికి కొత్త ఉషోదయా న్ని ఆవిష్కరిస్తున్నది. అయితే ఉషోదయమే పగటి వెలుగు కాదు. బహుళ ధృవ ప్రపంచం పోటీపడుతున్నపెట్టుబడిదారీ వ్యవస్థలకు రణరంగమైనా అవుతుంది లేదా నూతన అంతర్జాతీయ వ్యవస్థకు జన్మస్థానమైనా అవుతుంది. రెండవ దాన్ని సాధించటానికి కార్మిక వర్గం నాయకత్వం వహించాలి. మార్క్స్, ఏంగెల్స్‌లు 1848లో నిర్ధారించినట్లు, మనం జయించటానికి ఒక ప్రపంచమే ఉంది. నేడు ఆ ప్రపంచంలో టెక్నాలజీని తీర్చిదిద్దే హక్కు, దాని ఫలాలను సమానంగా పంచుకునే హక్కు, సామ్రాజ్యవాదం తన పాత, కొత్త రూపాలన్నిటి లో మానవాళిపై విధించటం కొనసాగిస్తున్న దోపిడీని అంతం చేసే హక్కు చేరి ఉన్నాయి.

## ఆరోగ్యశాఖకు అధిక నిధులు కేటాయించాలి

లేఖ

సరసమైన ధరలకు మంచి ఆరోగ్య సంరక్షణ, సౌకర్యవంతమైన జీవితం పొందడం సమాజంలోని ప్రతి పౌరుని హక్కు. ఈ హక్కు పొందాలం టే నగరాలు, గ్రామీణ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాలలో తగినంత సంఖ్యలో ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రా లు ఉండాలి. తగినంత సంఖ్యలో వైద్యులు, నర్సు లు, ఇతర ఆరోగ్య కార్యకర్తలు, అవసరమైన వైద్య పరికరాలు, సౌకర్యాలు, మందులు ఉండాలి. ఆరోగ్య సంరక్షణ ప్రదాతలైన వైద్యులు, నర్సులు, పారామెడికల్ కార్మికుల కు సురక్షితమైన జీవనోపాధి, సురక్షితమైన పని పరిస్థితులు, గౌరవప్రదమైన జీవన వేతనం, పెన్షన్ మొదలైనవి కలిగి ఉండాలి. అయితే వాస్తవం చాలా భిన్నంగా ఉంది. వైద్య సదుపాయాల హామీ ఇస్తున్న అత్యాధునిక ప్రైవేట్ ఆసుపత్రులలో సామాన్య ప్రజలకు అందుబాటులో లేని ఫీజులు ఉన్నాయి, ప్రభుత్వ ఆసుపత్రులలో అంతులేని క్యూలు, కిక్కిరిసిన వార్డులు, తగినంతగా లేని పడకలు, మందుల కొరత ఉండి దయనీయ పరిస్థితులు ఉన్నాయి. అక్కడి వైద్యులు, నర్సులు ఆరోగ్య కార్యకర్తలు ప్రమాదకరమైన పని పరిస్థితులలో పనిచేస్తున్నారు. ఆశా, అంగన్‌వాడీ, వంటి వివిధ ప్రభుత్వ పథకాల కింద పనిచేసే ఆరోగ్య కార్యకర్తలు దేశంలోని మారుమూల ప్రాంతాల ప్రజలకు ఆరోగ్య సంరక్షణ సేవలను అందిస్తున్నారు. అయినప్పటికీ వారిని కార్మికులుగా గుర్తించుట లేదు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, నర్సులు 10 సం.కు పైగా కాంట్రాక్టు పద్ధతిలో నెలకు కేవలం రూ. 15,000; 18,000 జీతంతో పనిచేస్తున్నారు.. వారిలో చాలా మంది ఒకేసారి 100 కంటే ఎక్కువమంది రోగులను చూసుకోవాల్సి వస్తుంది, వారికి పెన్షన్ లేదు, బీమా సౌకర్యం లేదు. రోగులు ఎక్కువ గంటలు వేచి ఉండటం, పేలవమైన ఆరోగ్య సంరక్షణ సేవలతో, కోపంతో నిరాశకు గురవుతూ వారి బాధితులైన వైద్యులు, నర్సులపై ఆవేశం వెళ్ళగక్కుతున్నారు. ప్రభుత్వం ప్రజారోగ్యశాఖకు అధిక నిధులు కేటాయించడంవలన వైద్య సిబ్బంది జీతభత్యాలతో పాటు ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించవచ్చు.

**ఆళవందార్ వేణు మాధవ్**

## సమాజ అభ్యుదయ కవి 'ఆవంత్స'



ఆవంత్స సోమసుందర్ అభ్యుదయ కవి, విమర్శకుడుగా పేరు పొందారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని కోస్తా ప్రాంతం నుండి సమర్థించి కవిత్వం వెలువరించిన నిష్పక్షపాత వ్యక్తిత్వం ఆయనది. ''ఖబడ్దార్ హే నిజాం పాదుషా – ఒక వీరుడు మరణిస్తే వేలకొలది ప్రభవింతురు'' అని గర్జించిన సాహసి. ఆయన జీవితమే కవిత్వం అని నమ్మి, జీవితాన్నే కవిత్వానికి అంకితం చేసిన వ్యక్తి. కవిగా, కథకుడిగా, నవలా రచయితగా, నాటక కర్తగా, అనువాదకుడిగా భిన్న రూపాలతో సాహితీ సేవ చేసారు.

2004లో ఈయన రచించిన అక్షర నాదం అనే కవితా సంపుటిలోని కొన్ని పద చిత్రాలను గమనించినట్లయితే ఈయన ప్రతిభ, ఈయన ఏ విధంగా రెండు తరాలకు వారధిగా ఉన్నారనే విషయం సుస్పష్టమౌతుంది.

*గ్లోబలైజేషన్ తో ఈ భూమి రజస్వలై*
*నవవరాన్వేషణలో మిటకరిస్తుంది......*
*హ్యూమన్ జెనిటిక్ ఇంజనీరింగ్ తో*
*అవతరించిన క్లోనింగ్ కోడె దూడ*
*'అంబా' అని అరవడం*
*గ్రాంధికమని నిషేధిస్తుంది. .........* (నేటిని ఏటికి విడిచి అనే కవిత నుంచి )

'వజ్రాయుధం' నుండి 'ఆమ్రపర్ణి' వరకూ సుమారు ఆరున్నర దశాబ్దాల పాటు సోమసుందర్ చేసిన కవితాయానంలో సమాజ సంకుల సమరమే అన్ని కోణాల్లోనూ ప్రతిబింబిస్తుంది. ఈ కవి మానవుని విస్మరించి, ఆకాశంలో విహరించిన సందర్భాలు కనపడవు.

సోమసుందర్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అన్నవరం సమీపంలో ఉన్న శంఖవరం అనే గ్రామంలో కాళ్ళూరి సూర్యప్రకాశరావు, వెంకాయమ్మ దంపతులకు 1924, నవంబరు18న ఎనిమిదవ సంతానంగా జన్మించారు. ఆయన ప్రాథమిక విద్యాభ్యాసం అంతా పిఠాపురంలోనే జరిగింది.

1943లో పెద్దాపురం ఎమ్. ఆర్.కళాశాలలో చేరి, ఉన్నత విద్యనభ్యసించారు. సోమసుందర్ క్విట్ ఇండియా ఉద్యమంలో చురుకుగా పాల్గొని, 1942లో విద్యార్థులను కూడదీసి బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమ్మె చేశానని చెప్పేవారు.

సోమసుందర్ స్వాతంత్ర్య పోరాటంలో విద్యార్థి నాయకుడిగా, కమ్యూనిస్టు పార్టీ సభ్యునిగా 1954 వరకూ కార్యక్రమాలలో క్రియాశీలక పాత్ర పోషించారు. రాజకీయాలు, సాహిత్య వ్యాసంగం ఏకకాలంలో నిర్వహించటం సాధ్యం కాదని భావించి రాజకీయాలకు స్వస్తి పలికాడు. సోమసుందర్ నాలుగో ఫారం చదువుతున్న రోజుల్లో పద్య ప్రక్రియపై ఆసక్తి కలిగి, ఛందస్సును క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. 1943 వరకూ కూడా భావకవిత్వం ఈయనకు తారసపడలేదు. తరువాత తనదైన వచనా శైలిని అలవరచుకున్నారు. సోమసుందర్ కవిత్వంలో కమ్యూనిస్టు భావజాలం అంతర్లీనంగా జాలువారింది. ఆయన 2016, ఆగస్టు 12వ తేదీన కాకినాడలో మరణించారు.

**(నవంబర్ 18 సోమసుందర్ జయంతి)**

**ఎం. రాం ప్రదీప్**

## యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్– నిశ్శబ్ద విపత్తులో ప్రపంచం

అతి ప్రధానమైన 10 ప్రజారోగ్య సమస్యల్లో యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఎఎంఆర్) లేదా యాంటీమైక్రోబియల్ నిరోధకతను ఒకటి గా గుర్తించడంతో 2005 నుంచి ఐరాస ప్రతి ఏట 1824 నవంబర్ రోజుల్లో వరల్డ్ యాంటీమైక్రోబియల్ అవేర్‌నెస్ వీక్ లేదా ప్రపంచ యాంటీమైక్రోబియల్ అవగాహన వారం పాటించుట ఆనవాయితీగా మారింది. బాక్టీరియా, వైరస్, ఫంగీ, పరాన్నజీవులు లాంటి సూక్ష్మ జీవులు కలిగించే సాంక్రమిక వ్యాధులను త్వరగా, సమర్థవంతంగా నయం చేయడానికి యాంటీమైక్రోబియల్ ఔషధాలను వాడుట అలవాటు అయ్యింది. కాలానుగుణంగా సూక్ష్మ జీవుల్లో వస్తున్న మార్పులతో యాంటీమైక్రోబియల్ డ్రగ్స్‌పట్ల సూక్ష్మ జీవులు నిరోధకతను పెంచుకొని, ఆ ఔషధాలకు రోగ కారక సూక్ష్మ జీవులు లొంగకుండా మొండికేయడంతో అంటువ్యాధుల చికిత్సలకు అవాంతరాలు ఏర్పడి ప్రాణాంతక స్థితులకు చేరడంతో పాటు మరో నిశ్శబ్ద విపత్తు ఏర్పడుతున్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ప్రమాదకర విపత్తు వల్ల ఏడాదికి 70లక్షల మంది ప్రాణాలు కోల్పోవడం, ఈ సంఖ్య 2050 వరకు 10 మిలియన్లకు చేరవచ్చని హెచ్చరిస్తున్నారు. ప్రపంచ ఎఎంఆర్ సమస్య ఆసియా, ఆఫ్రికా దేశాల్లోనే 90 శాతం వరకు విస్తరించిందని నిర్ధారణ అవుతున్నది.




ఎఎంఆర్ పెరగడానికి ప్రధాన కారణాలుగా విచక్షణారహితంగా అధిక మోతాదులో ఆంటీమైక్రోబియల్ డ్రగ్స్ వాడడం, సురక్షిత నీటి కొరత, పారిశుద్ధ్యం సమస్యలు, వ్యక్తిగత పరిశుభ్రత లాంటి అవలక్షణాలతో మానవాళే కాకుండా జంతువులు, వ్యవసాయ పంటలు ప్రమాదంలో పడుతున్నాయి. 2000–15 మధ్యకాలంలో ఆంటీమైక్రోబియల్ డ్రగ్స్ వాడకం 65 శాతం వరకు పెరుగగా, 2030 నాటికి 200 శాతం పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. అలాగే 2017–30న మధ్య జంతు చికిత్సలకు వాడే యాంటీబయోటిక్స్ 12 శాతం పెరగవచ్చనే అశుభ వార్తలు వింటున్నాం.

ప్రపంచ యాంటీమైక్రోబియల్ అవగాహన వారం–2025 థీమ్‌గా ఇప్పుడే నడుం బిగిద్దాం: వర్తమానాన్ని పరిరక్షించుకుందాం, భవిష్యత్తును భద్రపరుద్దాం (ఆక్ట్‌నౌ : ప్రొటెక్ట్ అవర్ ప్రజెంట్, సెక్యూర్ అవర్ ఫ్యూచర్) అనబడే అంశాన్ని తీసుకొని అవగాహన కల్పిస్తున్నారు. ఎఎంఆర్ పట్ల అవగాహన కల్పించడానికి పౌరసమాజం, ప్రభుత్వ యంత్రాంగం, వెటర్నరీ విభాగం, రైతులు, ఫార్మసిస్టులు, విద్యావేత్తలు, యువజన సంఘాలు, సీనియర్ సిటిజన్స్, వ్యవసాయ శాఖల సమన్వయంతో కృషి చేయాల్సి ఉంది. కరోనా విపత్తు సమయంలో అధిక శాతం రోగులకు యాంటీబయాటిక్ ఔషధాలను విచక్షణారహితంగా, అధిక మోతాదులో వాడడంతో నేడు దాని దుష్ప్రభావాలు నేడు తీవ్రరూపం దాల్చడం, తీవ్ర అనారోగ్యాలు కలగడంతో పాటు ప్రాణాలు సైతం పోవడం చూస్తున్నాం. గత ఎనిమిది దశాబ్దాలుగా యాంటీమైక్రోబియల్ ఔషధాలను విరివిగా వాడి రోగాలను నయం చేసే ప్రయత్నాలు చేయడంతో ఆ డ్రగ్స్ పట్ల నిరోధకత పెరిగి వాటి ప్రభావం పూర్తిగా తగ్గడం గమనిస్తున్నాం. ఎఎంఆర్ ఫలితంగా సూక్ష్మ జీవుల కారణ సాంక్రమిక వ్యాధులకు చికిత్స కష్టం అవుతున్నది.

రానున్న రోజుల్లో యాంటీబాక్టీరియల్, యాంటీబయాటిక్, యాంటీవైరల్, యాంటీఫంగల్, యాంటీపారాసైటిక్స్ లాంటి ఔషధాలు పని చేయక పోవడంతో, వ్యాధుల కట్టడి వైద్యులకు కష్టం కావడంతో మరో ప్రమాదకర సంక్షోభానికి లేదా విపత్తుకు తలుపులు తెరుచుకుంటున్నాయి. యాంటీమైక్రోబియల్ డ్రగ్స్ పని చేయని యెడల రోగులు/జంతువులు/పంటలు కూడా ప్రభావితం కావడం, పలు సంబంధిత సమస్యలకు దారి తీస్తున్నాయి. వైద్యుల సలహాలు తీసుకోకుండా యాంటీమైక్రోబియల్ డ్రగ్స్ వాడరాదు. యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్‌ను అదుపు చేయడానికి చేతులు శుభ్రంగా కడుక్కోవడం, వ్యక్తిగత శుభ్రత పాటించడం, సురక్షిత నీరు తాగడం, పరిశుద్ధ ఆహారం తీసుకోవడం, టీకాలు తీసుకోవడం, పరిసరాల పరిశుభ్రత, వ్యాధిగ్రస్తులకు దూరంగా ఉండడం, సురక్షిత లైంగిక సంబంధాలు కలిగి ఉండడం లాంటి తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

ఎఎంఆర్ ప్రతికూల ప్రభావంతో ప్రజలు, పశుసంపద, మత్స్యసంపద, పాడి పరిశ్రమ, ఆక్వాకల్చర్, హార్టీకల్చర్, పండ్ల తోటలు, పర్యావరణ వ్యవస్థలు దెబ్బతినే ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి.

యాంటీమైక్రోబియల్ ఔషధాలను వైద్యులు సూచించినట్లుగా విచక్షణతో వాడడం, మోతాదు మించకపోవడం, ఇతర జాగ్రత్తలను తు.చ. తప్పకుండా పాటించడం వల్ల ఎఎంఆర్ అదుపు చేయబడి మానవాళి, జంతువులు, పంటల ఆరోగ్యాలు వర్ధిల్లుతాయి.

**(18–24 నవంబర్ : ప్రపంచ 'యాంటీ–మైక్రోబియల్ నిరోధకత'అవగాహన వారం )**

## ఆర్థికవృద్ధికి చిరునామాలు... పారిశ్రామికవేత్తలు

ఆర్థిక వృద్ధి, ఉద్యోగ కల్పన, సాంకేతిక ఆవిష్కరణల పురోగతి వెనుక ఉన్న చోదక శక్తి పారిశ్రామికవేత్తలు అని గుర్తించాలి. భారతదేశంలో పారిశ్రామితవేత్తల లేదా వ్యవస్థాపకుల లేదా వ్యాపారవేత్తల లేదా ఎంటర్ప్రూనర్స్ ఆవిష్కరణలు, వారు ప్రదర్శించే మానసిక ధైర్యం, దేశ ఆర్థికాభివృద్ధిలో వారి భాగస్వామ్యం, తమ ఉత్పత్తులతో ప్రజల జీవనశైలిని సులభతరం చేయడం లాంటి ప్రధాన బాధ్యతలను నిర్వహిస్తున్నారు. నూతనంగా స్టార్టప్‌లను స్థాపించి, బాలారిష్టాలను అధిగమించి, సవాళ్లకు సవాళ్లు విసిరి తమదైన శైలిలో పరిశ్రమలను గాడిలో పెట్టి, వందల కుటుంబాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనోపాధిని కల్పించి, దేశ సుస్థిరాభివృద్ధిలో పాలు పంచుకుంటున్న పారిశ్రామికవేత్తలు దేశానికి వ్యవసాయం తర్వాత స్థానాన్ని ఆక్రమించి, గౌరవ ప్రదంగా సమాజంలో గుర్తింపు పొంది మనకు ఆదర్శంగా నిలుస్తున్నారు. దేశాభివృద్ధిలో పారిశ్రామికవేత్తల పాత్రను గుర్తించిన పౌర సమాజం ప్రతి ఏట 18 నవంబర్ రోజు జాతీయ పారిశ్రామికవేత్త ల దినోత్సవం (నేషనల్ ఎంటర్ప్రూనర్స్ డే) పాటించడం 2010 నుంచి ఆనవాయితీగా మారింది. చిన్న మొత్తంలో పరిశ్రమలను స్థాపించి, వ్యాపారాలను పెంచుకుంటూ, మార్పులకు అనుగుణంగా తాము మారుతూ, భవిష్యత్తు నాయకులకు స్ఫూర్తినిస్తూ, నూతన ఆవిష్కరణలకు పెద్దపీట వేస్తూ, ఆర్థిక సామాజిక ప్రగతిలో మద్దతునిస్తూ ఎంటర్ప్రూనర్స్ శక్తివంతమైన స్థాయికి చేరుతూ, దేశాన్ని అగ్రభాగాన నిలుపుతూ ఎంతో మేలును చేస్తున్నారు.

**శూన్యం నుంచి ఒక సామ్రాజ్య నిర్మాతలు : పారిశ్రామికవేత్తలు:** శూన్యం నుంచి ఒక సామ్రాజ్యాన్ని నిర్మించిన వ్యక్తులు సామాన్యులు కాదు, అసాధారణ ఘనులు అని అభివర్ణించాలి. చిన్న వ్యాపార యజమానుల నుంచి టెక్ స్టార్టప్ వ్యవస్థాపకుల వరకు అందరూ తమ మేధస్సుకు పనిపెట్టి పౌర సమాజ ఆలోచనలకు అనుగుణంగా తమ ఉత్పత్తులను రూపొందిస్తూ మన జీవితాలను సులభతరం చేస్తున్నారు. పారిశ్రామికవేత్తల కీలక సహకారాల్లో ఉద్యోగ ఉపాధుల కల్పన, ఆధునిక సాంకేతిక ఆవిష్కరణలు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను బలపరచడం, పోటీతత్వాన్ని పెంచడం, పురోగతిలో భాగం కావడం లాంటివి ప్రధాన అంశాలుగా పేర్కొనబడ్డాయి.

**ప్రముఖ పారిశ్రామికవేత్తలు:** ప్రపంచ స్థాయిలో అత్యుత్తమ ఎంటర్ప్రూనర్స్ జాబితాలో థామస్ ఎడిసన్, హెన్రీ ఫోర్డ్, ఓప్రా విన్ఫ్రే, సామ్ వాల్టన్, స్టీవ్ జాబ్స్, బిల్ గేట్స్ లాంటి ఎందరో మహామహులు ఉన్నారు.

భారత్‌లో అత్యుత్తమ పారిశ్రామితవేత్తల జాబితాలో రితేశ్ అగర్వాల్, ఫాల్గుని నాయర్, కిరణ్ మజుందార్, ధీరూభాయ్/ముఖేశ్ అంబానీ, సచిన్ బన్సల్, అజీమ్ ప్రేమ్ జీ, కునాల్ షా, నారాయణ మూర్తి, రతన్ టాటా, ఆనంద్ మహింద్రా, దీపిందర్ గోయల్, లక్ష్మీమిట్టల్ లాంటి ప్రముఖులు ఉన్నారు. జాతీయ పారిశ్రామితవేత్తల దినోత్సవం వేదికగా కార్యశాలల నిర్వహణ, వ్యాపారవేత్తలకు మద్దతు, విజయగాథలను చర్చించడం, ఎంటర్ప్రూనర్ విద్యను ప్రోత్సహించడం, సోషల్ మీడియాల్లో ప్రచారం రూపంలో పాల్గొనడం, మహిళా పారిశ్రామితవేత్తలకు చేయూత ఇవ్వడం లాంటి పలు కార్యక్రమాలను నిర్వహించవచ్చు.

ఇన్ఫోసిస్ అధినేత నారాయణ మూర్తి ప్రారంభంలో వారి సతీమణి ఇచ్చిన పది వేల రూపాయల పెట్టుబడితో ఒక రూపంలో ప్రారంభించిన టెక్ కంపెనీ నేడు 3.23లక్షల ఉద్యోగులతో 1.63 లక్షల కోట్ల టర్నోవర్‌తో ప్రపంచస్థాయిలో అగ్రభాగాన నిలవడం చూస్తున్నాం.

**(18 నవంబర్ జాతీయ పారిశ్రామికవేత్తల దినోత్సవం సందర్భంగా)**

## శిథిలావస్థలో పశువైద్యశాల భవనం

ప్రజాపక్షం/లక్సెట్టిపేట్:లక్సెట్టిపేట్ మండలంలోని వెంకట్రాపేట్ లోని పశువైద్యశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. భవనం కూలిపోయే ప్రమాదం అంచున ఉండటంతో, సిబ్బంది తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని విధులు నిర్వహిస్తున్నారు.భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నప్పటికీ, ఉద్యోగం చేయాల్సి రావడంతో సిబ్బంది తప్పనిసరి పరిస్థితుల్లో పనిచేస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. జరగరాని ప్రమాదం జరగక ముందే సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు చొరవ తీసుకొని నూతన భవనాన్ని మంజూరు చేయించి నిర్మాణాన్ని చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



## బిల్లులు చెల్లించాలని సిఎంకు లేఖ

ప్రజాపక్షం/నిజామాబాద్:రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు సిఎం రేవంత్‌రెడ్డి లేఖ రాశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి మాట్లాడుతూ రాష్ట్రంలో మధ్యాహ్న భోజన కార్మికులు 54, 200 మంది పని చేస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలో భాగంగా పదివేల రూపాయల వేతనాలు చెల్లించాలని కార్మికులకు ఇన్సూరెన్స్ ప్రమాద నష్టపరిహార బీమా, పిఎఫ్, ఇఎస్ఐ యూనిఫారం ఇవ్వాలని కోరుతూ ఎఐటియుసి పిలుపులో భాగంగా ప్రతి స్కూల్‌లో పని చేస్తున్న కార్మికులు సిఎంకు లేఖలు రాయాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సాయమ్మ, భూదేవి, లావణ్య, శంకర్, గంగాధర్, సరస్వతి పాల్గొన్నారు.




## రైస్ మిల్లులో తనిఖీలు



ప్రజాపక్షం/సిర్పూర్‌టి:సిర్పూర్ టి మండలంలోని శ్రీ సాయి బాలాజీ ఆగ్రో టెక్ రైస్ మిల్లులో అనుమానాస్పద పరిస్థితుల నేపథ్యంలో అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డిటి రాజకుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రీనివాస్, సివిల్ సప్లై సిబ్బంది కలిసి మిల్లులో నిల్వలు, రికార్డులు, బియ్యం తరలింపు వివరాలను పూర్తిగా పరిశీలించారు. తనిఖీల సమయంలో మిల్లులో ఉన్న వడ్ల నిల్వలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిసింది. మిల్లులో భారీ లోపాలు, రికార్డుల్లో తేడాలు ఉన్నాయేమో చూడటానికే ఈ దాడులు జరిగాయని సమాచారం. మాయం అయిన వడ్లు ఎక్కడికి పోయాయి..? అసలు మిల్లులో ఏమి జరుగుతోంది? అనే అనుమానాలు ప్రజల్లో పెద్దఎత్తున వ్యక్తమవుతున్నాయి. తనిఖీల అనంతరం అధికారులు కొంత ప్రాథమిక సమాచారాన్ని సేకరించారు. పంచనామ పూర్తయ్యాక అన్ని వివరాలు తెలియజేస్తాం అని మాత్రమే అధికారులు పేర్కొన్నారు.

## నేడు యూనిట్ మార్చ్

ప్రజాపక్షం/నిజామాబాద్:సర్దార్ వల్లభాయి పటేల్ 150వ జయంతిలో భాగంగా నగరంలో 18న యూనిటీ మార్చ్ నిర్వహించటం జరుగుతుందని సమన్వయకర్త బెల్లాల్ తెలిపారు. ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలో సర్దార్ పటేల్ చౌక్ నుండి పాదయాత్ర ప్రారంభమవుతుందని ఈ పాదయాత్ర శివాజీ చౌక్, పూలాంగ్ చౌరస్తా, కోర్టు సర్కిట్ మీదుగా పాత కలెక్టరేట్ మైదానం వరకు కొనసాగుతుందని యూనిటీ మార్చ్‌లో ఎంపి అరవింద్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేష్‌రెడ్డి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డితోపాటుపలువురు ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు.

## రాంగ్ రూట్ వాహనాలపై పోలీస్ ఉక్కుపాదం: సిఐ



ప్రజాపక్షం/మందమర్రి:రోడ్డు భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ మందమర్రి పోలీసులు రాంగ్ రూట్ ప్రయాణంపై ఉక్కుపాదం మోపారు. బురదగూడెం, అందుగులపేట జాతీయ రహదారిపై నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో నిబంధనలు ఉల్లంఘించిన 25 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు షార్ట్ కట్ మార్గాలలో ప్రయాణించి తమ ప్రాణాలను ప్రమాదంలో పెట్టుకోవద్దని హెచ్చరించారు. ప్రజల భద్రతకు ముప్పు కలిగించే ఏ రాంగ్ రూట్ వాహనాన్ని ఉపేక్షించేది లేదని, ఇకముందు కూడా వాహనాలు సీజ్ చేసి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైనకఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సీజ్ చేసిన వాహనాలపై తదుపరి చర్యల కోసం మంచిర్యాల ఆర్‌టిఓ కార్యాలయానికి నివేదించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలను సందర్శించిన ఆర్‌జెడి



ప్రజాపక్షం/దిలావార్‌పూర్:మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పాఠశాల విద్యాశాఖ వరంగల్ ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ కె. సత్యరాయణ రెడ్డి సోమవారం సందర్శించారు.పాఠశాలలోని ప్రతి తరగతి గదిని పరిశీలించి విద్యార్థులను పలు ప్రశ్నలడిగారు.మధ్యాహ్న భోజన వంటశాలను పరిశీలించి,మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మాట్లాడినారు. వంట పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుతూ మెనూ ప్రకారంగా వంట చెయ్యాలని సూచించారు.విద్యార్థుల ఎస్ఆర్.యస్ హాజరును రిజిస్టర్‌లలో గల హాజరును ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు.సమ్మెటివ్ పరీక్ష ఫలితాలను ఆన్‌లైన్‌లోఅప్లోడ్ చేయడం గురించి మండల విద్యాధికారి ప్రధానోపాధ్యాయులు సదానందంను అడిగి తెలుసుకున్నారు. ప్రతి తరగతి గదిలో అభ్యసన ఫలితాలు ప్రదర్శించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.దీర్ఘకాలికంగా గైర్హాజరవుతున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరవు విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఆర్.జే.డి వెంట జిల్లా సహిత విద్య సమన్వయ కర్త ఎన్.ప్రవీన్ కుమార్,మండల విద్యాధికారి సదానందం,ఉపాధ్యాయులు నాగభూషణం,రామ్మోహన్ రావు,లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

## కరాటే పోటీల్లో సిసిసి నస్పూర్ విద్యార్థుల సత్తా



ప్రజాపక్షం/నస్పూర్ :నవంబర్ 16వ తేదీన సిసిఎల్ జిఇఆర్ క్లబ్ సేవా భవనంలో నిర్వహించిన ఐదవ తెలంగాణ రాష్ట్ర స్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ కటా పోటీలలో సిసిసి నస్పూర్ బ్రిక్ బట్టీ మంత్రి మోడల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. సింగిల్ కటాస్, టీం కటాస్, సబరింగ్ విభాగాలలో ఈ విద్యార్థులు ప్రతిభను కనబరిచి బహుమతులు కైవసం చేసుకున్నారు. ప్రథమ స్థానంలో పి. వరలక్ష్మి వేదశ్రీ, ఆర్. రమ కృష్ణ, పి. రాకేష్, బి. భీమిషన్, జి. విగ్నేష్ విల్, ఆర్. ఆరాధ్య, ఎస్. నిరీక్షణ నిలవగా, ద్వితీయ స్థానంలో ఎస్. అంకిత శర్మ, జి. కార్తీక్, ఎ. అశోక్, టి. శిరీష నిలిచారు. తృతీయ స్థానంలో ఆర్. ధనలక్ష్మి, జి. నిక్షి వర్ధన్, డి. సాయి కుమార్, బి. ఆత్మాక్, వి. రమేష్, జె. రుషిత, జె. లలిత బహుమతులు సాధించారు. ప్రతిభ కనబరిచిన ఈ విద్యార్థులను చైర్మన్ శ్రీపురం సత్యనారాయణ, ప్రిన్సిపాల్ మేడం కుమార్, ఇన్‌చార్జ్ పారిక మేడం, ఉపాధ్యాయురాలు కవిత మేడం, కరాటే మాస్టర్ రంగ రమేష్ అభినందించారు.

# కార్మికలోకం

## యాజమాన్యంపై తిరగబడ్డ

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :దేశాయ్ బీడి కార్మికులకు నాణ్యమైన తునికాకు సరఫరా చేయడంలో దేశ బీడియాజమాన్యంబీడి కార్మికులను దోపిడీకి గురి చేయడం వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు.తెలంగాణ ప్రగతిశీల బీడి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తేది.17.11.2025 రోజున లక్ష్మణచందా,మండల్ వడ్యాల్,గ్రామంలో దేశ బీడి హెడ్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా తెలంగాణ ప్రగశీల బీడి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న మాట్లాడుతూ రాత్రనక పగలనక రెక్కలు ముక్కలు చేసుకొని బీడిలు చేస్తుంటే దేశాయి బీడి యాజమాన్యం తునికాకు కోత విధిస్తూ నాసిరకమైన ముక్కుడు,పలుగుడు,దొడ్డు,తుని కాకును సరఫరా చేస్తూ కార్మికులను శ్రమ దోపిడీకి గురి చేస్తున్నారని తెలిపారు.బీడి యాజమాన్యం 1000 బీడికి సరఫరా(ముడి సరుకు)చేస్తున్న తునికాకు వేస్తే కేవలం 600 బీడిలు మాత్రమే తయారవుతున్నాయని మిగతా 400బీడిలకు తునికాకు తుట్టి తుట్టి పోయి కార్మికులు తమ నిజవేతనం నుంచి కొని, కంపెనీకి భర్తీ చేసి నెలకు 300 రూపాయల చొప్పున కూలి నష్టపోతున్నారని మండిపడ్డారు.ఈ దోపిడి విధానాన్ని వెంటనే మానుకోవాలని లేని యెడల పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని కంపెనీ యాజమాన్యాన్ని హెచ్చరించారు.వెంటనే దిగవచ్చి నాణ్యమైన తునికాకు కార్మికులకు సరఫరా చేయాలని బీడి కార్మికులందరికీ పిఎఫ్ నంబర్లు ఐడి కార్డు ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల బీడివర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్, గంగన్న,జిల్లా నాయకులు బొడ్డు గౌతమి మల్లెలవనిత,రాజు, జహీదా బేగం,ఏ.ప్రీతి కుంట లత తదితరులు పాల్గొన్నారు.



## నిజాంసాగర్‌లో విద్యార్థుల ర్యాలీ




ప్రజాపక్షం/నిజాంసాగర్:జాతీయ పుస్తక వారోత్సవాలన పురస్కరించుకుని సోమవారం నిజాంసాగర్ మండలంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. నిజాంసాగర్ జవహర్ నవోదయా విద్యాలయం నుండి విద్యార్థులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తూ బస్టాండు వరకు చేరుకున్నారు. ఈనెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు పుస్తక వారోత్సవాలు కొనసాగుతున్నాయని ప్రిన్సిపాల్ రాంబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకుడు సందీప్‌తో పాటు విద్యార్థులు, విద్యాలయం సిబ్బంది, అద్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యువత సన్మార్గంతోనే దేశ భవిష్యత్తు

ప్రజాపక్షం/బోధన్/ఎడపల్లి:యువత సన్మార్గంలో నడిచినప్పుడే దేశ భవిష్యత్తు బాగుంటుందని నిజామాబాద్ పోలీస్ కమీషనర్ పి.సాయి చైతన్య అన్నారు. సోమవారం నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా పోలీస్, ట్రైనింగ్ మైదానంలో 26టీంలను ఏర్పాటు చేసి కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బోధన్ డివిజన్ పరిధిలోని బోధన్ రూరల్, ఎడపల్లి, రెంజల్ పోలీస్ స్టేషన్ల వారి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఎడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గల జిల్లా పోలీస్ ట్రైనింగ్ మైదానంలో నిర్వహించారు. ఇందులో భాగంగా యువత డ్రగ్స్, చెడు వ్యసనాలకు దూరంగా ఉండేందుకు యువత కోసం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్న సందర్భంగా ముగ్గింపు కార్యక్రమంలో సిపి పాల్గొని మాట్లాడారు.క్రికెట్ టోర్నమెంట్‌లో ఉత్సాహంగా పాల్గొని ఆటలో స్ఫూర్తిని చూపించినందుకు అందరికి అభినందనలు తెలుపుతున్నానన్నారు. ఆటలు మిమల్ని నైతికంగా, శారీరకంగా మానసికంగా బలంగా తీర్చిదిద్దే ఒక మంచి సాధనంగా భావించాలన్నారు. మన సమాజంలో యువత పెద్ద ఎత్తున మత్తు పదార్థాల వైపు ఆకర్షితులవుతున్నారన్నారు. అలాంటి వ్యసనాల వల్ల జీవితాలు నాశనం అవుతాయన్నారు. యువత దేశ భవిష్యత్తు అని మీరు ఆరోగ్యంగా ఉంటూ మంచి ఆశయాలతో, పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. క్రీడలు క్రమ శిక్షణను, మానవతను నేర్పుతాయని, మన బాధ్యతలు మనమే గుర్తించాలన్నారు. మంచి స్నేహితులను మంచి అలవాట్లను ఎంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించగా గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఏసిపిశ్రీనివాస్, బోధన్ రూరల్ సిఐ విజయ్ బాబు, బోధన్ ఎస్‌హెచ్‌ఓ వెంకట్ నారాయణ, రుద్రూర్ సిఐ కృష్ణ, ఎడపల్లి ఎస్ఐ రమత, బోధన్ రూరల్ల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి, రెంజల్ల్ ఎస్ఐచంద్ర మోహన్, కోటగిర్లి ఎస్ఐ సునీల్,క్రీడాకారులు, యువత, బోధన్ సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ ల సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం

### జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



ప్రజాపక్షం/ఆసిఫాబాద్: ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఆయన జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా పింఛను మంజూరు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, డెత్ సర్టిఫికెట్ జారీ, వారసత్వ భూమి బదిలీ (విరాసత్), గ్రామపంచాయతీలో జరిగిన అక్రమాలపై విచారణ, సాగు భూమికి పట్టా మంజూరు వంటి వివిధ సమస్యలపై ప్రజలు దరఖాస్తులు అందజేశారు. అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఎల్‌ఓసి అందజేత

ప్రజాపక్షం/పాపన్నపేట:పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరమని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. సోమవారం మండల పరిధిలో చికోడ్ సభలోఆరేపల్లి గ్రామానికి చెందిన మస్కారి లక్ష్మయ్య కుటుంబ సభ్యులు, రెండు లక్షల 50 వేల ఎల్‌ఓసి పత్రాన్ని అందజేశారు. మాస్కారి లక్ష్మయ్య అనారోగ్య సమస్యతో బాధపడుతున్న నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్రమంలో స్థానిక మండల నాయకులు ప్రశాంత్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ఆరేపల్లి రాజశేఖర్, స్థానిక ఎమ్మెల్యే రోహిత్ రావు దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్‌ఓసి నుంచి 2లక్షల 50 వేల రూపాయలు ఎల్‌ఓసి ఇస్తానని మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఎల్‌ఓసి కాపీనీ మస్కరి లక్ష్మయ్య, కుటుంబ సభ్యులకు అందజేయడంతో మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావుకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వమని, నిరుపేదలకు వైద్య విషయంలో అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. నా దృష్టికి వచ్చిన అనారోగ్య సమస్యల పట్ల నా వంతు సహాయ సహకారం అందించే కృషి చేస్తానని తెలిపారు.



## ప్రజావాణి కార్యక్రమానికి 25 వినతులు

### జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య



ప్రజాపక్షం/సంగారెడ్డి :నేటి ప్రజావాణి కార్యక్రమానికి 25 వినతులు అందాయి . ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్యమాట్లాడుతూ వినతి వెల్లిన వెంటనే పరిష్కారం చూపాలన్నారు. ప్రజావాణి కార్యక్రమం కేవలం సమస్యలు వినే కార్యక్రమంగా కాకుండా పరిష్కారాల వేదికగా నిలవాలని వినతి ఇచ్చి వెల్లిన తర్వాత వెంటనే పరిష్కారం చూపాలన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 25 దరఖాస్తులు అందాయని తెలిపారు. ప్రజల నుండి వివిధ అంశాలకు సంబంధించిన పిర్యాదుల వినతి పత్రాలు అధికారుల తో కలసి స్వీకరించారు. రెవెన్యూ పంచాయతీ రాజ్, సంక్షేమ పథకాల అర్హత ,మున్సిపల్ సమస్యలు వంటి అనేక అంశాలపై వచ్చిన దరఖాస్తులను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు నేరుగా అధికారులను కలుసుకొని తమ సమస్యలు చెప్పుకునే అవకాశం కల్పించడం వల్ల పారదర్శక పరిపాలనకు తోడ్పడుతోందని అధికారులు తెలిపారు. ప్రజావాణి కార్యక్రమాన్ని సమస్యలు పరిష్కరించే వేదికగా మార్చాలని పేర్కొన్నారు. కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు అవసరమైన సూచనలు సహాయం అందించడంలో అధికారులు సిబ్బంది చురుకుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డిఆర్‌ఓ పద్మజారాణి , జెడ్‌పిసిఇఓజానకిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు సిబ్బంది ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల పనితీరుపై సమీక్ష

ప్రజాపక్షం/నిజామాబాద్:జిల్లాలో పెద్ద ఎత్తున ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాల పనితీరుపై కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సమీక్ష జరిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో సోమవారం ఎపియంలు, సహకార సంఘాల మండల ఇన్‌చార్జిలు, సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్లతో ఒక్కో మండలం వారిగా కొనుగోలు కేంద్రాల నిర్వహణ తీరుతెన్నులను సమీక్షించారు. ఆయా కేంద్రాల ద్వారా ఇప్పటివరకు సేకరించినధాన్యం ఎంత, అందులో సన్నాలు, ఎన్ని, దొడ్డురకం ధాన్యం ఎంత పరిమాణంలో సేకరించారు. ధాన్యానికి సంబంధించి రైతులకు బిల్లుల చెల్లింపులు పూర్తయ్యాయా అని ఆరా తీశారు. బిల్లుల చెల్లింపులలో అలసత్వం వహిస్తున్న కేంద్రాల ఇన్‌చార్జిలపై కలెక్టర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, ట్రేనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావి, డిఆర్‌డిఓ సాయగౌడ్, సివిల్ సప్లయి డిఎం శ్రీకాంత్, డిఎస్‌ఓ అరవింద్‌రెడ్డి, డిసిఓ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.



## పేరెంట్స్ కమిటీ సభ్యులను అవమానించిన ప్రిన్సిపాల్

ప్రజాపక్షం/లక్సెట్టిపేట్ :లక్సెట్టిపేట్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల నుండి ఎన్నుకోబడిన పేరెంట్స్ కమిటీ సభ్యులను ప్రిన్సిపాల్ కించపరిచేలా మాట్లాడటం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఇటీవల కమిటీ సభ్యులు భోజనశాలను సందర్శించి అక్కడ ఉన్న లోటుపాట్లను వెలికి తీసి బయటపెట్టారు. దీనిపై ప్రిన్సిపాల్ స్పందిస్తూ, నా పర్మిషన్ లేనిది కిచెన్‌లోకి వెళ్లకూడదు అని అనడం కమిటీ సభ్యులను అవమానించినట్లు ఉంది అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆగ్రహించిన కమిటీ సభ్యులు, అసలు పేరెంట్స్ కమిటీ సభ్యులు చేయవలసిన పని ఏమిటి, తమను ఎందుకు ఎన్నుకుంటారు అనే ప్రశ్నలను లేవనెత్తారు. తమ పని ఏమిటో స్పష్టంగా తెలియజేయాలని ఈ సందర్భంగా కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. పేరెంట్స్ కమిటీ సభ్యులుగా తాము నిర్వహించాల్సిన బాధ్యతలు, తమ అధికార పరిధిని ప్రిన్సిపాల్ ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్నారని వారు మండిపడ్డారు. విద్యార్థుల ఆహారం, వసతిపై లోటుపాట్లను ప్రశ్నించే హక్కు తమకు ఉందని కమిటీ సభ్యులు స్పష్టం చేశారు.




## కాగజ్ నగర్‌లో నూతన ఇఎస్ఐ నిర్మించాలి

### కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిని కోరిన సిర్పూర్ ఎమ్మెల్యే హరీష్ బాబు

ప్రజాపక్షం/కాగజ్‌నగర్:కాగజ్ నగర్ పట్టణంలో నూతన ఇఎస్ఐ ఆసుపత్రిని నిర్మించాలని సిర్పూర్ శాసనసభ్యులు హరీష్ బాబు కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిని కోరారు. హైదరాబాద్ సచివాలయంలో సోమవారం మంత్రిని కలిసిన ఎమ్మెల్యేహరీష్ బాబు, పట్టణంలో గల పాత ఇఎస్ఐ ఆసుపత్రి దుస్థితి గురించి వివరించారు. పాత భవనం శిథిలావస్థకు చేరిందని, వెంటనే దానిని కూల్చివేసి అదే స్థలంలో కొత్త ఇ ఎస్ఐ ఆసుపత్రి నిర్మించి కార్మికులకు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన మంత్రిని కోరారు. దీని పై సానుకూలంగా స్పందించిన మంత్రి వివేక్ వెంకటస్వామి, నూతన ఇఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి త్వరలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



## కలెక్టర్ క్యాంప్ కార్యాలయ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :నిర్మల్ జిల్లా కేంద్రంలో కలెక్టర్ క్యాంప్ కార్యాలయ భవన నిర్మాణానికి బిజెఎల్‌పి నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి భూమి పూజ చేసారు.రూ.8.10 కోట్లతో 5.38 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించే భవన నిర్మాణానికి భూమి పూజ చేసారు.అనంతరం భవన నిర్మాణానికి సంబంధించి అధికారులతో సమీక్ష నిర్వహించి,పరిశీలించారు. మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి,సీనియర్ నాయకులు రావుల రాంనాథ్,మాజీ ఉమ్మడి నిర్మల్ మండల పరిషత్ అధ్యక్షుడు వి.సత్యనారాయణ గౌడ్,జిల్లా ఉపాధ్యక్షుడు సత్యం చంద్రకాంత్ జిల్లా ప్రధాన కార్యదర్శి కరిపే విలాస్, పట్టణ అధ్యక్షుడు ఆకుల కార్తీక్,సుంకరి సాయి,ఆఫీస్ సెక్రటరీ రాచకొండ సాగర్,ట్రెజరర్ అల్లం భాస్కర్,బిజెవైయం జిల్లా అధ్యక్షుడు ఒడిసెల అర్జున్,నాయకులు తాజామాజీ కౌన్సిలర్లు సాదం అరవింద్, బిట్లింగ్ నవీన్, నరేందర్,శంకర్ పతి,శ్రీరామోజు నరేష్, జప ప్రసాద్ ,జుట్టు దినేష్, సాత్విక్, రంజిత్,గంజిరాజు, సుంకరి రాజేష్,బంటి,ఈర్లవిజయ్‌తో పాటు పాల్గొన్నారు.





**సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..**

నిర్మల్ రూరల్:నిర్మల్ నియోజకవర్గంలో చికిత్స కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ముందుకు వచ్చారు.గురువారం ఆయన నిర్మల్ పట్టణం,నిర్మల్ రూరల్,మామడ,దిలావర్‌పూర్,నర్సాపూర్,సోన్,లక్ష్మణచందా మండలాలకు చెందిన 31 మంది లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.వివిధ అనారోగ్యాలతో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారు ప్రభుత్వ సహాయం కోసం తప్పనిసరిగా సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.ప్రజల ఆరోగ్య రక్షణ తమ ప్రాధాన్యత అని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా,పట్టణ,మండల స్థాయి నాయకులు,కార్యకర్తలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 288 ధరఖాస్తులు



ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రజల నుంచి ధరఖాస్తులు స్వీకరించారు. 288 అర్జీలు రాగా సత్వర పరిష్కారం కోసం వాటిని వివిధ శాఖల అధికారులకు బదిలీ చేశారు. పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మి కిరణ్, మున్సిపల కమిషనర్ ప్రపుల్ దేశాయ్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు మహేశ్వర్ పాల్గొన్నారు.

## చేప పిల్లల సరఫరాకు దరఖాస్తు సమర్పించాలి

### జిల్లా మత్స్యశాఖ అధికారి నరేష్ కుమార్ నాయుడు

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్: నవంబర్ 25 లోపు చేప పిల్లల సరఫరాకు ఆసక్తి గలవారు దరఖాస్తు సమర్పించాలని జిల్లా మత్స్యశాఖ అధికారి పి నరేష్ కుమార్ నాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.202526 సంవత్సరానికి చేప పిల్లల పంపిణీ కొరకు ఆసక్తి గల చేప పిల్లల సరఫరాదారులు పెద్దపల్లి జిల్లా టెండర్లలో పాల్గొనుటకు ఆన్ లైన్ లో ధరఖాస్తు చేసుకోవాలని అన్నారు. పెద్దపల్లి జిల్లాలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరము లాగే ఈ సంవత్సరము అనగా 202526 సంవత్సరానికి చేపపిల్లల సరఫరా నిమిత్తము eప్రొక్యుర్మెంట్ ప్లాట్ ఫాం, తెలంగాణ ద్వారా బిడ్లు ఆహ్వానించడం జరిగిందని అన్నారు.నవంబర్ 18 నుండి బీడ్ డాక్యుమెంట్లను డౌన్లోడ్ చేసుకోవచ్చని, నవంబర్ 19న ప్రీ బీడకు సంబందించిన మీటింగ్ అదనపు కలెక్టర్, స్థానిక సంస్థలు పెద్దపల్లి చాంబర్ లో జరుగుతుందని, నవంబర్ 21 ఉదయం 10:30 గంటల నుంచి నవంబర్ 25 మధ్యాహ్నం మూడు గంటల వరకు బిడ్ దాఖలు చేయవచ్చని ఆ ప్రకటనలో తెలిపారు.

## అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం

### జిల్లా సంక్షేమ అధికారి పి.వేణుగోపాల్ రావు

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : నవంబర్ 19న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని జిల్లా సంక్షేమ అధికారి పి. వేణుగోపాల్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ ఆవరణంలోని సమావేశ మందిరంలో ఉదయం 10:30 గంటల నుండి అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామని,పెద్దపల్లి జిల్లాలోని వయవృద్ధులందరూ సకాలంలో విచ్చేసి అంతర్జాతీయ వయవృద్ధుల దినోత్సవ వేడుకలలో భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయగలరని జిల్లా సంక్షేమ అధికారి పి.వేణుగోపాలరావు ఆ ప్రకటనలో తెలిపారు.

## సరోజనకు నివాళులు అర్పించిన ఎఐటియుసి నాయకులు



ప్రజాపక్షం/పెద్దపల్లి : సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని శారదా నగర్ పార్క్ లో కాంట్రాక్టు కార్మికురాలిగా పని చేస్తున్న జక్కుల సరోజన గుండె పోటుతో అకాల మరణం చెందగా సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆర్జీ వన్ అద్యక్షులు ఎం.ఎ.గౌస్ ఆమె పార్థీవ దేహం పై యూనియన్ జెండా కప్పి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎం ఎ గౌస్ ఆమె కుటుంబానికి ప్రగాఢ సంతాపం, సానుభూతి ని వ్యక్తం చేశారు. సింగరేణి లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల ను యాజమాన్యం మెడికల్ చెకప్ ల పేరు తో ఆందోళన లకు గురి చేయడం వల్ల ఆమె హాస్పిటల్ ల చుట్టూ తిరుగుతూ ఆవేదనకు గురి కావడం వల్ల ఆమె మరణించిందని ఆయన పేర్కొన్నారు. సరోజన అకాల మరణం పట్ల కాంట్రాక్టు కార్మికులు తీవ్ర ఆందోళనకు గురి అయ్యారని, యాజమాన్యం మెడికల్ చెకప్ ల కోసం కాంట్రాక్టు కార్మికుల పై ఒత్తిడి చేయవద్దని ఆయన అన్నారు. సాధారణ మెడికల్ చెకప్ లను కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు.ఇంకా నివాళులు అర్పించిన వారిలో కాంట్రాక్టు కార్మికులు నరేష్, పోషం, రాయమల్లు, రాజయ్య, తిరుమల, సువర్ణ, స్వప్న,తదితరులు ఉన్నారు.

## ఎస్సారెస్పీ కెనాల్ మరమ్మతులకు నిధుల మంజూరు



ప్రజాపక్షం/మల్లాపూర్ : మండలంలోని డి 29 ఎస్సారెస్పీ కెనాల్ మరమ్మతులకు ప్రభుత్వం మూడు కోట్ల 13 లక్షల 50వేల రూపాయల నిధులను సోమవారం మంజూరు చేసింది. కాగామండల కాంగ్రెస్ పార్టీ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. డి29 కాల్వ మరమ్మత్తులను దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ నర్సింగరావు ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లడంతో నిధుల మంజూరు కి ప్రభుత్వం చొరవ చూపిందని మండల రైతుల పక్షాన సంబంధిత మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు జలపతి రెడ్డి, రాజన్న ,బాపురెడ్డి, గడ్డం లక్పతి రెడ్డి, మహిపాల్ రెడ్డి,నర్సారెడ్డి నరసయ్య, రాజేందర్ సోమయ్య, కిరణ్, రమేష్ సురేష్,రాఘవులుభూమయ్య, కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## ఆల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్‌లో ఘనంగా 'ఓరిసన్'



ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:కరీంనగర్‌లోని భగత్‌నగర్‌లో గల ఆల్ఫోర్స్ ఇ టెక్నో పాఠశాలలో 'ఓరిసన్' (విషయాల అవగాహన కార్యక్రమం) ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అల్ఫోర్స్ విధ్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి హాజరై ప్రారంభించి మాట్లాడారు. విధ్యార్థులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, అంశాలలో పట్టు సాధించే విధంగా సమగ్ర సమాచారం ఇవ్వాలని సూచించారు. విధ్యార్థుల్లో దాగిన ప్రతిభను వెలికి తీయడానికి వార్షిక ప్రణాళికలో భాగంగా అనేక రకమైన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. విధ్యార్థులకు ప్రోత్సాహంతో పాటు ప్రశంస పత్రాలను అందిస్తున్నామని చెప్పారు. విధ్యార్థులకు తరగతి గదిలోని విషయాలను చాలా చక్కగా వర్ణించాలని, పట్టు సాధింపజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బైక్‌ను ఢీకొన్న కారు: ఒక్కరు మృతి




ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : అర్ధరాత్రి వేళ అతివేగం ఒకరు ప్రాణాలు కోల్పోగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలపైయ్యన ఘట న ఆదివారం అర్ధరాత్రి నల్లగుట్ట వద్ద చోటు చేసుకుంది. జగిత్యాల రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుగ్గారం మండ లం, శేకల్ల గ్రామానికి చెందిన బంక శ్రీను చిన్న కొడుకు బంక అరుణ్, 23 సం అను అతడు ఆదివారం రాత్రి 9:30 గంటల సమయంలో తన స్నేహితులు అయిన తాళ్లపల్లి అజయ్, విష్ణుతో కలిసి అజయ్ ద్విచక్ర వాహనంపై ముగ్గురు యువకులు శేకల్ల నుండి జగిత్యాలకు వస్తుండగా తిమ్మాపూర్ గ్రామ శివారులోని నల్లగుట్ట వద్ద ఎదురుగా వస్తున్న షిఫ్ట్ డిజైర్ కారు ఢీకొట్టగా వెనుకాల కూర్చున్న బంక అరుణ్ అక్కడికక్కడే మరణించారని, బైక్ నడుపుతున్న అజయ్ విష్ణులకు కళ్ళు చేతులకు తీవ్ర గాయాలు కాగాచికిత్స నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ కి తరలించారని మృతుడి తండ్రి పిర్యాదు మేరకు జగిత్యాల రూరల్ పోలీస్ వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించమని తెలిపారు.

## కేసులు పెట్టి జైలులో వేసిన

# లొంగకుండా పోరాటాలు

### దేశవ్యాప్తంగా కోటి ఎకరాల భూమిని పంచిన చరిత్ర సిపిఐది

### సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి




ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : 100 సంవత్సరాలలో సిపిఐ పార్టీ ప్రభుత్వాలతో పోరాడి కార్మికులకు ఎలాంటి హక్కులు సాధించిందో నేటి తరానికి తెలియడానికే ఈ బస్సు జాతాలను నిర్వహించడం జరుగుతుందని సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. సోమవారం సిపిఐ కార్మిక భవనంలో విలేఖరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. అనంతరం సిరిసిల్లకు చేరుకున్న బస్సు జాత లో పాల్గొన్నారు. సిపిఐ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా మూడు జాతాలు బయలుదేరాయని అన్నారు. దేశానికి సంపూర్ణ స్వాతంత్రం రావాలని శ్రమకు తగ్గ ఫలితం దక్కాలని జాగిర్దారుల నుండి జమీందారులపై సిపిఐ పార్టీ పోరాడింది అన్నారు. కుట్ర కేసులు పెట్టి జైల్లో పెట్టినప్పటికీ ప్రభుత్వాలకు లొంగకుండా పోరాటం చేసిందన్నారు. రైతు, కూలి సంఘాలను చైతన్యపరిచి పోరాటాలు కొనసాగిస్తూ నైజాం పాలన అంతముందేందుకు 4500 మంది కార్మికులు ప్రాణాలను పోగొట్టుకున్నారన్నారు. దేశవ్యాప్తంగా కోటి ఎకరాల భూమిని పంచిన చరిత్ర సిపిఐ పార్టీకి ఉందన్నారు. ప్రభుత్వాలు ఓట్లు వేయించుకోవడానికి ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తూ అరచేతులో స్వర్గం చూపిస్తుందన్నారు. పార్టీలు మారుతున్నప్పటికీ వ్యవస్థ మారడం లేదని మండిపడ్డారు. ఇలాంటి వ్యవస్థను ప్రజాస్వామ్యవాదులు ఖండించాలన్నారు. 14 వేల కోట్లు ఎలా గల్లంతయ్యాయో తేటతెల్లమ్ చేసేందుకు చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తుందని ఎద్దేవ చేశారు. అనుకూలమైన వారిపై కేసులు లేకుండా ప్రశ్నించే వారి గొంతులు నొక్కుతున్నారన్నారు. మతం పేరుతో మన్వాద సిద్ధాంతాలను ముందుకు తీసుకొస్తున్నారన్నారు. కొద్ది మంది చేతుల్లోనే ఎక్కువ సంపద ఉందని పేదవారికి మాత్రం సరైన విద్య వైద్యం ఉద్యోగం ఉపాధి అవకాశాలు లేక ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారన్నారు. దేశంలో ఉన్న వామపక్ష పార్టీలు వీటిపై ప్రశ్నించాలన్నారు. జాతీయ కార్యవర్గ సభ్యులు కలవేణి శంకర్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠ రెడ్డి, డి హెచ్ పిఎస్ రాష్ట్ర కార్యదర్శి మారుపాక అనిల్, ప్రజానాట్యమండలి పల్లె నర్సింహ, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపెల్లి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, అధ్యక్షులు అజ్జ వేణు, తిరుపతి రెడ్డి, శ్రావనపెల్లి మల్లేశం, మంద అనిల్, కుర్ర రాజేష్, ఆదిత్య ఒడ్డెపెల్లి లక్ష్మణ్,మంత్రిచంద్రయ్య తదితరులుపాల్గొన్నారు.

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

### జగిత్యాల జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అవగాహన



ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : జగిత్యాల అర్బన్ పిఎంశ్రీ దరూర్ క్యాంప్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జగిత్యాల జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జగిత్యాల జిల్లా బాలల పరిరక్షణ విభాగన్ నుండి చైల్డ్ లైన్ 1098 అధికారి కేసు వర్కర్ రజిత స్కూల్ లోని పిల్లలకు బాల్య వివాహం పై అవగాహన కల్పించారు. స్కూల్లో పిల్లలకి బాల్య వివాహ చట్టం 2006, పోక్సో చట్టం 2012, మత్తు పదార్థాలు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించమని అన్నారు. బాల్య వివాహాల నిరోధక చట్టం 2006 ప్రకారం 18 సంవత్సరాల లోపు అమ్మాయికి 21 సంవత్సరంలోపు అబ్బాయికి వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని అందుకు రెండు సంవత్సరాల జైలు శిక్ష మరియు లక్ష రూపాయల వరకు జరిమానా విధించబడుతుందని అదేవిధంగా బాల్య వివాహాల వల్ల పిల్లలకు భవిష్యత్తులో మానసిక శారీరక ఎదుగుదల ఆగిపోతుందని అలాగే ప్రభుత్వం నుంచి ఇచ్చే ప్రోత్సాహాలు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలు వర్తించవని గ్రామపంచాయతీ పరిధిలో బాలల పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేసి పిల్లల సమస్యలను గురించి చర్చించి పిల్లలకు సమస్య ఉంటే ఈ కమిటీ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఎంశ్రీ జిల్లా పరిషత్ దరూర్ క్యాంపు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అమర్ నాథ్ రెడ్డి, ఐసీడీఎస్ సూపర్వైజర్ స్వరూప రాణి, సహాయ ఎన్.జి.ఓ నుండి లహరి, అంగన్వాడి టీచర్ శ్యామల, ఆశా వర్కర్ అంజలి, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీదేవి, శ్రీలత, తదితరులు పాలొన్నారు.

## 23న యువ కార్మికుల జంటలకు సన్మానం

### ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్



ప్రజాపక్షం/పెద్దపల్లి : సింగరేణిలో ఎఐటియుసి యూనియన్ ఆవిర్భావంతో పాటు సిపిఐ పార్టీ ఆవిర్భావం జరిగి వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆర్జీ వన్ ఆధ్వర్యంలో నవంబర్ 23న యువ కార్మికుల జంటలకు సన్మానం చేయాలని నిర్ణయించిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ పేర్కొన్నారు. సోమవారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియాలోని జిడికె వన్ ఇంక్లైన్‌లో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సింగరేణిలో కార్మికుల సంక్షేమం కోసం వారి హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటాలు ఉద్యమాలు చేసి సాధించుకున్న హక్కులను నేడు కార్మిక వర్గం అనుభవిస్తుందని ఆయన అన్నారు. ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఉపాధ్యక్షులు సంకె అశోక్, నాయకులు రంగు శ్రీను, మానాల శ్రీనివాస్, కలవేణి రాజేష్, పెరుమాండ్ల రమేశ్‌గౌడ్,సంపత్‌రావు,తదితరులు పాల్గొన్నారు.

## బస్సు డ్రైవర్‌ను సస్పెండ్ చేయాలి

### ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం




ప్రజాపక్షం/పెద్దపల్లి : గోదావరిఖని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చదువుతున్న మేఘన అనే విద్యార్థిని చేతి పైనుండి బస్సు ఎక్కించిన కరీంనగర్ డిపో 2బస్సు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోదావరిఖని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో హెచ్‌ఈసి ద్వితీయ సంవత్సరం చదువుతున్న మేఘన అనే విద్యార్థిని కళాశాల అయిపోగానే గోదావరిఖని బస్టాండు నుండి ఎఫ్‌సిఐ ఇంటికి బయలుదేరు సమయంలో గోదావరిఖని బస్టాండ్‌లో బస్సు ఎక్కేటప్పుడు బస్సు డ్రైవర్ దురుసుగా వెనక్కి బస్సు తీయడం వల్ల విద్యార్థిని కింద పడిపోవడం జరిగిందని, విద్యార్థిని చేతిపై నుండే బస్సును ఎక్కించడం వల్ల విద్యార్థిని చెయ్యి నుజ్జునుజ్జు కావడం జరిగిందని ఆయన అన్నారు. దీనికి కారణం బస్సు డ్రైవర్ దురుసుగా నడపడమే కారణమని అక్కడ ఉన్నటువంటి విద్యార్థులు చెప్పడం జరిగిందని ఆయన అన్నారు. కరీంనగర్ డిపో టు కు చెందిన పల్లె వెలుగు బస్సు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని, విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థిని చెయ్యి మెరుగయ్యేంతవరకు బస్సు డ్రైవర్ బాధ్యత వహించాలని, దురుసుగా మాట్లాడుతున్న గోదావరిఖని బస్ డిపో మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. బస్సు పాస్ సౌకర్యం ఉన్న విద్యార్థులను బస్సు ఎక్కించుకోకుండా బస్సు డ్రైవర్లు, కండక్టర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు. గుండేటి తరుణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో స్టూడెంట్స్ క్లబ్ విధానం స్ఫూర్తిదాయకం

### మంత్రి బండి సంజయ్ కుమార్




ప్రజాపక్షం/కరీంనగర్:విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి, అన్ని రంగాల్లో రాణించేందుకు కరీంనగర్ జిల్లాలో వినూత్నంగా చేపట్టిన స్టూడెంట్స్ క్లబ్బుల ఏర్పాటు విధానం రాష్ట్రానికి స్ఫూర్తిదాయకమని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఈ విధానాన్ని రాష్ట్రమంతా అమలు చేయాల్సిందిగా ముఖ్యమంత్రికి లేఖ రాస్తానని వెల్లడించారు. జిల్లాలోని 172 పాఠశాలల్లో ఏర్పాటు చేసిన స్నేహిత, ఈకో స్పోర్ట్స్, కాన్షియస్‌నెస్, రిటరల్లి ల్యాథర్న్ క్లబ్బులలో సభ్యులుగా ఉన్న 2566 మంది విద్యార్థులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌చే టీషర్టులను, బ్యాడ్జీలను అందించారు. జిల్లా యంత్రాంగం ఆద్వర్యంలో 578 పాఠశాలలకు గ్యాస్ కనెక్షన్లను అందజేశారు. కళాభారతిలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ హాజరై విద్యార్థులకు టీషర్టులు, బ్యాడ్జీలు పంపిణీ చేశారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థుల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన క్లబ్బుల విధానం ద్వారా విద్యార్థుల్లో లీడర్‌షిప్, ప్రశ్నించే తత్వం పెరుగుతుందని అన్నారు. విద్యారంగ సమస్యలను వారు అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకుంటారని తెలిపారు. ఈకో క్లబ్ విధానం ద్వారా వ్యవసాయం, అనుబంధ రంగాలు, మార్కెటింగ్‌పై విద్యార్థులకు అవగాహన వస్తుందని, తద్వారా వారు భవిష్యత్తులో రాణించే అవకాశం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాని తెలిపారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ పాఠశాలలో ఏర్పాటుచేసిన ప్రతి క్లబ్ విద్యార్థికి ప్రత్యేక బాధ్యత ఉందని తెలిపారు. సైన్స్‌పై అవగాహన కోసం ఈకో క్లబ్ ఏర్పాటు చేశామని, విటమిన్ గార్డెన్ల ద్వారా వ్యవసాయం, ఉత్పత్తి, మార్కెటింగ్ వంటి వాటిపై అవగాహన తెప్పిస్తున్నామని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజి రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య, డిఈవో మొండయ్య, విద్యాశాఖ కో ఆర్డినేటర్లు మిల్కూరి శ్రీనివాస్, అశోక్‌రెడ్డి, కృపారాణి, ఎంఈవోలు, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

## శ్రీరాములపల్లిలో గర్భిణీ ఆత్మహత్య

### కుటుంబంలో విషాదఛాయలు

ప్రజాపక్షం/ఇల్లందకుంట:ఇల్లందకుంట మండలంలోని శ్రీరాములపల్లి గ్రామంలో విషాద ఘటన చోటు చేసుకుంది. 7 నెలల గర్బిణి మౌనిక (24) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన స్థానికంగా కలకలం రేపింది. గత సంవత్సరం డిసెంబర్‌లో మౌనిక వివాహం జరిగింది. భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బుద్దారం గ్రామానికి చెందిన ప్రశాంత్‌ను వివాహం చేసుకున్న ఆమె కొంతకాలంగా అదనపు కట్నం కోసం వేధింపులు ఎదుర్కొంటున్నట్లు మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అదనపు కట్నం కోసం తమ కూతురిని వేధించడంతోనే ఆమె ప్రాణాలు తీసుకుందని మౌనిక తల్లి ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై క్రాంతికుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

## ఆయకట్టుకు సాగునీరు అందించాలి

### పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి : ధర్మారం మండలంలోని వివిధ ప్రాజెక్టుల కింద చేపట్టిన ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని,సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షసమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ధర్మారం మండలానికి సంబంధించి నీటిపారుదల పనులపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ధర్మారం మండలం బొమ్మారెడ్డి పల్లి గ్రామంలో నూతనంగా రెండు కాల్వలు నిర్మిస్తే మిగిలిన భూమికి సాగునీరు అందే అవకాశం ఉందని, దీనికి సంబంధించి సర్వే పూర్తి చేసి భూ సేకరణ ప్రతిపాదనలు,సిద్ధం చేయాలని అన్నారు ధర్మారం మండలంలో నీటి పారుదల ప్రాజెక్టు సంబంధించి ఆయకట్టు సాగు నీరు అందించేందుకు వీలుగా అవసరమైన కాల్వల నిర్మాణానికి పెండింగ్ భూ సేకరణప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## కంపు కొడుతుందని శుభ్రం చేశారు

ప్రజాపక్షం ఎఫెక్ట్

ప్రజాపక్షం/మల్లాపూర్ : పవిత్ర గోదావరి నది తీరాన ఉన్న వాల్గొండ గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక మురుగునీరు చేరి కంపు కొడుతుందని శుభ్రం చేశారు అనే వార్తా కథనం ప్రజాపక్షం పత్రికలో ప్రచురితం కాగా జిల్లా మండల స్థాయి అధికారులు స్పందించారు. సోమవారం ఎంపి ఓ జగదీష్ గ్రామంలో డ్రైనేజీలో మురుగునీరు చేరి నిలిచి ఉన్న కాలనీలను సందర్శించి డ్రైనేజీలను సిబ్బందితో కలిసి శుభ్రం చేయించారు. రెండు మూడు రోజుల్లో గ్రామంలోని డ్రైనేజీలన్నిటిని శుభ్రం చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని గ్రామస్తులకు తెలిపారు. తమ సమస్య పరిష్కారానికి దారి చూపిన ప్రజాపక్షం పత్రికకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజలకు భద్రత కల్పించడంలో

# మహిళా బ్లూకోల్ట్స్ కీలకపాత్ర

### కరీంనగర్‌లో వినూత్న షీ లీడ్స్ శిక్షణా కార్యక్రమం ప్రారంభం

### కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌస్ ఆలం






ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ: మేమున్నాం అనే ధైర్యాన్ని, భరోసాను కేవలం మాటల్లో కాదు, చేతల్లో చూపిస్తున్నారు కరీంనగర్ పోలీసు కమిషనరేట్‌లోని మహిళా పోలీసులు. పోలీసుశాఖలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతూ కరీంనగర్ సిపి గౌస్ ఆలం వినూత్నమైన షీలీడ్స్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కేవలం ఆఫీసు విధులకే పరిమితం కాకుండా, మహిళా పోలీసులను విజిబుల్ పోలీసింగ్‌లో ముఖ్యభాగస్వామ్యం చేసేందుకు వారికి బ్లూకోల్ట్స్ విధులు కేటాయించడం, ఈ ఆలోచన ఇప్పటికే సత్ఫలితాలిస్తోంది. ప్రజలకు భద్రతపై మరింత దృఢమైన నమ్మకాన్ని కల్పించడంలో మహిళా బ్లూకోల్ట్స్ కీలక పాత్ర పోషిస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో సంఘటనలు ఎదురైనప్పుడు సమర్థవంతంగా ఎదుర్కొనేలా మహిలా పోలీసులను తీర్చిదిద్దడం ఈ కార్యక్రమ ముఖ్యోద్దేశ్యమని సిపి తెలిపారు.

### క్షేత్రస్థాయిలో ఎదుర్కొనే సవాళ్లకు సమగ్ర శిక్షణ

పోలీసు శాఖలో విధులు నిర్వహించాలంటే శారీరక దృఢత్వంతో పాటు మానసికంగా దృఢంగా ఉండాలని, మనల్ని మనం రక్షించుకునే స్థితిలో ఉన్నప్పుడే ప్రజలను రక్షించగలమని సిపి గౌష్ ఆలం తెలిపారు. దాదాపు 100 మంది మహిళా పోలీసులకు (షీటీమ్స్ సభ్యులతో సహా) రెండు దశల్లో కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలో ప్రత్యేక శిక్షణను అందిస్తున్నామని తెలిపారు. కరాటే ఆత్మరక్షణ విద్యలో సుశిక్షితులుగా తీర్చిదిద్దడం ఈ శిక్షణ ప్రధాన లక్ష్యమని, వీరు తమను తాము రక్షించుకోవడమే కాక, ఆపదలో ఉన్న పౌరులకు రక్షణ కల్పించేలా వీరికి శిక్షణ అందిస్తున్నామన్నారు. ధర్నాలు, నిరసనల్లో ముఖ్యంగా మహిళా నిరసనకారులను తరలించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెళకువలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఈ సున్నితమైన అంశాలను ఎలా సమర్థంగా, మానవీయంగా నిర్వహించాలో నేర్పిస్తున్నామని తెలిపారు. కఠినమైన క్షేత్రస్థాయి విధుల్లో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించేందుకు పోలీసులకు మానసిక దృఢత్వాన్ని పెంచేలా ఈ శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించామని సిపి తెలిపారు.

### భరోసాకి కొత్త అర్థం

క్షేత్రస్థాయిలో సంఘటనలు ఎదురైనప్పుడు ఏ మాత్రం తొట్రుపాటు లేకుండా వాటిని ధైర్యంగా ఎదుర్కొనేలా ఈ శిక్షణ మహిళా పోలీసులను సన్నద్ధం చేస్తోందన్నారు. విధి నిర్వహణలో నిరంతర అప్రమత్తత అవసరమైని, నేర్చుకున్న ఈ అంశాలను అవసరమైతే తప్పకుండా ఉపయోగించుకోవాలని సిపి సూచించారు. ఈ షీ లీడ్స్ చొరవ, మహిళా శక్తిని కేవలం కార్యాలయానికి పరిమితం చేయకుండా ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా వారికి మరింత దగ్గరయ్యేలా చేస్తుందని సిపి ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళా బ్లూకోల్ట్స్ బృందం వీధుల్లో తిరుగుతుంటే తమకు రక్షణ ఉందనే ధైర్యం, ఆత్మవిశ్వాసం ప్రజల్లో మరింత పెరుగుతాయని సిపి అభిప్రాయపడ్డారు. ఈ వినూత్న సంస్కరణ ద్వారా కరీంనగర్ పోలీసు శాఖ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టి సత్ఫలితాలనిస్తుందని సిపి ఆకాంక్షించారు. కార్యక్రమంలో అడిషనల డిసిపి భీంరావు, ఏసిపి శ్రీనివాస్, జి.వేణుగోపాల్, మాధవి కరాటే మాస్టర్ వసంత్‌కుమార్, ఇతర ఇన్స్‌పెక్టర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# క్రీడ

## జనవరి 7 నుంచి నాలుగో సీజన్




ఈ రెండు నగరాల్లోనే మ్యాచ్‌లు...

మహిళల క్రికెట్‌ను కొత్త పుంతలు తొక్కించిన మహిళల ప్రీమియర్ లీగ్ మరో ఎడిషన్‌కు సిద్ధమవుతోంది. మూడు సీజన్లుగా అభిమానులను స్టేడియాలకు రప్పించిన ఈ మెగా టోర్నీ నాలుగో సీజన్ జనవరిలోనే ప్రారంభం కానుంది. ఐదు ఫ్రాంచైజీలు రీటెన్షన్ జాబితాను సమర్పించడంతో వేలానికి సన్నాహకాలు చేస్తున్న నిర్వాహకులు.. టోర్నీ తేదీలను కూడా ఖరారు చేసే పనిలో ఉన్నారు. క్రిక్‌బజ్ కథనం ప్రకారం జనవరి 7 నుంచి ఫిబ్రవరి 3 వరకూ నాలుగో సీజన్ జరుగనుందని సమాచారం. వచ్చే ఏడాది భారత్, శ్రీలంక సంయుకంగా పురుషుల టీ20 వరల్డ్‌ప్ పోటీలకు ఆతిథ్యమిస్తున్నాయి. ఫిబ్రవరి మొదటి వారంలోనే ప్రపంచ కప్ జరుగనున్న నేపథ్యంలో డబ్ల్యుపిఎల్ షెడ్యూల్‌ను ముందుకు జరిపారు నిర్వాహకులు. అందుకే.. ఫిబ్రవరిలో ప్రారంభం కావాల్సిన టోర్నీ ఈసారి జనవరిలోనే షురూ కానుంది. అంతేకాదు మూడో సీజన్ మాదిరిగా కాకుండా డబ్ల్యుపిఎల్ నాలుగో సీజన్ మ్యాచ్‌లను రెండు నగరాల్లో నిర్వహించే అవకాశముంది.

రెండు విడతలుగా సాగే ఈ మెగా ఈవెంట్‌కు ముంబై, బరోడాలను వేదికలుగా ఎంపిక చేసినట్టు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. తొలిదశ మ్యాచ్‌లు నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో.. రెండో దశ మ్యాచ్‌లు బరోడాలోని కోటంబి మైదానంలో డబ్ల్యుపిఎల్ మ్యాచ్‌లు ఆడించనున్నారు. జనవరి 16 నుంచి.. ఫిబ్రవరి 3న ఫైనల్ వరకూ బరోడానే వేదిక కానుందని టాక్. అయితే.. టోర్నీ ఆరంభ తేదీ, వేదికలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

### మంధానకు రికార్డు ధర

మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ కోసం భారత క్రికెటర్లను ఫ్రాంచైజీలు భారీ ధరకు రీటైన్ చేసుకున్నాయి. విశ్వవిజేతగా అవతరించిన టీమిండియాలోని సభ్యులైన స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, రీచా ఘోష్‌ల బ్యాండు వాల్యూ పెరగడమే కాదు రీటైన్ ధర కూడా కోట్లకు చేరింది. స్వదేశంలో ముగిసిన వరల్డ్ కప్‌లో చెలరేగి ఆడిన మంధానను రూ.3.50 కోట్ల రికార్డు ధరకు ఆర్సీబీ రీటైన్ చేసుకుంది. వరల్డ్ కప్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా ఎంపికైన దీప్తి శర్మను యూపీ వారియర్స్ వదిలేసింది.

డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్ వేలంలో ఫ్రాంచైజీలు రూ.15 కోట్లు ఖర్చు చేయనున్నాయి. స్లాబ్స్ విషయానికొస్తే.. ఒక క్రికెటర్‌కు మాత్రమే రూ.3.5 కోట్లు చెల్లించే అవకాశముంది. రెండో ప్లేయర్‌కు రూ.2.5 కోట్లు, మూడో ప్లేయర్‌కు రూ.1.75కోట్లు, నాలుగో బ్యాటర్‌కు రూ.1 కోటి.. ఐదుగురు ప్లేయర్లకు రూ.50 లక్షలు వేలం పాట పాడాల్సి ఉంటుంది. ఒక ఫ్రాంచైజీ ఐదుగురిని అట్టిపెట్టుకుంటే వాళ్ల పర్స్ నుంచి రూ.9.75ను తొలగిస్తారు. ఒకవేళ నలుగురిని రీటైన్ చేసుకుంటే.. రూ.8.75 కోట్లు.. ముగ్గురికి రూ.7.75 కోట్లు, ఇద్దరిని రీటైన్ చేసుకుంటే రూ.6 కోట్లు కట్ చేస్తారు.

**ముంబై ఇండియన్స్ :** నాట్ సీవర్ బ్రంట్ (రూ.3.5 కోట్లు), హర్మన్‌ప్రీత్ కౌర్ (రూ.2.5 కోట్లు), హేలీ మాథ్యూస్(రూ.1.7కోట్లు), అమన్‌జోత్ కౌర్(రూ.1.0కోట్లు), జి. కమలిని(రూ.50 లక్షలు). ప్రస్తుతం ముంబై పర్స్‌లో 5.75 కోట్లు ఉన్నాయంతే.

**ఢిల్లీ క్యాపిటల్స్ :** జెమీమా రోడ్రిగ్స్,(రూ.2.2 కోట్లు) షఫాలీ వర్మ(రూ.2.2 కోట్లు), మరినే కాప్(రూ.2.2 కోట్లు), అనాబెల్ సథర్‌లాండ్(రూ.2.2 కోట్లు), నిక్కీ ప్రసాద్ అన్‌క్యాప్డ్(రూ.50 లక్షలు). ఢిల్లీ పర్స్‌లో రూ.6.75 కోట్లు ఉన్నాయి.

**యూపీ వారియర్స్ :** శ్వేతా షెరావత్ (రూ.50 లక్షలు). పర్స్‌లో 14.5 కోట్లు ఉన్నాయి.

**ఆర్సీబీ :** స్మృతి మంధాన(రూ.3.5 కోట్లు), రీచా ఘోష్ (రూ.2.75కోట్లు), ఎలీసా పెర్రీ(రూ.2 కోట్లు), శ్రేయాంక పాటిల్(రూ.60లక్షలు)లను మాత్రమే రీటైన్ చేసుకుంది. పర్స్‌లో 6.15 కోట్లు ఉన్నాయి.

**గుజరాత్ జెయింట్స్ :** బేత్ మూనీ (రూ.3.5కోట్లు), అష్ గార్డ్‌నర్(రూ.2.5కోట్లు). పర్స్‌లో రూ.9 కోట్లు ఉన్నాయి.

## కోల్‌కతా టెస్టులో భారత్ ఓటమి..

### కోచ్ గంభీర్, సెలక్షన్ కమిటీ చైర్మన్‌పై మండిపడ్డ మాజీ ఫాస్ట్ బౌలర్!



కోల్‌కతాలో దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టెస్టులో మూడో రోజు భారత జట్టు ఘోర పరాజాయాన్ని చవిచూసింది. తొలి రెండురోజుల్లో మ్యాచ్ భారత్‌కు అనుకూలంగా ఉండగా.. మూడోరోజు ఒక్కసారిగా మలుపు తిరిగి ఒక్కసారిగా జట్టు కుప్పకూలింది. 124 పరుగుల సాధారణ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత్ కేవలం 93 పరుగులకే ఆలౌట్ అయ్యింది. ఈ ఓటమి తర్వాత, భారత మాజీ ఫాస్ట్ బౌలర్ వెంకటేష్ ప్రసాద్ టీమ్ మేనేజ్‌మెంట్, సెలక్షన్ కమిటీపై ప్రశ్నలు లేవనెత్తారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టారు. 'వైట్‌బాల్ క్రికెట్‌లో అద్భుతంగా ఉన్నాం. కానీ, ఈ రకమైన ప్రణాళికలో మనం అత్యుత్తమ టెస్ట్ జట్టుగా చెప్పుకోలేం. సెలక్షన్‌లో స్పష్టత లేకపోవడం, అతి వ్యూహాత్మక ఆలోచన జట్టును దెబ్బతీస్తోంది. గతేడాదిలో టెస్ట్ క్రికెట్‌లో ఫలితాలు నిరాశ పరిచాయి' అంటూ వెంకటేశ్ ప్రసాద్ పేర్కొన్నారు. కోచ్ గౌతమ్ గంభీర్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌ను నేరుగా విమర్శలు గుప్పించారు.

గంభీర్ కోచ్ అయ్యాక భారత టెస్ట్ రికార్డు చర్చనీయాంశంగా మారింది. నిర్దిష్ట ప్రణాళిక లేకుండా జట్టులో మార్పులు చేస్తున్నారని.. ఇది స్థిరత్వాన్ని ప్రభావితం చేస్తున్నట్లుగా ప్రసాద్ విమర్శించారు.

తొలి టెస్టులో టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొలి ఇన్నింగ్స్ సమయంలో గాయంతో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. మెడ గాయంతో పెవిలియన్‌కు చేరుకున్నాడు. కేవలం మూడు బంతులు మాత్రమే ఆడాడు. గిల్‌ను ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నట్లుగా బిసిసిఐ వెల్లడించింది. జట్టు బ్యాటింగ్ ఇప్పటికే ఒత్తిడిలో ఉండగా.. జట్టు కెప్టెన్ లేకపోవడంతో మరింత ఇబ్బందికరంగా మారింది. ఈ మ్యాచ్‌లో బావుమా ఇన్నింగ్స్ కీలకమైంది. బావుమాను భారత బ్యాట్స్‌మెన్‌లో కట్టడి చేసి ఉంటే ఫలితం మరోలా ఉండేది క్రికెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# యువతరంగం


ఫోకస్

## నేర్చుకోవాల్సిన నైపుణ్య కళలు



శాశ్వతంగా ప్రయోజనం చేకూర్చే నైపుణ్యాలు లేదా కళలను నేర్చుకోవడం ప్రతి ఒక్కరికీ అవసరం. ప్రత్యేకించి యువతకు అత్యవసరం. ఎవరికి వారు తమకు ఏ రంగం ఇష్టమైనదో లేదా ఏ రంగంలోనైతే తాము రాణిస్తామో తెలుసుకోవాలి. అప్పుడే కొత్త నైపుణ్యాలను త్వరగా, సమర్థంగా నేర్చుకోవచ్చు లేదా మెరుగుపరచుకోవచ్చు. 'అడాప్ట్, ఇంప్రోవైజ్, ఓవర్‌కమ్' అనమే లక్షణాలను నిపుణులు తరచు చెప్తుంటారు. సవాళ్లు ఎదురైనప్పుడు, వాటికి అనువయ్యే విధంగా ప్రవర్తించడమే అడాప్టబిలిటీ, సమస్యలకు పరిష్కారాలను కనుగొనే క్రమంలో, కొత్తగా నేర్చుకున్న అంశాలకు లేదా తమకు ఇది వరకే తెలిసిన విషయాలకు మరింత మెరుగులు దిద్దుకోవాలి. దీనిని ఇంప్రొవైజేషన్‌గా పేర్కొంటారు. ఇక మూడోది ఓవర్‌కమింగ్.. అంటే, ఎదురయ్యే సమస్యల నుంచి సమర్థంగా బయటపడే లక్షణాన్ని అలవచుకోవడం. వీటికి తోడు మెదడును ఎప్పుడు స్వచ్ఛంగా ఉంచుకోవాలి. అప్పుడే మనస్సు శాంతిగా, స్పష్టంగా ఉంటుంది. ఉత్తమ నిర్ణయాలు తీసుకోవడానికి దోహదం చేస్తుంది. నైపుణ్యాలతోపాటు వ్యక్తీకరణ నైపుణ్యం కూడా అత్యవసరం. మీ భావాలను, అవసరాలను స్పష్టంగా వ్యక్తీకరించడానికి ఈ అలవాటు సహాయపడుతుంది. మనో బలాన్ని పెంచుతుంది. ఆలోచనలు పంచుకోవడం.. చర్చించడం వల్ల ప్రగతికి మార్గాలు నిర్మించుకోవచ్చు. మీరు ఎవరితోనైనా ఒప్పందాలు కుదుర్చుకోవాలన్నా, లావాదేవీలు జరపాలన్నా విశ్వసనీయత కీలకం. స్పష్టత అనేది విశ్వసనీయతకు మార్గం. మీ విద్య, ఉద్యోగ, వ్యక్తిగత జీవితం కార్యకలాపాల్లో ఇది అత్యంత కీలకమై పాత్ర పోషిస్తుంది. అదే విధంగా, శ్రద్ధగా వినడం, నేర్చుకోవడం కూడా అవసరమే. వినడం ద్వారా, ఇతరులను అర్థం చేసుకోవచ్చు. స్వయంగా కొత్త విషయాలను తెలుసుకోవచ్చు. స్వయంకృతంగా పురోగతి సాధించడానికి, బలహీనతలను అధిగమించడానికి ఈ లక్షణం ఉండాలి.ప్రతి సమస్యను చిన్న చిన్న భాగాలుగా విభజించి, వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించడాన్ని అలవాటు చేసుకోవాలి. ఆత్మ పరిశీలన అనేది ఎదుగుదలకు నిచ్చన. మీ బలహీనతలు, లక్ష్యాలు, పురోగతిని తెలుసుకోవడానికి ఈ స్వభావం ఉపయోగపడుతుంది. భావజాల నైపుణ్యాలను పెంచుకునే క్రమంలో, ఇతరులను అర్థం చేసుకోవడం, వారికి సహానుభూతిని ప్రదర్శించడం ఒక అలవాటుగా మారాలి. మీ విలువలను మీరు తెలుసుకోవడం, పరిస్థితులు కఠినంగా ఉన్నా నిబద్ధత చూపడం, ఎదురయ్యే ప్రమాదాలను స్వీకరించి వాటిని సమర్థంగా ఎదుర్కోవడం తదితర లక్షణాలు ఆత్మబలాన్ని పెంచుతాయి. జీవితం మొత్తం రిస్క్‌లతో కూడుకున్న ప్రయాణం. అందుకే, రిస్క్ చేయడానికి వెనుకడుగు వేయకూడదు. రిస్క్ తీసుకోవడం ద్వారా అభివృద్ధి సాధించవచ్చు. అవిశ్రాంతమైన జీనన విధానాలతో తలమునకలై ఉన్నప్పటికీ, ఎప్పుకో ఒకప్పుడు.. ఎంతోకొంత విశ్రాంతి తీసుకోవడం అవసరం. శరీరాన్ని, మనసును ఆరోగ్యంగా ఉంచుకోవాలంటే, విశ్రాంతి కావాలి. చదవడం, అర్థం చేసుకోవడం ద్వారా, వివిధ విషయాలలో అవగాహన పెరుగుతుంది. ఈ నైపుణ్యాలు ఏ రంగంలో అయినా, జీవితంలో నీటిని, అభివృద్ధిని తీసుకురాగలిగేవే కాబట్టి, వీటిని వంటబట్టించుకోవడం అవసరం.

## స్మార్ట్‌ఫోన్ ధరకే డయాలిసిస్ యంత్రం!



వినడానికే ఆశ్చర్యం కలిగించే ఈ అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది అన్యా పొఘూరియన్. కెనడాకు చెందిన ఈ 17 ఏళ్ల విద్యార్థిని చేసిన ఈ అసాధారణ ఆవిష్కరణ ప్రపంచ ఆరోగ్య సేవల రంగాన్ని, ముఖ్యంగా తక్కువ ఆదాయం ఉన్న ప్రాంతాల్లో కిడ్నీ వ్యాధితో బాధపడే వారికి, పూర్తిగా మార్చివేస్తుందనడంలో ఆశ్చర్యం లేదు. ప్రపంచ వ్యాప్తంగా వేలాది మంది కిడ్నీ బాధితులు ఖరీదైన చికిత్సలు అందుబాటులో లేక ప్రాణాలు కోల్పోతున్న తరుణంలో అన్యా చేసిన ప్రయోగం హర్షణీయం. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కూడా వేలాది మంది డయాలిసిస్ సౌకర్యం లేక జీవనమరణ స్థితిలో పడుతున్నారన్న సమాచారం ఆమెను ఆలోచింప చేసింది. ఈ సమస్యకు తెరదించాలన్న పట్టుదల పెరిగింది. అధిక ఖర్చులు, సదుపాయాల కొరత వంటి సమస్యలు ప్రజలను ఎలా బాధిస్తున్నాయో తెలుసుకున్న ఆమె, మార్పును తీసుకురావాలని నిర్ణయించుకుంది. సాధారణ భాగాలు, ఓపెన్ సోర్స్ ఇంజనీరింగ్ ఆధారంగా తక్కువ ఖర్చుతో సరికొత్త పరిష్కారం సిద్ధం చేయడానికి ఎన్నో రాత్రులు కష్టపడింది. గొప్ప ఫలితాన్ని సాధించింది. ఆసుపత్రుల్లో ఉపయోగించే యంత్రాల్లాగే ప్రధాన సేవలను అందించే, తీసుకెళ్లడానికి సౌకర్యమైన, తక్కువ ధరలో లభించే డయాలిసిస్ యంత్రాన్ని ఆమె రూపొందించింది. రోగుల రక్తంలో ఉన్న విష పదార్థాలు, అదనపు ద్రవాన్ని ఈ యంత్రం తొలగిస్తుంది. సాధారణ చికిత్సలు అందుబాటులో లేని పరిస్థితుల్లో ప్రాణాలను నిలబెడుతుంది. 500 డాలర్ల కన్నా తక్కువ ఖర్చుతో ఈ యంత్రం అందుబాటులోకి రావడం వల్ల, ఇంతకు ముందు ఆశ కోల్పోయిన లక్షలాది మంది ఇప్పుడు చికిత్సపై ఆశ పెంచుకుంటున్నారు. వైద్య నిపుణులు ఇప్పటికే దీనిపై దృష్టి సారించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థలు కూడా ఈ యంత్రాన్ని పల్లెటూర్ల ఆసుపత్రుల్లో, మొబైల్ వైద్య కేంద్రాల్లో ఉపయోగించే అవకాశాలపై పరిశీలిస్తున్నాయి. ఈ టీనేజర్ పని వయస్సు, ధనం వంటి అవరోధాలను దాటిపోయే 'ఆవిష్కరణ'కు అసలు అర్థాన్ని చూపించింది. నిజమైన శక్తి ఉద్దేశ్యంలోనూ, అభిరుచిలోనూ ఉంటుందని నిరూపించింది. సవాళ్లతో నిండిన ఈ ప్రపంచంలో, ఒక ఆలోచన ఎంతటి ప్రాణాలను కాపాడగలదో గుర్తు చేస్తుంది. కొన్నిసార్లు వైద్య రంగం భవిష్యత్తు పెద్ద పరిశోధనా కేంద్రాల్లో కాదు, పట్టుదలతో ముందుకు సాగే ఒక చిన్న మనసులోంచే వెలుస్తుంది. గొప్ప ఆవిష్కరణతో అన్యా యూత్ ఐకాన్‌గా మారింది.

### యూత్ ఐకాన్స్

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష లను ఇనుమడింప చేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..

## నేటి నుండి 'హనుమకొండ'లో సిపిఐ బస్సు ప్రచార జాతా

### సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి




**ప్రజాపక్షం/హనుమకొండ :** భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సిపిఐ రాష్ట్ర బస్సు జాత హనుమకొండ జిల్లాలో ఈ నెల 18, 19 తేదీలలో భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ లో, ఎలకతుర్తి, హసన్ పర్తి, హనుమకొండ, దామర, శాయంపేట మండలాల మీదగా కొనసాగుతూ పరకాలలో ముగింపు చేసుకొని జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు వెళ్లనున్నట్టు సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి తెలిపారు. కార్యకర్తలు, నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జాతను విజయవంతం చేయగలరని కోరారు. కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తల త్యాగాలు, అమరవీరుల రక్తతర్పణంతో సిపిఐకి ఈ దేశంలో ఒక స్థానం ఉందని తెలిపారు.నేటి పాలకులు ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ ధ్వంసం చేస్తూ ప్రైవేట్ పెట్టుబడిదారులకు కార్పొరేట్ సంస్థలకు దక్కే విధంగా లక్షల కోట్ల రూపాయల విలువైన సంస్థలను కట్టబెడుతున్నారని విమర్శించారు. సిపిఐ రాష్ట్ర బస్సు జాతకు నాయకత్వం సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణి శంకర్, సిపిఐ రాష్ట్ర నాయకులు మారూపాక అనిల్, మణికంఠ రెడ్డి లతో పాటు ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు పాల్గొంటున్నారని భిక్షపతి తెలిపారు.

### 20న ములుగులో..



**ప్రజాపక్షం/ములుగుః** సిపిఐ ఆవిర్భవించి 100 సంవత్సరాలు నిండిన సందర్భంగా శత జయంతి ఉత్సవాల పేరుతో జరుగుతున్న ప్రచారంలో భాగంగా ములుగు వ్యవసాయ మార్కెట్‌లోని మార్కెట్ హమాలీలు, సివిల్ సప్లయి హమాలీ కార్మికుల సంయుక్త సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడారు. పార్టీ ఆవిర్భవించిన నాటి నుండి కార్మికుల చట్టాల కోసం కార్మికుల హక్కుల కోసం కనీస వేతనాల కోసం రైతులకు గిట్టుబాటు ధర కోసం ఉపాధి హామీ చట్టం కోసం, సమాచార హక్కు చట్టం కోసం, అటవీ హక్కుల చట్టం కోసం సబ్బండ వర్గాలకు అవసరమైన అనేక చట్టాలను సాధించడం కోసం జరిగిన పోరాటాలు చేసిన పార్టీ సిపిఐ పార్టీ అన్నారు. ఈ నెల 20న ములుగు జిల్లా కేంద్రంలోని సిపిఐ బస్సు జాత ప్రవేశిస్తున్నందున ఆ జాతకు నాయకత్వం వహిస్తున్న సిపిఐ మాజీ కార్యదర్శి మాజీ ఎంఎల్‌ఏ చాద వెంకట్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు తదితర నాయకులు హాజరవుతున్నారు.ములుగు జిల్లా కేంద్రంలోకి ఉదయం 11 గంటలకు చేరుకొని జాతా కార్యక్రమాలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి అంజద్ పాషా, నాయకులు రామన్న, వాంకుడోత్ వీరన్న, రొంటాల రమేష్, యాటల పైడి, బిక్షపతి, కుమార్ పాల్గొన్నారు.

## దళారులను నమ్మొద్దు.. కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మాలి

### చాతకొండ, సోములగూడెంలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన కూనంనేని సాంబశివరావు





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేసే విధంగా అధికారులు ఏర్పాట్లు చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా సహించేది లేదని కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. లక్ష్మీ దేవిపల్లి మండల పరిధిలోని చాతకొండ గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, కొత్తగూడెం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. రైతు సభలో కూనంనేని మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించకుండా సహకార సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు ఎటువంటి అలసత్వం వహించకుండా, నాణ్యతా ప్రమాణాలు పేరుతో రైతులకు ఇబ్బంది పెట్టకుండా, తరుగుపేరుతో కోతవిధించకుండా సత్వరమే ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాల నిర్వహణలో ఏమైనా సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలని, తక్షణమే పరిష్కరిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. సంఘం అధ్యక్షులు మండే వీరహనుమంతరావు, ఉపాధ్యక్షులు కూచిపూడి జగన్, డైరెక్టర్ చంద్రగిరి శ్రీనివాసరావు, తహశిల్దార్ శిరీష, ఎంపిడిఓ రాకేష్, సివిల్ సప్లై డిటి మహేష్, విద్యుత్ శాఖ ఏఇ రాఘవయ్య హౌసింగ్ ఏఇ డేవిడ్, అర్ఐ శివకృష్ణ, సిపిఐ నాయకులు దీటి లక్ష్మీ పతి, నూనావత్ గోవిందు, మంద గ్రాబ్రియేల్, కోడి లింగయ్య, పర్స లక్ష్మయ్య, మాధవరావు, మంకెన ప్రసాద్, క్రాంతి భూషణ్, ఏఇఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### గోనె సంచులు అందుబాటులో ఉంచాలి

**పాల్వంచ :** రైతులకు గిట్టుబాటు ధర కావాలంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించి మద్దతు ధర పొందాలని ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. మండల పరిధి సోములగూడెంలో దాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు.సభలో కూనంనేని మాట్లాడుతూ ఆరుగాల కష్టించి పండించిన పంటను త్వరగా అమ్ముకోవాలనే ఆతృతతో దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని హెచ్చరించారు. నియోజకవర్గ వ్యాప్తంగా సహకార సంఘాల ఆధ్వర్యంలో దాన్యం కొనుగోలు కేంద్రాలను ఏ ర్పా టు చేయటం జరుగుతుందన్నారు. ప్రభుత్వ కేంద్రాలలో విక్రయించి మ ద్దతు ధరతో పాటుగా బో నస్‌ను పొంది ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నారు. రైతులు తీసుకొచ్చిన దాన్యాన్ని జాప్యం చేయకుండాకొనుగోలు చేయాలని, గోనె సంచుల కొరత లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి శంభో శంకర్, సొసైటీ ఉపాధ్యక్షులు కాంపల్లి కనకేష్, తహశీల్దార్ దారా ప్రసాద్, ఎంపిడిఓ విజయ భాస్కర్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు, సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, జిల్లా కమిటి సబ్యులు ఉప్పుశెట్టి రాహుల్, నాయకులు అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకటరావు, నిమ్మల రాంబాబు, రంజిత్, రైతులున్నారు.

## పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) :** పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి పత్తి కొనుగోలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి ప్రభుత్వాని కోరారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన సిపిఐ పార్టీ కౌన్సిలింగ్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) భారత గడ్డపై వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఖమ్మంలో డిసెంబర్ 26న భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని ఈ భారీ బహిరంగ సభను జయప్రదం చేయడానికి రాష్ట్ర పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బస్సు జాత ఈనెల 20, 21, 22 తేదీలలో జిల్లాలో అన్ని మండలాలు తిరుగుతుందని బస్సు జాతను డప్పులు, కళాకారులతో ఘన స్వాగతం పలికి సభలు నిర్వహించి సిపిఐ పోరాట చరిత్రను ప్రజలకు వివరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దామోదర్ రెడ్డి పిలుపునిచ్చారు. పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి రైతులు ఇబ్బందులు తొలగించాలని, స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చిన సిపిఐ సిద్ధంగా ఉందని అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొని స్వాతంత్ర ఉద్యమంలో అగ్ర బాగాన నిలబడి పోరాటం చేసిందనీ, భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి నుండి విముక్తి కోసం పోరాటాలు నిర్వహించిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదని 4వేల కమ్యూనిస్టుల బలిదానం తో 10 లక్షల ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచిన చరిత్ర అని గుర్తు చేశారు. దేశంలో ఎదుర్కొంటున్న కార్మిక కర్షక విద్యార్థి నిరుద్యోగ సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ పోరాటాలు చేస్తున్నదని అయన అన్నారు. సిపిఐ శతజయంతి ఉత్సవాల ముగింపు బహిరంగ డిసెంబర్ 26న ఖమ్మంలో నిర్వహిస్తున్న బహిరంగసబకు యాదాద్రి భువనగిరి జిల్లా నుండి పార్టీ కార్యకర్తలు, సానుభూతి పరులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మరుపాక వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు, ఎండీ ఇమ్రాన్, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మి నర్సయ్య, మండల సహాయ కార్యదర్శి ఎండీ నయీమ్, రైతు సంఘం జిల్లా నాయకులు జక్క దయాకర్ రెడ్డి, చేనేత సంఘం జిల్లా నాయకులు జెల్ది రాములు, నాయకులు సుల్తాన్ పూరషోతం, యాస బుచ్చి రెడ్డి, ఆంబోజి రాములు, దుర్గాపతి నర్సయ్య, మరుపాక అంజయ్య, సోమనబోయిన నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల కోసం నిరంతర పోరాటం

### సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/తుంగతుర్తి(తిరుమలగిరి):** ఖమ్మంలో డిసెంబర్ 26న భారత కమ్యూనిస్టు పార్టీ 100 వసంతాల ముగింపు ఉత్సవాలను జయప్రదం కోసం నవంబర్ 15న బాసరలో ప్రారంభమై తుంగతుర్తి నియోజక వర్గ తిరిమలగిరికి చేరుకొని నాగారం, తుంగతుర్తి, మద్దిరాల, నూతనకల్ మండలాల్లో జరుగు జాతను జయప్రదం చేయాలని సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పార్టీ శ్రేణులను కోరారు. సోమవారం మల్లీశ్వరి థియేటర్‌లో నియోజక వర్గ ఇంచార్జి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్లంల యాదగిరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిధిగా మాట్లాడారు. ఈ జాతలో జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లా ఖాద్రీ, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి డిజి నరేంద్రప్రసాద్ రానున్నారని తెలిపారు. వారికి ఘనమైన స్వాగతం పలికి జయప్రదం చేయాలన్నారు. తిరుమలగిరి, నూతనకల్, తుంగతుర్తి మండలాల కార్యదర్శులు ఎస్‌డి ఫయాజ్, తొట్ల ప్రభాకర్, పాల్వాయి పున్నయ్య, ఏఐటియుసి జిల్లా నాయకులు రాజారామ్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు జంపాల మల్లయ్య, కె రామస్వామి, తిపిరాల శ్రీకాంత్, ఎండి ఏక్‌బాల్, యానాల వెంకట్, పురుషోత్తం, నాగులగాని మల్లయ్య పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS

ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని ఎనిమిదవ డివిజన్ వైఎస్ఆర్ నగర్‌లో మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ల శిక్షణ ఇప్పించి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కాంగ్రెస్ నాయకులు బోడా శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం సర్టిఫికెట్లతో పాటు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రవణ్ కుమార్ సహకారంతో మాతృశ్రీ మహిళా మండలి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 30 మంది మహిళలకు కుట్టు శిక్షణ అందించారు. శిక్షణ పూర్తి చేసిన వారికి కుట్టుమిషన్లు అందించేందుకు కృషి చేస్తామన్నారు.






## ధర్నాకు తరలిన పెన్షనర్లు

**ప్రజాపక్షం/ఖమ్మం :** పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కులో జరిగిన మహా ధర్నాకు ఖమ్మం జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో పెన్షనర్లు తరలి వెళ్లారు. ఖమ్మం పెన్షనర్ల కార్యాలయం నుంచి ప్రత్యేక వాహనాల్లో హైదరాబాద్ తరలి వెళ్లారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పరిశ పుల్లయ్య, రాయల రవి కుమార్‌లు మాట్లాడుతూ పెన్షనర్ల ఆందోళన తీరు చూసైనా ప్రభుత్వం స్పందించాలన్నారు. తక్షణం పెన్షనర్లకు రావాల్సిన బకాయిలను విడుదల చేయాలని పుల్లయ్య, రవికుమార్‌లు డిమాండ్ చేశారు. జిల్లా నుంచి హాజరైన ప్రముఖుల్లో మేరీ ఏసుపాదం, శరత్‌బాబు, భాస్కరాచారి, వెంకటేశ్వర్లు, అంజలి, వీరభద్రరావు, అన్నమ్మ తదితరులు ఉన్నారు.



## గ్రానైట్ ట్రేడర్స్ అండ్ మార్కర్స్ నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం గ్రానైట్ ట్రేడర్స్ అండ్ మార్కర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సోమవారం ఖమ్మం గ్రానైట్ ట్రేడర్స్ అండ్ మార్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తీక మాసం వన సమారాధనను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి సహపంక్తి భోజనం చేశారు. సంఘం సలహాదారులు అదాలత్ నరేందర్, వెంపటి వెంకటేశ్వర్లు, సంఘం అధ్యక్షులు వెంపటి ఉపేందర్ ఆధ్వర్యంలో నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా నునావత్ కిషన్, కార్యదర్శిగా ఎస్‌కె జాని, ఉపాధ్యక్షులుగా ఎస్‌కె పాషా, కత్రం శేషగిరి, కోశాధికారి ఆకుల సైదులు, ఎం. రామ్మూర్తి, జాయింట్ సెక్రటరీగా నర్సింహారావు, హన్మంతరావులను ఎన్నుకున్నారు. అదేవిధంగా ఇసి మెంబర్లుగా వి.శ్రీను, దిలీప్, ఎ.శ్రీకాంత్, వెంకటేష్, కె. రమేష్, అంజి, ఫయాజ్ ఖాన్, అలీమ్ ఎన్నుకున్నారు.



## ఉద్యోగుల ఆరోగ్యమే సంస్థ మనుగడకు మూలం

జిఎం చింతల శ్రీనివాస్

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** ఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటేనే సంస్థ మనుగడ సాగిస్తుందన్నారు సింగరేణి జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్. సింగరేణి సి అండ్ ఎండి బలరాం మార్గ నిర్దేశంలో, జిఎం చింతల శ్రీనివాస్ ఆదేశాల మేరకు జలగం వెంగళరావు ఓపెన్ కాస్ట్ 2లో సోమవారం ప్రాచీన యోగ దినచర్య కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ సిహెచ్. శ్రీనివాసరావు హాజరై యోగా ఆసనాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగులందరూ ఆరోగ్యంగా ఉంటేనే సంస్థలో రక్షణ, ఉత్పత్తి, ఉత్పాదకత బాగుంటుందని, ఉద్యోగుల ఆరోగ్యం కోసం ప్రాచీన యోగ దినచర్యను ఏర్పాటు చేయడమైనదన్నారు. ఈ కార్యక్రమంలో యోగ ట్రైనర్ షణ్ముఖ శివచంద్ర ఉద్యోగులకు ఆరోగ్యం, పురాతన యోగ జీవనశైలిపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జెవిఆర్ ఒసి2 ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎన్ వి ఆర్ ప్రహ్లాద్, కిష్టారం ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ సునీల్ వర్మ, హెచ్ ఒడి, జేవిఆర్ సిహెచ్ పికే.సోమశేఖర్, ప్రాజెక్ట్ ఇంజినీర్లు జేవిఆర్ ఒసి, కిష్టారం ఒసి డి.శ్రీనివాస రావు, జి.వెంకటేశ్వర రావు, బి.రాజేశ్వర రావు,జి కళ్యాణ్‌రామ్, బి రామకృష్ణ, వెల్ఫేర్ ఆఫీసర్లు దార కావ్య, కె శ్రీనివాస్, ఐఎన్‌టియూసి నాయకులు నాగ ప్రకాశ్, ఎఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.




## కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** సింగరేణి సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేసి, సింగరేణి సంస్థకు బకాయి ఉన్న రూ.40వేల కోట్లను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలంగాణ జాగృతి హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జనం బాట కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సత్తుపల్లి సింగరేణి బొగ్గు గనిని సోమవారం సందర్శించారు. అనంతరం కార్మికులనుద్దేశించి కవిత మాట్లాడుతూ ఈనెల 19న తెలంగాణ జాగృతి హెచ్ఎస్ ఆధ్వర్యంలో సింగరేణి సంస్థ కార్పొరేట్ కార్యాలయ ముట్టడి కార్యాక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి తెలంగాణ జాగృతి అధ్యక్షులు సాగర్, రియాజ్ అహ్మద్, హెచ్ఎంఎస్ జనరల్ సెక్రెటరీ, తిప్పారపు సారయ్య, వై.ఆంజనేయులు, కొత్తగూడెం ఏరియా ప్రెసిడెంట్, శ్రీలత, వి.శ్రీనివాస్, సెంట్రల్ వైస్‌ప్రెసిడెంట్, ఎం.ఆనంద్, ఎండి ఆసిఫ్, ఎండి ఆజాద్ ఖాన్, హెచ్ఎంఎస్ యూనియన్ నాయకులు, కార్యకర్తలు, సింగరేణి సంస్థ ఉద్యోగులు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డా.పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డిలు పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఖమ్మం అర్బన్ మండలం పుట్టకోటకు చెందిన భవాని, మరియమ్మ, మమత, రామకళ, శైలజ, మల్లేశ్వరి, లక్ష్మిలు తమకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఖమ్మంలోని అబ్దుల్‌కలాం ఆజాద్ స్వయం సహాయక సంఘం తరుపున నిర్వహిస్తున్న షాపు రెంట్ తగ్గించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ముదిగొండ మండలం వల్లభి గ్రామ యువత గ్రామంలో గ్రంథాలయం పరిశీలించి మూసి ఉంచిన బిడిసి సెంటర్‌ను ప్రారంభించి పోటీ పరీక్షలకు యువత సన్నద్ధమయ్యేవిధంగా అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఖమ్మం కార్పొరేషన్ తొమ్మిదవ డివిజన్ కార్పొరేటర్ షేక్ జాన్‌బీ రోటరీ నగర్‌లో ఇండ్ల మధ్య ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్‌ను తొలగించాలని దరఖాస్తు చేశారు. ఆయా దరఖాస్తులను పరిశీలించిన అదనపు కలెక్టర్లు సత్వర చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిఆర్‌డివో సన్యాసయ్య, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రాధాన్యత కార్యక్రమాల అమలుపై దృష్టి సారించాలి**

ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలుపై మండల ప్రత్యేకాధికారులు దృష్టిసారించాలని అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం అనంతరం ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై మండల ప్రత్యేకాధికారులు ప్రతి శుక్రవారం చేపట్టిన తనిఖీ సంబంధిత అంశాలపై అదనపు కలెక్టర్లు డా.పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి లు సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ ప్రతి మండల పరిధిలో ఎఫ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం అమలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థల నిర్వహణ, ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల ప్రత్యేకాధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలు మండల పరిధిలో కట్టుదిట్టంగా అమలు జరిగేవిధంగా ప్రత్యేకాధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. మండల పరిధిలో ప్రతిపాదించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తి స్థాయిలో ప్రారంభించాలని, పత్తి కొనుగోలు కేంద్రం వద్ద అవసరమైన వసతులు ఉన్నాయో లేవో పరిశీలించాలన్నారు. నాణ్యమైన ధాన్యం కొనుగులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు జరిగేలా పర్యవేక్షణ ఉండాలని అదనపు కలెక్టర్ తెలిపారు. మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాల్లో ఎఫ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమ అమలు తీరును నిర్దిష్టంగా పరిశీలించాలన్నారు. విద్యా సంస్థలను తనిఖీ చేస్తూ అక్కడ పారిశుధ్య నిర్వహణ, భోజన నాణ్యత, పిల్లలకు అవసరమైన వసతుల కల్పన వంటి అంశాలను పరిశీలించి నివేదిక అందించాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఒ సన్యాసయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ నిరంతరం పోరాటం

డిసెంబరు 26న సిపిఐ శతాబ్ది ఉత్సవ ముగింపు సభ

సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు

**ప్రజాపక్షం/బోనకల్ :** డిసెంబరు 26న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవ ముగింపు సభకు ఊరూ, వాడ కదలి వచ్చి జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు కోరారు. మండలంలోని ముష్టికుంట్ల, ఆళ్లపాడు, మోటమర్రి గ్రామాలల్లో శతాబ్ది ఉత్సవ ముగింపు సభను జయప్రదం చేయాలని కోరుతూ ఇంటింటి ప్రచారం సోమవారం నిర్వహించారు. సిపిఐ వందేళ్ల చరిత్ర అంతా పేదలు, అణగారిన వర్గాల పక్షాన పోరాటాలు చేసిందన్నారు. ఓట్లు, సీట్లు కోసం కాకుండా ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడేది సిపిఐ మాత్రమేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని కోరారు. శతాబ్ది ఉత్సవ ముగింపు సందర్భంగా ఖమ్మంలో 10లక్షల మందితో నిర్వహించే సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సభకు 20 దేశాలపైగా ప్రతినిధులు, జాతీయ, ఆయా రాష్ట్రాల నాయకులు పాల్గొని ప్రసంగించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సహాయ కార్యదర్శి బుర్రి నాగేశ్వరరావు, ఆకెన పవన్, వంగాల కృష్ణ, కొంగర భాస్కరరావు, బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, బెజవాడ నరేష్, బుంగ నరసింహ పాల్గొన్నారు.

## డయాగ్నస్టిక్ హబ్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన డిఎంఅండ్‌హెచ్ఓ

**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం :** ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని డయాగ్నస్టిక్ హబ్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.రామారావు, మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ ఎం నరేందర్‌తో కలిసి టి హబ్‌ను సోమవారం ఆకస్మీక తనిఖీ చేశారు. ల్యాబ్ మేనేజర్, ల్యాబ్ టెక్నిషియన్ల విధులను పర్యవేక్షించారు. ల్యాబోరేటరీ సేవల వేగాన్ని మరింత మెరుగు పరచాని, పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రజలకు వేగంగా నిర్ధారణ రిపోర్టులను అందించాలని, ల్యాబ్ టెస్టుల కోసం వచ్చే పేషంట్లకు ఇబ్బందులు లేకుండా వాష్‌రూం, త్రాగునీరు, సిట్టింగ్ సదుపాయాలు కల్పించాలని, ల్యాబోరెటరీ పరిసరాలు ఇన్ఫెక్షన్ లేకుండా చూడాలని తెలిపారు. కెమిస్ట్రీ ఎనలైజర్‌కు చిన్న చిన్న సాంకేతిక లోపాలు ఏర్పడడం వల్ల ఈ రోజు టెక్నిషియన్ వచ్చి రిపేర్లు చేపడుతారని తెలిపారు. గవర్నమెంట్ జనరల్ హాస్పటల్‌లో ఉన్న సెంట్రల్ ల్యాబ్, ఎమర్జెన్సీల్యాబ్‌లో ఎమర్జెన్సీ పరీక్షల నిర్వహణ ఆలస్యం కాకుండా జరుగుతున్నాయని, క్లినికల్ బయోకెమిస్ట్రీ, క్లినికల్ పాథాలజీ, మైక్రో బయాలజీలకు సంబంధించిన దాదాపు 134 టెస్టులను నిర్వీరామంగా నిర్వహిస్తున్నామని, జిల్లాలోని 26 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 4 యూపిహెచ్‌సిలు, 9 బస్తీ దవాఖానలు, 7 కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల నుండి ప్రతి రోజు డయాగ్నస్టిక్ హబ్‌కు 1500ల నుండి 2 వేల వివిధ రకాల బ్లడ్ శాంపిల్స్ టెస్టులకు వస్తున్నాయని, 8 మంది ల్యాబ్ టెక్నిషియన్లు పరీక్షలు నిర్వహిస్తున్నారని, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బిందుశ్రీ, నోడల్ ఆఫీసర్ ల్యాబ్ మేనేజర్ డి బిందు భార్గవి అందుబాటులో ఉండి పర్యవేక్షణ చేస్తారని, మెడికల్ డయాగ్నస్టిక్‌కు సంబంధించి పరీక్షలు సేవలు ప్రజలకు వేగంగా, శాస్త్రీయంగా జరుగుతున్నాయని, ఇంకా అదనపు పరికరాలు, సదుపాయాల కోసం పై అధికారులకు వివరించడం జరిగిందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ డి రామారావు తెలిపారు.

# నిబంధనల మేరకు అత్యధిక పరిహారం అందిస్తాం

రైతులతో చర్చించిన అదనపు కలెక్టర్




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సీతారామ ఎత్తిపోతల పథకం సంబంధించి భూ సేకరణకు నిబంధనల మేరకు అత్యధిక పరిహారం అందిస్తామని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో సింగరేణి మండలం బాజు మల్లాయిగూడెం, రేలకాయలపల్లి గ్రామాల్లో సీతారామ ఎత్తిపోతల పథకం నిమిత్తం భూ సేకరణ పరిహారం రేటు నిర్ధారణకు సంబంధిత రైతులతో అదనపు కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సింగరేణి మండలం బాజు మల్లాయిగూడెం, రేలకాయపల్లి గ్రామాల్లో సీతారామ ఎత్తిపోతల పథకం 13వ ప్యాకేజీ నిర్మాణంలో భాగంగా భూ సేకరణ చేయాల్సి ఉండగా భూ సర్వే నిర్వహించి అవార్డులు ప్రకటించామన్నారు. ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించామన్నారు. బాజు మల్లాయిగూడెం గ్రామంలో ఎకరానికి రూ.2.70 లక్షలు ఉందని భూ సేకరణ చట్టం ప్రకారం రెండింతలు అనగా రూ.5.40 లక్షలు చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వం పెంచి రూ.10.80 లక్షలు చెల్లించాలని నిర్ణయించిందన్నారు. ఆర్బిట్రేషన్‌లో 12 శాతం వడ్డీ కింద రూ.64వేలు కలిపి మొత్తం రూ.11.44 లక్షలు ఎకరాకు చెల్లించనున్నట్లు తెలిపారు. రేలకాయపల్లి గ్రామంలో ఎకరానికి రూ.2.92 లక్షలు ఉందని భూ సేకరణ చట్టం ప్రకారం రెండింతలు అనగా రూ.5.85 లక్షలు చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వం పెంచి రూ.11.70 లక్షలు చెల్లించాలని నిర్ణయించిందన్నారు. ఆర్బిట్రేషన్‌లో 12 శాతం వడ్డీ క్రింద రూ.70,390లు కలిపి మొత్తం రూ. 12,40,390 ఎకరాకు చెల్లించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం చివరికి బాజు మల్లాయిగూడెం గ్రామ రైతులకు ఎకరానికి రూ.15 లక్షలు, రేలకాయపల్లి గ్రామ రైతులకు ఎకరానికి రూ.16లక్షలు భూమికి పరిహారం అందుతుందన్నారు. భూమిలో ఉన్న వ్యవసాయ పంపు సెట్ల, చెట్లు, ఇతర నిర్మాణాలకు విడిగా పరిహారం అందిస్తామన్నారు. ముసాయిదా నోటిఫికేషన్ జారీ చేసిన తేదీ ముందు నుంచి మూడేళ్ల వరకు లావాదేవీలు పరిశీలించి సరాసరి ధర నిర్ణయించడం జరిగిందన్నారు. భూముల్లో ఏమైనా పరికరాలకు, నిర్మాణాలకు పరిహారం మిస్సయితే దరఖాస్తు అందిస్తే మరోసారి పరిశీలించి పరిహారం అందేలా కృషి చేస్తామన్నారు. సమావేశంలో రైతులు మాట్లాడుతూ ఎకరానికి రూ.35లక్షల నుంచి రూ.40లక్షల చొప్పున పరిహారం ఇప్పించాలని, భూములను కోల్పోవడం వల్ల జీవనోపాధి కోల్పోతున్నామన్నారు. భూమిలో ఉన్న పైపులైన్, చెట్లు ఇతర పరికరాలు, డ్రిప్ సిస్టం వివరాలు సరిగ్గా నమోదు చేసి పరిహారం అందించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్డిసి ఎం. రాజేశ్వరి, ఏడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ శ్రీనివాసులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు బోధనా సామర్థ్యాలు పెంచుకోవాలి

గిరిజన సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు అశోక్




**ప్రజాపక్షం/భద్రాచలం :** గిరిజన సంక్షేమశాఖ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు పాఠ్యాంశాలకు చెందిన బోధనా సామర్థ్యాలను పెంచుకుని విద్యార్థులకు సరైన విద్యాబోధన చేయాలని గిరిజన సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు అశోక్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఉపాధ్యాయ కళాశాల్లో ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణలో భాగంగా మొదటిరోజు ఆయన ముఖ్యాతిథిగా పాల్గొని శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుత గిరిజన విద్యార్థుల అభివృద్ధి కోసం ఐదురోలు సామర్థ్యా నిర్మాణ శిక్షణ ఉపాధ్యాయులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ శిక్షణలో ఉపాధ్యాయులు సులభతరంగా పాఠ్యాంశాలు బోధించేందుకు దోహదపడతాయన్నారు. విద్యార్థులకు విద్యతోపాటు సామాజిక స్పృహ, సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయడానికి ఉపాధ్యాయులు ముందుండాలన్నారు. హెచ్‌ఎంలు పరిపాలన విభాగంలో మెలుకువలు, నాయకత్వ లక్షణాలు పెంపుదలకు, తరగతి గదిలో అభ్యాసన ప్రక్రియ ఎలా జరుగుతుందో పరిశీలించడానికి ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. హిందీ, ఇంగ్లీష్, తెలుగుభాషల్లో నిర్వహిస్తున్న ఈ శిక్షణలో మొత్తం 180 మంది ఉపాధ్యాయులు, 12 మంది డిఆర్‌పిలు పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఇడి కళాశాల ప్రిన్సిపల్ డా.వీరునాయక్, డిఎడ్ కాలేజీ ప్రిన్సిపాల్ భవాని, ఏసిఎంఓ రమేష్, ఎస్‌సిఆర్‌పిలు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాద ప్రాంతాన్ని పరిశీలించిన అడిషనల్ డిసిపి

**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** రఘునాథపాలెం మండలం ఈర్లపుడి వైకుంఠ ధామం వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాద ప్రాంతాన్ని అడిషనల్ డిసిపి, లా అండ్ ఆర్డర్ ప్రసాదరావు ఖమ్మం నగర ఎసిపి రమణ మూర్తితో సోమవారం సందర్శించారు. కొణిజర్ల మండలం ఉప్పలచెలకకు పత్తి తీసేందుకు కూలీ పనులకు వచ్చిన తిరుమలాయపాలెం చంద్రుతండా గ్రామానికి చెందిన ఎనిమిది మంది కూలీలు పనులు ముగించుకుని రెండు ఆటోలలో తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఈర్లపుడి వైకుంఠధామం వద్ద రోడ్డుపైకి గేదెలు అడ్డుగా రావడంతో ఆటోలు అదుపు తప్పి ప్రమాదానికి గురైపల్టీ కొట్టాయి. ఈ ప్రమాదంలో పలువురు కూలీలకు గాయాలు కాగా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలైన బోడా నాగమ్మ మృతిచెందింది. రోడ్డు ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని అడిషనల్ డిసిపి ప్రసాదరావు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐ ఉస్మాన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల వైఫల్యమా? రాజకీయ ఒత్తిళ్లా?

రామారావు హత్య కేసులో దోషులెవరు?

సంచలనం సృష్టించిన సుపారీ హత్య



**ప్రజాపక్షం/ఖమ్మం :** పోలీసుల వైఫల్యమో కానీ జిల్లాలో సంచలనం సృష్టించిన హత్య కేసు మిస్టరీ వీడ లేదు. 18 రోజులు గడిచినా నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకోకపోవడంతో పోలీస్ శాఖపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సిపిఎం నాయకులు సామినేని రామారావును అక్టోబర్ 31న గుర్తు తెలియని వ్యక్తులు ఆయన ఇంట్లోనే కత్తులతో పొడిచి హత్య చేశారు. హత్య జరిగిన నాటి నుండి ఇది సుఫారీ హత్యేనన్న వాదన వినపడుతుంది. హత్య చేసింది ఎవరు...? హత్య చేయించింది ఎవరనే దానిపై ఇంత వరకు స్పష్టత లేదు. పాతర్లపాడు సర్పంచ్‌గా, రైతు సంఘం ఉమ్మడి రాష్ట్ర కార్యదర్శిగా పని చేసి ఉండటంతో రామారావుది రాజకీయ హత్యేనని సిపిఎం వాదిస్తుంది. 73 ఏళ్ల వయస్సున్న రామారావుకు ఆర్థిక పంచాయతీలు కానీ, హత్య చేయడానికి రాజకీయాలు తప్ప ఇతరత్రా కారణాలు లేవని సిపిఎం చెబుతుంది. ముమ్మాటికి ఇది రాజకీయ హత్యే అంటుంది. పోలీసులు 18 రోజులుగా హత్య కేసు నిందితులను గుర్తించక పోవడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అందుబాటులోకి వచ్చిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితులను గుర్తించే అవకాశం ఉన్నప్పటికీ నిందితుల విషయంలో ఎందుకు జాప్యం జరుగుతుందో అర్థంకావడం లేదు. ఖమ్మం జిల్లాలో సుఫారీ ఇచ్చి ఒక రాజకీయ నాయకున్ని హత్య చేయించడం ఇదే మొదటిసారి. గతంలో మండలంలో కిరాయి హంతకులు కాంగ్రెస్ నాయకున్ని హతమార్చిన ఘటన రెండు దశాబ్దాల క్రితం జరిగింది. ఆ తర్వాత మళ్లీ సుఫారీతో జరిగిన రాజకీయ హత్య రామారావుదే. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేసినప్పటికీ ఫలితం రాక పోవడం వెనక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ముఖ్యంగా అధికార పార్టీ ఒత్తిడి కారణంగానే పోలీస్ దర్యాప్తు ముందుకు సాగడం లేదని విపక్షాలు ఆరోపిస్తున్నాయి.

ఇటీవల కాలంలో పోలీస్‌పై ఇంత పెద్ద ఎత్తున విమర్శలు రావడం ఇదే మొదటిసారి. పోలీస్ ఉన్నతాధికారులు ఇప్పటికీ ఇది రాజకీయ హత్య కాదన్న భావనలో ఉండగా సిపిఎం మాత్రం ముమ్మాటికి ఇది రాజకీయ హత్యేనని దర్యాప్తు పక్కదారి పడుతుందని ఆరోపిస్తుంది. ఫిర్యాదుదారు పేర్కొన్న వారిని కనీసం విచారణ చేయడం లేదని సిపిఎం ఆరోపిస్తుంది. ఇదిలా ఉండగా సిపిఎం దర్యాప్తులో జాప్యాన్ని నిరసిస్తూ హత్య కేసు నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన బాట పట్టింది. 19వ తేదీన కాంగ్రెస్ , బిజెపియేతర పక్షాలతో కలిసి రౌండ్ టేండ్ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఆ తర్వాత నేరుగా పోలీస్ కార్యాలయాలను ముట్ట డిస్తామని తెలిపింది. రామారావు హత్య కేసులో పోలీస్ దర్యాప్తులో జరుగుతున్న జాప్యానికి సంబంధించి అధికార పార్టీ నేతలు సైతం పెదవి విరుస్తున్నారు. ఈ హత్య ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రాతినిథ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గ పరిధిలో జరగడం ఇది రాజకీయ హత్యేనన్న ప్రచార నేపథ్యంలో పోలీస్ దర్యాప్తు మరింత ముమ్మరం చేసి హత్య కేసు నిందితులను తేల్చాలని లేకపోతే ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీకి నష్టమన్న భావనలో కాంగ్రెస్ నేతలు ఉన్నారని ఆ పార్టీకి చెందిన ముఖ్యుడు ఒకరు తెలిపారు.

ఏది ఏమైనా రామారావు హత్య కేసు వ్యవహారం ఓ కొలిక్కి రాకపోవడంతో అటు పోలీస్, ఇటు అధికార పార్టీ కూడా విమర్శలను ఎదుర్కొంటుంది.

## అర్హులైన గిరిజనులకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి

**ప్రజాపక్షం/భద్రాచలం :** అర్హులైన ప్రతీ ఒక్క గిరిజన కుటుంబానికి ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. సోమవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బారులో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన గిరిజనుల నుండి వినతులు స్వీకరించారు. వాటిని పరిశీలించిన ఆయన పరిష్కారం నిమిత్తం ఆయా శాఖల అధికారులకు పంపించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ పలు సమస్యలపై అందిన వినతులను పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ విడతలవారీగా అందుతాయని, ఇందులో ఎలాంటి భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ జనరల్ డేవిడ్ రాజ్, గురుకులం ఆర్‌సిఓ అరుణకుమారి, ఎడిఎంహెచ్ఓ సైదులు, ఇఇ మధుకర్, ఎఒ సున్నం రాంబాబు, ఎపిఒ వేణు తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## కొమురవెల్లి జాతర వాల్ పోస్టర్లు ఆవిష్కరణ



**ప్రజాపక్షం/జనగామ:** త్వరలో జరగబోయే కొమురవెల్లి మల్లన్న జాతర వాల్ పోస్టర్లను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిలు ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వయించారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు ఎండోమెంట్ ప్రిన్సిపాల్ సెక్రటరి శైలజా రామయ్యర్, సిద్దిపేట కలెక్టర్ హైమవతి, ఏవో, ఏఈఓలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాల్ పోస్టర్లు ఆవిష్కరించి జాతర ఏర్పాట్లు ఘనంగా జరిగేటట్లు చూడాలని అధికారులను మంత్రి సీతక్క ఆదేశించారు. కొమురవెల్లిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనుల్ని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ అధికారులు దృష్టికి తీసుకొచ్చారు.

## బోరు మోటార్ల ధ్వంసం

### రైతుకు 15 లక్షల వరకు నష్టం



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామానికి చెందిన జుర్రు సంపత్ అనే రైతుకు సంబంధించిన బావి వద్ద 15 లక్షల విలువ చేసే బోరు మోటారు పైపులు ఇతర వాటిని గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి ధ్వంసం చేసినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. తనపై కక్షపూరితంగా కొంతమంది వ్యక్తులు తనను ఆర్థికంగా నష్టపరచాలనే ఉద్దేశం కొద్ది రెండు బోర్లు పూర్తిస్థాయిగా కరాబ్ చేయడం జరిగిందని, దీనివల్ల పంటకు నీరు అందించలేక పోతున్నానని పంట నష్టపోతున్నానని కన్నీరు పెట్టుకున్నాడు.ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## ప్రజావాణి వినతుల పరిష్కారానికి వెంటనే చర్యలు: కలెక్టర్




**ప్రజాపక్షం/హనుమకొండ :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి స్వీకరించిన వినతుల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశపు హాలులో ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డిలకు వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు వినతులను అందజేశారు. ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ, గృహ నిర్మాణ, మున్సిపల్, తదితర సమస్యలపై ప్రజలు 139 వినతులను కలెక్టర్, అదనపు కలెక్టర్లకు అందజేశారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు వినతి పత్రాలను అందజేస్తూ తమ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ను కోరగా అక్కడే ఉన్న సంబంధిత శాఖల అధికారులను వినతుల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా పలు మండలాలకు సంబంధించిన వినతులపై పరిష్కార చర్యల నిమిత్తం తహసిల్దార్లను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, పలువురు తహసీల్దార్లు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లపై నిరంతర పర్యవేక్షణ



**ప్రజాపక్షం / జనగామ:** ధాన్యం కొనుగోళ్లపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని జనగామ జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ అన్నారు. సోమవారం గ్రీవెన్స్ సందర్భంగా అదనపు కలెక్టర్ రెవెన్యూ బెన్షాలోం తో కలిసి ప్రజల నుండి విజ్ఞప్తులకు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పింకేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే ధరఖాస్తులను ఎప్పటికి అప్పుడు పరిష్కరించాలన్నారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా జరిగేటట్లు సంబందిత శాఖల అధికారులు, మండల స్పెషల్ ఆఫీసర్లు పరిశీలిస్తూ నిత్యం పర్యవేక్షించాలన్నారు. కాగా గ్రీవెన్స్‌లో 39 ధరఖాస్తులు వచ్చాయి. జనగామ పట్టణంలోని స్వర్ణ కళామందిర్ పక్కన గల తన స్థలాన్ని కొందరు కూరగాయల వ్యాపారులు దౌర్జన్యంగా ఆక్రమించి కూరగాయల వ్యాపారం నిర్వహిస్తున్నారని ఖబ్జా చేసిన స్థలాన్ని ఖాళీ చేయించాలని శ్రీహరి అనే వ్యకి విజ్ఞప్తి చేశారు. రాజీవ్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్న మోతే సంధ్య ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ దప్యూటి కలెక్టర్ సుహాసిని, ఆర్‌డిఓ గోపిరాం, వెంకన్న, కలెక్టరేట్ ఏఓతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గ్రామప్రజలను సుఖసంతోశాలతో దుర్గాదేవి ఆశీర్వదించాలి: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/వేలేరు:** మడలంలోని సోడశపల్లి గ్రామంలో మూడురోజుల శ్రీదుర్గాదేవి మహోత్సవ వేడుకల మహోత్సవ వేడుకలలో బాగంగా సోమవారం సోడశపల్లి గ్రామానికి చెందిన మామిడాల మణెమ్మ బుచ్చిరెడ్డి,రాధిక మహెందర్‌రెడ్డిల ఆద్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅథిధిగా స్టేషన్‌ఘన్‌పూర్ ఎంఎల్‌ఏ కడియం శ్రీహరి హాజరై అమ్మవారికి టెంకాయ కొట్టి మొక్కులు సమర్పించి మాట్లాడారు శ్రీదుర్గాదేవి ఆలయ నిర్మాణాన్ని రాధిక మహెందర్‌రెడ్డిలు నిర్మాణం చేయడమే కాకుండా ఆలయానికి దూపదీప నైవేద్యపు ఖర్చులు కూడా భరించడం చాలా సంతోషించదగినదిగా భావించడం జరుగుతోందని ఈసోడశపల్లి గ్రామప్రజలను శ్రీదుర్గాదేవి అమ్మవారు పిల్లాపాపలు, చిన్నా పెద్దా అనేతేడాలేకుండా పాడిపంటలతో సుఖసంతోశాలతో జీవించేవిధంగా ఆశీర్వదించాలని కోరుకోవడం జరిగిందని తెలిపారు . ఈకార్యక్రమంలో మండల కాంగ్రేస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళలు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎంఎల్‌ఏ కడియం శ్రీహరి. వేలేరు మండలంలోని మల్లికుదుర్ల గ్రామంలో ఇటీవలే మృతిచెందిన కుటుంబాలను స్టేషన్‌ఘన్‌పూర్ ఎంఎల్‌ఏ కడియం శ్రీహరి సోమవారం సందర్శించి వారికుటుంబ సభ్యులను ఓదార్చి వారికుటంబాలకు అండగా ఉంటానని భరోస కల్పించారు. కార్యక్రమంలో వేలేరు మండలకాంగ్రేస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలను ఆరోగ్యంగా ఉంచడమే ప్రభుత్వ లక్ష్యం

### అంగన్‌వాడీ కేంద్రాలపై నమ్మకం కలిగేలా విధులు నిర్వహించాలి: మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/ములుగు:** రాష్ట్రంలోని పేదరికంలో ఉన్న పిల్లలను ఆరోగ్యంగా ఉంచడం కోసమే ప్రభుత్వం బలమైన ఆహారం అందించడానికి చర్యలు తీసుకుంటుందని, చిన్న పిల్లలు దేవుళ్ళతో సమానంగా అంగన్‌వాడీ టీచర్లు చూసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. సోమవారం ములుగు జిల్లా కేంద్రంలోని కృష్ణాకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో తెలంగాణ రాష్ట్రంలోనే తొలిసారిగా చేపట్టిన పైలట్ ప్రాజెక్టులో భాగంగా ప్రీ స్కూల్ చిన్నారులకు ప్రతి రోజు 100 మిలీ పాల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఐటిడిఏ పిఓ చిత్రమిశ్ర, అదనపు కలెక్టర్ మహేందర్‌జీలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలోని పోషకాహార లోపాన్ని అధిగమించి తెలంగాణ రాష్ట్రాన్ని పోషకాహార లోప రహిత తెలంగాణగా మార్చడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నదని, అంగన్‌వాడీ కేంద్రాల్లో 3 నుండి 6 సంవత్సరాల వయసు కలిగిన పిల్లలకు ప్రతి రోజు పాలను అందజేయడం జరుగుతుందని, ములుగు జిల్లాలో పేదరికంలో ఉన్న పిల్లల అధిక సంఖ్యలో ఉండడంతో ఈ నూతన కార్యక్రమాన్ని ఇక్కడి నుండే ప్రారంభించడం జరిగిందని వివరించారు. పిల్లలకు అందించే ప్రతి ఆహారాన్ని అంగన్‌వాడీ టీచర్లు ప్రతి రోజు పరిశీలించాలని, అనారోగ్యానికి గురి చేసే వస్తువులు వచ్చిన పక్షంలో వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్‌రెడ్డి అంగన్‌వాడీ సెంటర్లను బలోపేతం చేయడానికి ఇప్పటికే పలు నిర్ణయాలు తీసుకున్నారని, ప్రతి టీచర్‌కు చీరలు పంపిణీ చేయడంతో పాటు వేతనాలను పెంచడం జరిగిందని అన్నారు. సొంత పిల్లల్లాగానే అంగన్‌వాడీ పిల్లను చూసుకోవాలని, ప్రతి ఒక్కరూ తమ పిల్లల్ని సైతం అంగన్‌వాడీ సెంటర్‌లో చేర్పించాలని తెలిపారు. కార్పొరేట్ స్థాయి పాఠశాలకు ధీటుగా సెంటర్లను బలోపేతం చేస్తున్నామని, ప్రతి సెంటర్ నిర్వహాకులు పిల్లల తల్లిదండ్రులతో నిత్యం సమావేశాలు నిర్వహించాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు అనుకోకుండా మృతి చెందిన పక్షంలో వారి పిల్లలకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ప్రభుత్వం జీవో జారీ చేస్తుందని, సెంటర్లకు చెడ్డ పేరు రాకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తగా విలు నిర్వహించాలని అన్నారు. ప్రజా ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లకు ఇచ్చిన హామీలను ఖచ్చితంగా నెరవేర్చడానికి కృషి చేస్తానని, అంగన్‌వాడీ సెంటర్లపై నమ్మకం కలిగేలా విధులు నిర్వహించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమం విజయవంతానికి అంగన్‌వాడీ టీచర్లు క్రియాశీల పాత్ర వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పాల పంపిణీని ప్రారంభించి ప్రీ స్కూల్ చిన్నారులకు ఉచిత 100 మి.లీ లీటర్ల పాలను మంత్రి అందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, డిడబ్ల్యూఓ తుల రవి, సిడిపిఓ శిరీష, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, పాల్గొన్నారు.

## 36వ వార్డులో రోడ్డు ఆక్రమణ

### మున్సిపల్ అధికారులతో పరిశీలించిన సిపిఐ నేత అజయ్‌సారథిరెడ్డి



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** డ్రైనేజీ మరియు రోడ్ సౌకర్యం సంబంధిత సమస్యలను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి పరిశీలించిన మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారథి రెడ్డి మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 36వ వార్డు ఏ క్యాబిన్ వద్ద రోడ్డు ఆక్రమణ, డ్రైనేజీ రోడ్డు సౌకర్యం కల్పించాలని తదితర సమస్యలపై సోమవారం టౌన్ ప్లానింగ్ అధికారులు స్థానిక సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారథి రెడ్డి సమస్యను టౌన్ ప్లానింగ్ అధికారులకు వివరిస్తూ ఈ ప్రాంతంలో నిత్యం వేలాదిమంది ప్రజల రాకపోకలు ఈ ప్రాంతం నుంచే కొనసాగుతుంటాయని ఈ ప్రాంతంలో రోడ్డు మరియు డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని రోడ్డు ఆక్రమణ కాకుండా మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు రక్షించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి ప్రవీణ్ వార్డు ఆఫీసర్లు, భారత రమేష్, శ్యామ్, గాదం శ్యాం ప్రసాద్, యాదవ్, సింగం విష్ణు, తల్లు తదితరులు పాల్గొన్నారు.

## బస్సు జాతను విజయవంతం చేయండి

### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్

**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:** భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఖమ్మంలో జరిగే మహాసభను విజయవంతం చేయడం కొరకు కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 15న కొమరం భీం జిల్లా జూడోగట్ల వద్ద ప్రారంభమైన జాత మంగళవారం మధ్యాహ్నం ముల్కనూరుకు చేరుకొనుందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్ తెలిపారు. జాతాకు సిపిఐ సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ తక్కలపల్లి శ్రీనివాస్ రావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ కలవేణి శంకర్ నాయకత్వం వహిస్తున్నారని తెలిపారు. జాతా మంగళవారం రానుందని, అట్టి జాతాను విజయవంతం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ బీమదేవరపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం కరపత్రం ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఆదరి రమేష్, బోడ బాలరాజు, కిషోర్, కొండ చరణ్ పాల్గొన్నారు.

## ఉప ముఖ్యమంత్రిని కలిసిన కుర్టా కార్యవర్గం



**ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ :** కుర్టా కార్యవర్గం వరంగల్ ఈస్ట్ ఎమ్మెల్యే నాయని రాజేందర్ రెడ్డితో కలిసి సోమవారం ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కని కలిసి కాకతీయ విశ్వవిద్యాలయానికి పెండింగ్‌లో ఉన్న పెన్షన్ నిధులను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించింది.సమావేశంలో కుర్టా అధ్యక్షులు ప్రొఫెసర్ ఏ. సదానందం మాట్లాడుతూ ఇటీవలి ఆర్థికశాఖ ఆదేశాల ప్రకారం విశ్వవిద్యాలయాలు జీతాలు, పెన్షన్‌లకు వేర్వేరు బిల్లులు పంపాలని సూచించబడిందని,దీని ఫలితంగా జీతాల బిల్లులు క్లియర్ అవుతున్నప్పటికీ, పెన్షన్ బిల్లులు గత కొన్ని నెలలుగా పెండింగ్‌లోనే ఉన్నాయని,ఇది ఇప్పటికే పరిమిత వనరులతో నడుస్తున్న విశ్వవిద్యాలయంపై అదనపు భారం పెడుతోందన్నారు. ఆర్థిక మంత్రి సమస్యను శ్రద్ధగా విని, పరిస్థితి యొక్క తీవ్రతను పూర్తిగా అర్థం చేసుకుని, ప్రతినిధి బృందానికి "ఆందోళన అవసరం లేదు" అని హామీ ఇచ్చారు. ప్రభుత్వ అకౌంటింగ్ నిబంధనల ప్రకారం 'జీతం' బడ్జెట్‌లో పెన్షన్ కూడా అంతర్భాగమే అని అసోసియేషన్ ఇచ్చిన వివరణను మంత్రి అంగీకరించారు.కుర్టా మంత్రి అవగాహన, సానుకూల స్పందనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది. ఈ కీలకమైన సమావేశం జరిగేందుకు ప్రత్యేకంగా ముందడుగు వేసిన ఎమ్మెల్యే నాయని రాజేందర్ రెడ్డికి అసోసియేషన్ ధన్యవాదాలు తెలిపింది.ఈ సమావేశంలో ప్రొఫెసర్ ఎం. ఎర్రగట్టు స్వామి (ఉపాధ్యక్షుడు), ప్రొఫెసర్ వి. రవీందర్ (మహా కార్యదర్శి), ప్రొఫెసర్ జి. వీరన్న (ఖజాంచీ), ప్రొఫెసర్ కె. వెంకట నారాయణ (ఈసీ మెంబర్), ప్రొఫెసర్ ఈ. రామ రెడ్డి (ఈసీ మెంబర్) పాల్గొన్నారు.

## సిపిఐ వందేళ్ల పండుగ సందర్భంగా విరాళాల సేకరణ



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** భారత గడ్డపై సిపిఐ వందేళ్ల పండుగ సందర్భంగా డిసెంబర్ 26న 5 లక్షల మందితో ఖమ్మంలో జరిగే బహిరంగ సభ జయప్రదం చేయాలని, సిపిఐ ఆధ్వర్యంలో నవంబర్ 20న మానుకోట జిల్లా కేంద్రంలో జరిగే బస్సు జాత మరియు బహిరంగ సభ కార్యక్రమం జయప్రదం చేయాలని సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో సోమవారం కొత్త బజార్, పాత బజార్ ఏరియాలలో సామూహిక నిధి వసూలు కార్యక్రమం నిర్వహించడం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ మాట్లాడుతూ దేశంలో వందేళ్ల చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ అని గత వందేళ్ల నుండి ప్రజా సమస్యలపై పోరాడుతూ నాడు స్వాతంత్ర సంగ్రామం, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం అనేక కార్మిక విద్యార్థి యువ జన రైతాంగ పోరాటాలు చేస్తూ అనునిత్యం ప్రజల కోసం కొట్లాడే సిపిఐ 100 సంవత్సరాల శతాబ్ది సభ జయప్రదానికై ప్రజలు వ్యాపారస్తులు విరివిగా విరాళాలు అందించి తోడ్పాటు అందించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మానుకోట జిల్లా కేంద్రంలో నవంబర్ 20న జరిగే బస్సుజాత బహిరంగ సభలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు మాజీ ఎమ్మెల్యే చాడా వెంకట్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేని శంకర్, సిపిఐ జిల్లా కార్యదర్శి విజయసారథి సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారథి రెడ్డి బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారని, ఈ సభ విజయవంతం చేయాలని, భవిష్యత్తు పోరాటాలకు విరాళాలు అందించి సిపిఐ పొందేళ్ల శతాబ్ది వేడుకలను ప్రజలందరూ మద్దతు తెలిపారని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శులు రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, వీరవెల్లి రవి, జలగం ప్రవీణ్, మంద శంకర్, మంద శీను, ఎండి రఫీ, నక్క నాగార్జున, గార రవిచంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

## ఐనవోలు జాతరపై సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి జాతర 2026 కు భక్తులు లక్షలాదిగా తరలి వచ్చే ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి వారి జాతరకు సంబందించి సోమవారం హన్మకొండ ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నందు పలు శాఖల ఉన్నతాధికారులతో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు, టెస్కాబ్ ఛైర్మన్ మార్నేనీ రవీందర్ రావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గారు మాట్లాడుతూ భక్తులు లక్షలాదిగా తరలి వచ్చే ఐనవోలు మల్లిఖార్జున స్వామి వారి జాతరను జిల్లా ఉన్నతాధికారులు, ఎండోమెంట్ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టిగా పనిచేసి జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా సంతృప్తి కలిగేలా శాశ్వత ఏర్పాట్లు చేయాలని సూచించారు.ముఖ్యంగా మంచి నీరు వసతి, మరుగు దొడ్లు, పారిశ్యూద్యం, క్యూ లైన్ల క్రమబద్ధీకరించి అందులో వేచి ఉన్న భక్తులకు మంచి నీటి వసతి, మహిళా భక్తుల సౌకర్యార్థం జల్లు స్నానాలు, దుస్తులు మార్చుకొనే రూంలు, ఆరోగ్య శిభిరాలు ఏర్పాటు తదితర అంశాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. పోలీస్, విద్యుత్, హెల్త్, రెవెన్యూ, మండల పరిషత్, మున్సిపాలిటీ, మిషన్ భగీరథ, ఆర్.అండ్.బి, పిఆర్, ఆర్టీసీ, ఎక్సైజ్, ఫైర్, ఐబీ తదితర శాఖల అధికారులు ఎండోమెంట్ అధికారులతో సమన్వయం చేసుకొని జాతరను విజయవంతం చేసే దిశగా ప్రణాళికా తయారు చేసుకొని విజయవంతం చేయాలని సూచించారు. అలాగే సంక్రాంతి రోజు జరిగే పెద్ద రథం నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు, అవరోధాలు తలెత్తకుండా కంట్రోల్ చేయాలని. మహా శివరాత్రి రోజు పెద్ద పట్నం వేసినప్పుడు తొక్కిసలాటలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని. జాతరలో విక్రయించే పూజా సామగ్రి, కొబ్బరి కాయల ధరలు సాధారణ స్థాయిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సంవత్సరం మేడారం సమ్మక్క సారక్క జాతర సందర్భంగా జాతరకు ఎక్కువ అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నది కాబట్టి దానికి తగినట్టుగా జాతర వరకు అన్ని ఏర్పాట్లు చేయాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులకు పలు సూచనలు సలహాలు చేశారు.ఈ సమావేశంలో ఆలయ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, సుధాకర్, ధర్మకర్తలు పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 62 దరఖాస్తులు: కలెక్టర్ దివాకర



**ప్రజాపక్షం/ములుగు:** సమస్య పరిష్కరించాలని, ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పాల్గొని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు పరిష్కార న నిమిత్తం ఎండార్స్‌మెంట్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో 62 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. భూ సమస్యలు 17, గృహ నిర్మాణ శాఖకు 12, పెన్షన్ 05, ఉపాధి కల్పనకు 01, ఇతర శాఖలకు సంబంధించినవి 27 దరఖాస్తులు వచ్చాయి. సమస్యలను విని వెంటనే పరిష్కారం చూపించడం లక్ష్యంగా ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణికి వచ్చిన 62 మంది దరఖాస్తుదారులతో కలెక్టర్ మీ సమస్య చెప్పండని అడిగి తెలుసుకొని దరఖాస్తు పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు ఎండార్స్‌మెంట్ చేస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తులను సమయానికి పరిష్కరించడం అన్ని శాఖల బాధ్యత అని ఆయన తెలిపారు. ప్రతి ఫిర్యాదును జాగ్రత్తగా నమోదు చేసి పరిష్కారం వరకు అధికారులు పర్యవేక్షించాలని, అవసరమైతే ఫీల్డ్ పరిశీలనలు కూడా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్‌రావు, ఆర్‌డిఓ వెంకటేష్, డిఆర్‌డిఓ శ్రీనివాస్‌రావు, అన్ని శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ఎంపిఓలు, తదితరులు పాల్గొన్నారు.

## పొగమంచు కారణంగా రాత్రి, తెల్లవారుజామున ప్రయాణాలు వద్దు

### పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్




**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** వాతావరణంలో పొగమంచు తీవ్రత పెరగటంతో వీలైనంత వాహనదారులు రాత్రి, తెల్లవారుజామున ప్రయాణాలు చేయద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు.వాతావరణంలో పొగమంచు తీవ్రత పెరగడం కారణంగా జరిగిన రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో ప్రజలను వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రకటన చేస్తూ. రాత్రి, తెల్లవారుజామున దట్టమైన పొగమంచు కారణంగా రహదారులపై ఎదురుగా వచ్చే వాహనాలు, పాదాచారులను గుర్తించడం, వీక్షించే సామర్థ్యం తక్కువగా వుంటుంది. ఈ సమయంలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీసే అవకాశాలు ఉన్నందున, ప్రజలు అత్యవసరమైతే తప్ప ఈ సమయాల్లో ప్రయాణాలను మానుకోగలరని వరంగల్ సీపీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.అలాగే పొగమంచు ఎక్కువగా ఉండే సమయంలో వాహనాలు నడుపుతున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సీపీ సూచిస్తూ. వాహనాలను వేగంగా నడపొద్దని, వాహనదారులు శ్రద్ధతో, నిదానంగా ప్రయాణించాలి. తక్కువ వీక్షించే సామర్థ్యం కారణంగా ఇతర వాహనాలు, పాదచారులు, మలుపులు, రోడ్డు విభాగాలు సరిగా కనిపించక ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున, హెడ్‌లైట్లను లో బీమ్‌లో ఉంచి, ఫాగ్ లైట్లను వాడాలని సూచించారు.అత్యవసర సమయాల్లో ప్రయాణం తప్పనిసరి అయితే వాహనాల స్థితిని ముందుగానే తనిఖీ చేసుకోవంతో పాటు ముఖ్యంగా బ్రేకులు, లైట్లు, టైర్లు సరిగా ఉన్నాయో లేదో సరి చూసుకోవాలని. డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం, ఆకస్మికంగా ఓవర్‌టేక్ చేయడం, ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించడం వంటి ప్రమాదకరమైన చర్యలకు పాల్పడవద్దని. పోలీసుల సూచనలతో పాటు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ వాహనదారులు వారి గమ్యస్థానాలకు క్షేమంగా చేరుకోవడమే వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రధాన లక్ష్యమని సీపీ వెల్లడించారు.

## గడ్డి మందు తాగి యువకుడు మృతి



**ప్రజాపక్షం/తరిగొప్పుల :** మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన పల్లె సంజయ్ (19) అనే యువకుడు ప్రేమ విఫలం కావడంతో ఆదివారం సాయంత్రం గడ్డి మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడగా గ్రహించిన కుటుంబ సభ్యులు బాధితుడిని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతున్న యువకుడు సంజయ్ సోమవారం మధ్యాహ్నం మృతి చెందడం జరిగింది.

# రీల్

## 'ఆపరేషన్ పద్మ' ట్రైలర్ విడుదల



నరేష్ మేడి, రాగ్, రజిత శాండీ, రణధీర్ బీసు, రాఘవ మండలపు, పెద్ది రాజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'ఆపరేషన్ పద్మ'. ఈ చిత్రాన్ని క్రిషవ్ సినిమాస్, కేవీఎం ఆర్ట్స్ ఎల్ఎల్పీ బ్యానర్స్‌పై ఘట్టమనేని అరవింద్ బాబు, రాఘవ మండలపు, రాంబాబు మండలపు నిర్మిస్తున్నారు. కార్తీక్ మండలపు కో ప్రొడ్యూసర్‌గా, కెటి మల్లికార్జున క్రియేటివ్ హెడ్‌గా వ్యవహరిస్తున్నారు. కార్తికేయ.వి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. 'ఆపరేషన్ పద్మ' సినిమా ట్రైలర్ లాంఛ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాటల రచయిత ప్రేమ్ రాజ్ ఎనుముల మాట్లాడుతూ మూడు సినిమాలకు నేను డైలాగ్స్ రాశాను. మంచి కంటెంట్‌తో వస్తున్న ఈ చిత్రాన్ని మీరంతా ఆదరిస్తారని కోరుకుంటున్నా అన్నారు. నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ ముత్యాల రాందాస్ మాట్లాడుతూ మనం ఎన్ని మాట్లాడుకున్నా చిన్న సినిమా అనాథే అని చెప్పారు. నిర్మాత, నటుడు డీఎస్ రావు మాట్లాడుతూ.. 'ఆపరేషన్ పద్మ' ట్రైలర్ బాగుంది. మంచి డైలాగ్స్ ఉన్నాయి. డైరెక్టర్ కార్తికేయ కొత్త నటీనటులను ఎంచుకుని వాళ్లతో ఇంట్రెస్టింగ్ మూవీస్ చేస్తుంటాడు. ఈ సినిమా కూడా ఈ టీమ్ అందరికీ సక్సెస్ ఇవ్వాలి అన్నారు. ఈ కార్యక్రమంలో నటుడు రణధీర్ బీసు, నటుడు నరేష్ మేడి, హీరోయిన్ రజిత శాండీ, ప్రొడ్యూసర్ రాఘవ మండలపు, డైరెక్టర్ కార్తికేయ.వి. పాల్గొన్నారు.

## 'పాంచ్ మినార్' ట్రైలర్ లాంచ్



రాజ్ తరుణ్ హీరోగా రామ్ కడుముల దర్శకత్వంలో రూపొందిన క్రైమ్ కామెడీ ఎంటర్ టైనర్ 'పాంచ్ మినార్'. రాశి సింగ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. గోవింద రాజు ప్రజెంట్ చేస్తున్న ఈ చిత్రాన్ని కనెక్ట్ మూవీస్ ఎల్ఎల్పి బ్యానర్‌పై మాధవి, ఎంఎస్ఎం రెడ్డి నిర్మిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన సాంగ్స్, టీజర్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. నవంబర్ 21న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా ట్రైలర్ రిలీజ్ చేశారు. డైరెక్టర్ సాయి రాజేష్ ట్రైలర్‌ని గ్రాండ్‌గా లాంచ్ చేశారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో రాజ్ తరుణ్ మాట్లాడుతూ ఇప్పుడు మా ట్రైలర్ రిలీజ్ చేశాం. కొంచెం ఓపెన్ మైండ్‌తో చూడమని కోరుకుంటున్నాను. చాలా మంచి ఎంటర్టైన్మెంట్ ఇది. అందరూ థియేటర్స్‌కి వచ్చి ఎంజాయ్ చేసి వెళ్లే సినిమా. మా ప్రొడ్యూసర్ మాధవి చాలా పాషన్‌తో తీశారు. గోవింద్ ఈ సినిమాని తన భుజాల మీద వేసుకుని నడిపించారు. మా సినిమా 21న థియేటర్లలో రిలీజ్ అవుతుంది. 19, 20 తేదీల్లో కూడా మళ్లీ ప్రీమియర్స్ వేయాలని నిర్మాతలు భావిస్తున్నారు.

## జయకృష్ణ సరసన రషా తడాని



సూపర్ స్టార్ కృష్ణ మనవడు, దివంగత రమేష్ బాబు కుమారుడు, సూపర్ స్టార్ మహేష్ బాబు అన్న కొడుకు, జయ కృష్ణ ఘట్టమనేని హీరోగా లాంచ్ అవుతున్నారు. ఆర్ఎక్స్ 100, మంగళవారం వంటి బ్లాక్ బస్టర్ చిత్రాల విజనరీ ఫిల్మ్ మేకర్ అజయ్ భూపతి దర్శకత్వంలో జయ కృష్ణ వెండితెర అరంగేట్రం చేయబోతున్నారు. ఈ సినిమాను వైజయంతి మూవీస్ అశ్విని దత్ సమర్పిస్తున్నారు. చందమామ కథలు బ్యానర్‌పై పి.కిరణ్ నిర్మిస్తున్నారు. అద్భుతమైన కొండల మధ్య సాగే సినిమా మనసుకు హత్తుకునే ప్రేమకథ ప్రధానంగా ఉంటుందని మేకర్స్ తెలిపారు. తాజాగా మరో ప్రకటన వచ్చింది. జయ కృష్ణ ఘట్టమనేని సరసన హీరోయిన్‌గా బాలీవుడ్ హీరోయిన్ రషా తడానిని నటించనున్నట్లు నిర్మాతలు తెలిపారు. హీరోయిన్ రవీనా టండన్, ప్రముఖ నార్త్ ఇండియన్ డిస్ట్రిబ్యూటర్, ఏఏ ఫిలింస్ ఇండియా యజమాని అనిల్ తడాని కుమార్తె. రషా అజాద్ సినిమాతో సినీ రంగ ప్రవేశం చేసి, ఉయ్ అమ్మా పాటతో ఇంటర్నెట్‌ను షేక్ చేసింది. ఇప్పుడు జయ కృష్ణ సరసన తెలుగు సినిమా పరిశ్రమలో అడుగుపెడుతోంది. ఈ చిత్రంలో మహిళా పాత్రలకు బలమైన క్యారెక్టరైజేషన్ రాసే దర్శకుడు అజయ్ భూపతి, రషా కోసం ఇంటెన్స్ క్యారెక్టర్‌ని డిజైన్ చేశారు. ఈ నెల లోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. టైటిల్‌తో పాటు మరిన్ని వివరాలు



## 18న 'జాజికాయ' పాట



నందమూరి బాలకృష్ణ, బ్లాక్ బస్టర్ దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న సినిమా 'అఖండ 2: తాండవం'. రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. ఎం.తేజస్విని నందమూరి చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ఫస్ట్ సింగిల్ తాండవం అద్భుతమైన రెస్పాన్స్‌తో భారీ అంచనాలు సృష్టించాయి. అఖండ 2 సెకండ్ సింగిల్ 'జాజికాయ' నవంబర్ 18న గ్రాండ్‌గా లాంచ్ చేయనున్నారు. ఈ సాంగ్ అదిరిపోయే డ్యాన్స్ నెంబర్‌గా ఉండబోతోంది. తమన్ థియేటర్స్ దద్దరిల్లే పాటని కంపోజ్ చేశారు. గ్రాండ్ సెట్‌లో షూట్ చేసిన ఈ సాంగ్‌లో బాలకృష్ణ మాస్ డ్యాన్స్ మూమెంట్స్ ఫ్యాన్స్‌ని అద్భుతంగా అలరించనున్నాయి. సాంగ్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో బాలయ్య ఎనర్జిటిక్ డ్యాన్స్ మూమెంట్ అందరినీ ఆకట్టుకుంది. వైజాగ్ జగదాంబ థియేటర్‌లో గ్రాండ్‌గా జరగనున్న సాంగ్ లాంచ్ ఈవెంట్‌కి బాలకృష్ణ తో పాటు చిత్ర యూనిట్ హాజరుకానున్నారు. ఈ చిత్రంలో ఆది పినిశెట్టి ఓ పవర్ ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. హర్షాలి మల్హోత్రా కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి సి.రాంప్రసాద్, సంతోష్ సినిమాటోగ్రఫీని నిర్వహిస్తుండగా, తమ్మిరాజు ఎడిటర్. ఎఎస్ ప్రకాష్ ఆర్ట్ డైరెక్టర్. డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

## 'మఫ్టీ పోలీస్' 21న విడుదల



యాక్షన్ కింగ్ అర్జున్ సర్జ, ఐశ్వర్య రాజేష్‌ల పోలీస్ ఇన్వెస్టిగేటివ్ పర్సనల్ డ్రామా 'తీయవర్ కులై నడుంగ' తెలుగులో 'మఫ్టీ పోలీస్'గా ఈనెల 21న ప్రేక్షకుల ముందుకు రానుంది. దినేష్ లక్ష్మణన్ దర్శకత్వంలో జియస్టార్ ఆర్ట్స్ బ్యానర్‌పై జి.అరుల్ కుమార్ నిర్మించిన ఈ తమిళ చిత్రాన్ని.. తెలుగులో 'మఫ్టీ పోలీస్' పేరుతో ప్రముఖ నిర్మాత ఎ.ఎన్.బాలాజీ, శ్రీలక్ష్మి జ్యోతి క్రియేషన్స్ ద్వారా విడుదల చేస్తున్నారు. ఒక రచయిత హత్య నేపథ్యంలో పోలీస్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా ఈ చిత్రంలో పర్సనల్ డ్రామాకు పెద్ద పీట వేయడం విశేషం. అలాగే ఇటీవలకాలంలో పిల్లల పాలిట భూతంలా మారిన ఆటిజం వ్యాధి గురించి కూడా ఇందులో చర్చించి ఉండడం గమనార్హం. ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్న శ్రీలక్ష్మి జ్యోతి క్రియేషన్స్ అధినేత ఎ.ఎన్.బాలాజీ మాట్లాడుతూ... యాక్షన్ కింగ్ అర్జున్, ఐశ్వర్య రాజేష్ అలియాస్ భాగ్యంలకు తెలుగునాట ఉన్న క్రేజ్‌ని దృష్టిలో పెట్టుకుని అత్యధిక థియేటర్లలో 'మఫ్టీ పోలీస్' చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. ఈ సినిమాలో యాక్షన్‌తోపాటు పర్సనల్ డ్రామా కూడా చాలా ఆసక్తికరంగా ఉంటుంది. తమిళంతోపాటు తెలుగులోనూ అసాధారణ విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందించే అద్భుత అవకాశాన్ని నాకు అందించిన జి.అరుల్ కుమార్ గారికి, ఈ చిత్రాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దిన దర్శకుడు దినేష్ లక్ష్మణన్ లకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు' అన్నారు.రామ్ కుమార్ గణేశన్, అభిరామి వెంకటాచలం, ప్రవీణ్ రాజా తదితరులు నటించారు.

## 'మై డియర్ సిస్టర్' ఫస్ట్ లుక్

అరుళ్ నిధిమమత మోహన్దాస్ ప్రధాన పాత్రల్లో 'మై డియర్ సిస్టర్' చిత్రాన్ని అద్భుతమైన విజువల్ ప్రోమోతో ప్రకటించారు. ఈ అన్‌స్క్రిప్టెడ్ టగ్ ఆఫ్ వార్ వీడియో ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్యాషన్ స్టూడియోస్ ఎప్పటిలానే విభిన్న జానర్స్‌లో కుటుంబం మొత్తం చూడగలిగే నాణ్యమైన సినిమాలను అందిస్తూ తమ ప్రత్యేకతను మరొకసారి చాటుకుంది. అన్నాచెల్లెళ్ళ బంధం ఎన్నాళ్లుగానో ముఖ్యమైన భావోద్వేగ అంశం. పాసా మలర్ నుంచి వేదాళం వరకూ అన్నాచెల్లెల్ల అనుబంధం తరతరాలుగా ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తూనే ఉంది. ఇటీవల బైసన్‌తో సంగీత ప్రపంచంలో మంచి విజయాన్ని సొంతం చేసుకున్న నివాస్ ప్రసన్న ఈ చిత్రానికి సంగీత దర్శకుడు. 'మై డియర్ సిస్టర్'లో మొత్తం ఏడు పాటలు ఉన్నాయి. ప్రస్తుతం చిత్రానికి సంబంధించిన పోస్ట్‌ప్రొడక్షన్ పనులు చివరి దశలో ఉన్నాయి. అరుళ్ నిధి, మమతా మోహన్దాస్, అరుణ్‌పాండియన్, మీనాక్షి గోవిందరాజన్ నటిస్తున్నారు.



## పిల్లలను అలరించే యానిమేషన్ కికీ అండ్ కోకో



ఇటీవల అనిమేషన్ చిత్రాలు ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం ఆపాదిస్తున్నాయి. ప్రత్యేకంగా బాలల చిత్రాలు నిర్మించడానికి ఎవరు ముందుకు రావడంలేదు. ఈ నేపథ్యంలో బాలల హృదయాన్ని హత్తుకునే ఓ ఇండియన్ అనిమేషన్ సినిమా కికీ అండ్ కోకో త్వరలో విడుదల కాబోతుంది. ప్రపంచవ్యాప్తంగా ఎల్లలు దాటి, పలు భాషల్లో ఈ చిత్రం విడుదల కాబోతుంది. పూర్తిగా భారత సినీ ఇండస్ట్రీ నుండి ఇక్కడి సాంకేతిక నిపుణులతో విభిన్న తరహాలో తొలి సారిగా పి.నారాయణన్ దర్శకత్వంలో రూపొందించిన అనిమేషన్ చిత్రం కికీ అండ్ కోకో. ఈ సందర్భంగా దర్శకుడు పి.నారాయణన్ మాట్లాడుతూ ఇది పిల్లలకే పరిమితం కాదు పెద్దల్లోనూ చిన్నప్పటి మధురానుభూతులు గుర్తు చేస్తుంది. నేటి బాలలను నిజంగా ప్రభావితం చేసే విద్యా కథలు చాలా అవసరం. కికీ అండ్ కోకో అనేది స్నేహం, ప్రేమ, ఒక పిల్లవాడు తన పెంపుడు జంతువు మధ్యన్న మాంత్రిక బంధం గురించి అందరి హృదయాలను హత్తుకునే కథ అన్నారు. ఇనికా ప్రొడక్షన్స్ క్రియేటివ్ ప్రొడ్యూసర్ జి.యం.కార్తికేయన్ మాట్లాడుతూ.. కికీ అండ్ కోకో ఒక సినిమా మాత్రమే కాదు. ఇది స్నేహం, ప్రేమ, కథల ద్వారా పిల్లలు నేర్చుకునే విలువైన పాఠాల వేదిక. ఈ మాంత్రిక ప్రయాణాన్ని అందరూ తమ హృదయాలతో స్వాగతించాలని ఆహ్వానం పలుకుతున్నాము. కికీ అండ్ కోకో చిత్ర థియేటర్లలో మాత్రమే చూసి ఆనందించాలని తెలిపారు. కికీ అనే కుక్క పాత్ర, కోకో అనే చిన్నారి పాత్ర కనిపిస్తాయి.



## కొమురవెల్లి జాతరను ఘనంగా నిర్వహించాలి

### అధికారులకు మంత్రి కొండా సురేఖ దిశానిర్దేశం

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట జిల్లా చేర్యాలలోని శ్రీ కొమురవెల్లి మల్లన్న కల్యాణం, జాతరలను తెలంగాణ ఆధ్యాత్మిక సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా వైభవోపేతంగా నిర్వహించాలని దేవాదాయ ధర్మాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. వేలాదిగా జాతరకు తరలి వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకుని ఏ చిన్న పొరపాటు తలెత్తకుండా పటిష్టమైన కార్యాచరణతో ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. సోమవారం డా.బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్ లోని దేవాదాయ ధర్మాదాయ మంత్రిత్వశాఖ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో మంత్రి సురేఖ సిద్దిపేట జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశం కంటే ముందు మల్లన్న జాతర, కళ్యాణం పోస్టరును మంత్రి సురేఖ రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనగాం ఎంఎల్‌ఎ పల్లా రాజేశ్వర్ రెడ్డి, దేవాదాయ శాఖ ప్రిన్స్ పల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, కమిషనర్ హరీష్, సిద్దిపేట కలెక్టర్ హైమావతితో పాటు తదితర శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. సమీక్ష సమావేశంలో దేవాదాయ శాఖ మంత్రి సురేఖ మాట్లాడుతూ.., గత సంవత్సరం కంటే మరింత వైభవోపేతంగా మల్లికార్జున స్వామివారి కల్యాణం, జాతరను నిర్వహించనున్నట్లు తెలిపారు. గత సంవత్సరం జాతర, కల్యాణం నిర్వహించిన సమయంలో తలెత్తిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఈ సారి అవి రాకుండా చూడాలని సూచించారు. డిసెంబర్ 14 ఉదయం 10.45 గంటలకు శ్రీమల్లికార్జునస్వామి వారి కల్యాణాన్ని, జనవరి 18 నుండి 10 వారాలపాటు మార్చి 16 వరకు జాతరను నిర్వహించేందుకు నిర్ణయించినట్లు మంత్రి సురేఖ ప్రకటించారు. ఈ దిశగా భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేయాలని పోలీస్, విద్యుత్, వైద్యారోగ్యం, ఆర్టీసి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, ఆర్ అండ్ బి తదితర శాఖల అధికారులను మంత్రి సురేఖ ఆదేశించారు. కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, అమ్మవార్లు బలిజ మేడలమ్మ, గొల్ల కేతమ్మలకు కిరీటాల తయారీ పనుల పై మంత్రి సురేఖ వివరాలు పూర్తిగా తెలుసుకున్నారు. రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు కల్యాణోత్సవానికి, జాతరకు పెద్ద సంఖ్యలో తరలివచ్చే పరిస్థితులున్నందున ఈ దిశగా చర్యలు చేపట్టాలని సిద్దపేట డిపో మేనేజర్ కు మంత్రి సురేఖ సూచించారు. భక్తుల క్యూలైన్లు, బారికేడ్లు, ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు, సిసి కెమరాల నిఘా, వివిఐపిలకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు, భక్తులకు దారులను తెలిపేలా సైన్ బోర్డులు, తాగునీటి సదుపాయం, మెడికల్ క్యాంపు, లాక్టేషన్ గదులు తదితర ఏర్పాట్లు చేయాలని మంత్రి సంబంధిత అధికారులకు సూచించారు. జాతర సమయానికి వేసవి కాలం రానుండటంతో భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు, నడిచే మార్గాల్లో మ్యాట్లు, వృద్ధులు, వికలాంగులు, గర్భిణులకు బ్యాటరీ వాహనాలు తదితర ఏర్పాట్లు చేయాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను సంపూర్ణంగా నిషేధించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మల్లికార్జున స్వామివారి కల్యాణం, జాతరను విస్తృతంగా జనంలోకి వెళ్ళేలా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. భక్తులకు సాయపడేలా అవసరమైన చోట వాలంటీర్లు, ఆశా కార్యకర్తల సేవలను వినియోగించుకునేలా కార్యాచరణను రూపొందించాలని సూచించారు.

## 50 % కోటా దాటొద్దు (మొదటి పేజీ తరువాయి)

నిర్వహించడానికి మేము అనుమతిస్తున్నాం' అని మహారాష్ట్ర సర్కార్‌కు సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. కాగా, కొన్ని సందర్భాల్లో మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో 70 శాతానికి మించి రిజర్వేషన్లు ఇచ్చారని పేర్కొంటూ దాఖలైన పిటిషన్లపై కూడా సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. అయితే స్థానిక సంస్థల ఎన్నికలకు నామినేషన్ దాఖలు సోమవారంతో ముగిసిందని, సుప్రీంకోర్టు మే 6వ తేదీన ఇచ్చిన ఉత్తర్వును పరిగణనలోకి తీసుకునే ఈ ఎన్నికలు నిర్వహించడానికి మహారాష్ట్ర సర్కార్ సిద్ధమైందని తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు తెలిపారు. దీనిపై స్పందించిన జస్టిస్ బాగ్చి కీలక వ్యాఖ్యలు చేశారు. 'మాకు పరిస్థితిపై పూర్తి అవగాహన ఉంది. బంథియా కమిటీ నివేదికకు ముందు ఉన్న పరిస్థితిలు కొనసాగవచ్చని మేము సూచన చేశాం. అయితే దీని అర్థం 27 శాతం రిజర్వేషన్లు అన్ని వర్గాలకు వర్తింపజేయాలనా? ఒక వేళ అదే జరిగితే, మేము ఇప్పుడు ఇచ్చిన ఆదేశాలు, గతంలో ఇదే కోర్టు ఇచ్చిన ఉత్తర్వులకు విరుద్ధం అవుతుంది' అని పేర్కొన్నారు.

## అనేక విజయాలు

(మొదటి పేజీ తరువాయి)







చేరుకుంది. తిమ్మాజిపేట, బిజినేపల్లి, తెలకపల్లి మండల కేంద్రాలతోపాటు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో బహిరంగసభను నిర్వహించారు. సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మాలు నాయకత్వం వహించగా, నాగర్‌కర్నూల్ జిల్లా సిపిఐ కార్యదర్శి ఎస్‌ఎండి ఫయాజ్ అధ్యక్షత వహించారు. పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ మతతత్వ పెట్టుబడి బిజెపిని తరిమి కొట్టేందుకు వామపక్షాలను బలోపేతం చేయాలని, ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే కమ్యూనిస్టు జెండాను ప్రతి ఒక్కరూ చేపట్టాలన్నారు. మావోయిస్టులు సైతం కమ్యూనిస్టులతో కలిసి రావాలని తద్వార కేంద్రంలోని ప్రజా వ్యతిరేక బిజెపికి అడ్డుకట్టవేయవచ్చునని అన్నారు. ఖమ్మంలో నిర్వహించే బహిరంగసభ దేశానికే ఒక మైలురాయిగా నిలుస్తుందని, దేశంలో, రాష్ట్రంలో సామాన్యప్రజలకు సంక్షేమ పథకాలు అందడానికి సిపిఐ పోరాటపటిమనేని వారు గుర్తుచేశారు. నేడు కేంద్రంలో అధికారంలోఉన్న బిజెపి ప్రభుత్వం బడాపెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులతో చేతులుకలిపి ప్రజల భవిష్యత్తును అంధకారం చేస్తుంటే బిజెపికి వ్యతిరేకంగా వామపక్ష ప్రజాతంత్ర శక్తులను ఏకంచేసి పోరాటాలు నిర్వహిస్తున్నదన్నారు. సిపిఐరాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మా మాట్లాడుతూ నేటితరానికి వాస్తవాలను వివరించడానికి ఖమ్మంలో బహిరంగసభను నిర్వహించడం జరుగుతుందని, రాష్ట్రంలో మూడు జిల్లా కేంద్రాల నుండి మూడు బస్సు ప్రచారజాతాలు బయలుదేరాయన్నారు. సిపిఐ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలివచ్చి ఖమ్మం బహిరంగసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ జాత కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి బాలకిషన్, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసులు, కంట్రోల్ కమిషన్‌సభ్యులు ఆనంద్‌జి, సిపిఐ రాష్ట్రసమితి సభ్యులు కేశవులుగౌడ్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వెంకటమ్మ, సిపిఐ నాయకులు హుస్సేనయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు టి.నర్సింహ్మా, పెబ్బేటి ఏవిజయుడు, జిల్లాసమితి సభ్యులు, వివిధ మండలాల కార్యదర్శులు, వివిధ గ్రామాల ప్రజలుఅధికసంఖ్యలో పాల్గొన్నారు.

### దేశ విముక్తికి రాజీలేని పోరాటాలు

అనంతరం నల్లగొండ జిల్లా డిండి మండలానికి చేరుకుంది. పార్టీ శ్రేణులు జాతాకు పెద్ద ఎత్తున స్వాగతం పలికి, జాతాకు నాయకత్వం వహిస్తున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాల నర్సింహా, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యంలను శాలువా, పూలమాలలతో సన్మానించారు. అనంతరం ర్యాలీగా రాజీవ్ గాంధీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభకు తరలివెళ్లింది. సభల పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ భారత దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని మొట్టమొదటగా గర్జించిన పార్టీ సిపిఐ అని అన్నారు. బ్రిటిషీయుల నుండి దేశ విముక్తికి రాజీలేని పోరాటాలు చేస్తున్నందుకే ఆనాడా పార్టీపై నిషేదం విధించారని అన్నారు. ఎన్ని నిర్బంధాలు చేసిన జైలలో పెట్టిన అలుపెరుగకుండా కార్మిక విద్యార్థి, యువజన, రైతు, మహిళా ప్రజాసంఘాల నిర్మించి వెట్టిచాకిరి విముక్తి కోసం కార్మికులు, కర్షకులను దోపిడీ నుండి విముక్తి చేయడానికి రాజీలేని పోరాటాలు సిపిఐ నిర్వహించిందని ఆయన అన్నారు. నాగార్జునసాగర్, శ్రీరామ్ సాగర్, సీతారామ ప్రాజెక్ట్ లాంటి అనేక ప్రాజెక్టుల సాధనలో అలుపెరుగని పోరాటం సిపిఐ చేసిందని, తెలంగాణకు తలమానికమైన సింగరేణి సంస్థకు పరిరక్షించేందుకు కార్మికుల సమస్యలపైన అలుపెరుగని పోరాటాలు నిర్వహించింది సిపిఐ అని అన్నారు. సహజ వనరులను కాపాడేందుకు బయ్యారం ప్రాంతంలో లక్షల కోట్ల విలువైన ఖనిజ సంపద ఐరన్ ఓర్‌ను కాపాడడంలో శాసన సభలో వెలుపల వీరోచిత పాత్ర సిపిఐ నిర్వహించిందని ఆయన అన్నారు.

### బాల నర్సింహా, నెల్లికంటి సత్యం మాట్లాడుతూ...

2014లో ప్రతి కుటుంబానికి 15లక్షలు ఇస్తామని రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని ధరలు తగ్గిస్తామని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రజాకర్షక నినాధాలతో అధికారంలోకి వచ్చిన బిజెపి అవేమీ అమలు చేయలేదని, దేశంలో ప్రజల మధ్య మత విద్వేశాలు, భావోద్వేగాలు రెచ్చగొడుతూ వరుసగా అధికారం నిలబెట్టుకుంటుందని అన్నారు. రైతులు కార్మికులను పెట్టుబడిదారులకు కట్టు బానిసలుగా మార్చే చట్టాలు బిజెపి తెచ్చిందని వీటి రద్దు కొరకు సిపిఐ నిరంతరం పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. దేశంలో కమ్యూనిస్టులు ఐక్యత వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యత కోసం సిపిఐ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్యానాయక్, జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, మాజీ ఎంపిపి వెంకటరమణ, మండల కార్యదర్శి కనకాచారి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దీన్, సహాయ కార్యదర్శి విజేందర్‌రెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు, జిల్లా సమితి సభ్యులు, ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 4 వారాలు గడువు

(మొదటి పేజీ తరువాయి)

బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై అనర్హతపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్‌ను ఆదేశించింది. భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ ధర్మాసనం తన మునుపటి ఆదేశాలను పాటించకపోవడాన్ని 'అత్యంత దారుణమైన ధిక్కారం'గా అభివర్ణించింది. అయితే తదుపరి ఉత్తర్వులు వచ్చేంతవరకూ తెలంగాణ శాసనసభ స్పీకర్, ఇతరులను వ్యక్తిగత హాజరునుండి ధర్మాసనం మినహాయించింది.అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడానికి మరో ఎనిమిది వారాల సమయం పొడిగించాలని కోరుతూ స్పీకర్ తరపున దాఖలు చేసిన ప్రత్యేక పిటిషన్‌పై ధర్మాసనం నోటీసు జారీ చేసింది. తెలంగాణ శాసనసభ స్పీకర్ కార్యాలయ ం తరపున న్యాయవాది శ్రవణ్‌కుమార్‌తో పాటు సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గి, అభిషేక్‌సింఘ్వీ హాజరయ్యారు. వారు తమ వాదనలు వినిపిస్తూ బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేల అనర్హతపై నిర్ణయం తీసుకునేందుకు మరో 8 వారాల సమయం పొడిగించాలని కోరుతున్నారని స్పీకర్ తరపున తెలియజేశారు. నాలుగు అనర్హత పిటిషన్లపై విచారణ పూర్తి అయ్యిందని, మూడు కేసుల్లో సాక్ష్యాల నమోదు ముగిసిందని న్యాయవాదులలో ఒకరు తెలిపారు. 'దీనిని ముగించి ఉండాలి. ఇది అత్యంత దారుణమైన ధిక్కారం. కొత్త సంవత్సరాన్ని ఎక్కడ జరుపుకోవాలో ఆయనే నిర్ణయించుకోవాలి' అని సిజెఐ బి.ఆర్.గవాయ్ అన్నారు. కాగా బెంచ్ ఈ అంశాలపై తదుపరి విచారణను నాలుగు వారాల తర్వాతకు వాయిదా వేసింది.కోర్టు భావాలను తాను స్వయంగా స్పీకర్ కార్యాలయానికి తెలియజేస్తానని, నాలుగు వారాలలో నిర్ణయాలు తీసుకుంటారని ఆశిస్తున్నానని రోహత్గి ధర్మాసనానికి హామీఇచ్చారు.

కాగా ఇదిలాఉంటే నవంబరు 10న, నవంబరు 17న విచారణకు సుప్రీంకోర్టు అంగీకరించింది, తెలంగాణ స్పీకర్‌కు వ్యతిరేకంగా కోర్టు ధిక్కార చర్యలను కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. బి.ఆర్.ఎస్ నాయకులు కె.టి.రామారావు, పాడి కౌశిక్‌రెడ్డి, కె.వివేకానంద్ సుప్రీంకోర్టులో బ్యాచ్ ఆఫ్ రిట్ పిటిషన్స్ దాఖలు చేశారు. జులై 31న ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్, జస్టిస్ ఏ.జి.మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం వెలువరించిన తీర్పు నుంచి ఈ ధిక్కార పిటిషన్ వచ్చింది. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ కింద అనర్హత పిటిషన్లను నిర్ణయించే ట్రైబ్యునల్‌గా స్పీకర్ వ్యవహరిస్తారని తత్ఫలితంగా రాజ్యాంగ బలం అనుభవించలేరు అని సుప్రీంకోర్టు పునరుద్ఘాటించింది. 10వ షెడ్యూల్ ఫిరాయింపుల కారణాల వల్ల అనర్హత వేటు విధించే నిబంధనలను వివరిస్తుంది.

## కొట్టేసిన కేటుగాళ్లు

(మొదటి పేజీ తరువాయి)

నివసిస్తున్నారు. ఆమె ఓ ఐటి ఉద్యోగి. 2024 సెప్టెంబర్ 15న ఓ వ్యక్తి ఆమెకు ఫోన్ చేశాడు. తాను డిహెచ్‌ఎల్ కొరియర్ కంపెనీ ప్రతినిధి అని చెప్పి, మీ పేరుతో 3 క్రెడిట్ కార్డులు, 4 పాస్‌పోర్టులు, నిషేధిత ఎండిఎం డ్రగ్స్ ఉన్న ప్యాకేజీ ముంబయిలోని అంధేరీ కొరియర్ సెంటర్‌కు వచ్చిందన్నాడు. దీంతో ఉమారాణి తాను బెంగళూరులో నివసిస్తున్నాని, ఆ ప్యాకేజీతో తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. అయితే ఆ వ్యక్తి, మీ ఫోన్ నంబర్‌తో ఆ ప్యాకేజ్ లింక్ చేయబడి ఉందని, అది సైబర్ నేరం కావచ్చని పేర్కొన్నాడు. అంతేకాదు దానిపై సైబర్ క్రైమ్ సెల్‌కు ఫిర్యాదు చేయమని చెప్పాడు. దీనికి ఉమారాణి స్పందించే లోపు, అతనే ఓ వ్యక్తికి కాల్ చేసి అతను సిబిఐ అధికారి అని బాధితురాలికి తెలిపాడు. ఆ సైబర్ నేరగాడు సిబిఐ అధికారిలాగా నటిస్తూ, ఉమారాణి నుంచి పలు వివరాలు సేకరించాడు. ఆమెపై సిబిఐ నిఘా ఉంచిందని బెదిరించాడు. అంతేకాదు దీని గురించి స్థానిక పోలీసులకు చెప్పవద్దని హెచ్చరించాడు. దీని గురించి ఎవరికైనా తెలియజేస్తే, ఆమె కుటుంబం మొత్తాన్ని కేసులో ఇరికిస్తామని బెదిరించాడు. దీనితో ఆమెకు ఏం చేయాలో తోచలేదు. పైగా తన కుమారుడి వివాహం దగ్గరలో ఉండడంతో, ఆ మోసగాళ్లు చెప్పినట్లే ఆమె చేసింది. అక్కడికి కొన్ని రోజుల తర్వాత, సిబిఐ అధికారినంటూ చెప్పుకున్న ఆ మోసగాడు మళ్లీ ఫోన్ చేశాడు. ఈసారి అతను వీడియో కాల్ చేసి, ఉమారాణిని డిజిటల్ అరెస్టు చేస్తామని బెదిరించాడు. ఆ తరువాత రాహుల్ యాదవ్ అనే మరో వ్యక్తిని వారం రోజుల పాటు ఆమెను పర్యవేక్షించడానికి నియమించాడు. వాస్తవానికి ఆ సమయంలో ఆమె వర్క్ ఫ్రం హోమ్ చేస్తున్నారు. అదే విషయాన్ని మోసగాళ్లుకు చెప్పారు. దీనితో సదరు మోసగాడు 2024 సెప్టెంబర్ 23న మళ్లీ ఫోన్ చేసి, అరెస్టు నుంచి తప్పించుకోవాలంటే, మీకున్న అన్ని ఆస్తులను ఆర్‌బీఐకి చెందిన ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ ముందు ప్రకటించాలని ఆదేశించాడు. ఇదంతా నిజమే అని నమ్మిన బాధితురాలు, ఆ మోసగాడు చెప్పినట్లే చేసింది. బాధితురాలు పూర్తిగా వారి ట్రాప్‌లో పడిపోవడంతో, క్రమంగా ఆమె నుంచి డబ్బు గుంజారు. బాధితురాలు తన ఎఫ్‌డీ డబ్బులను మినహాయించి, మిగతా సేవింగ్స్ ద్వారా, ఆస్తుల ద్వారా వచ్చిన ఆదాయం అంతా కలిపి రూ.31.83 కోట్లను దాదాపు 187 లావాదేవీల ద్వారా మోసగాళ్లుకు బదిలీ చేసింది. ఇలా తమకు బదిలీ చేసిన డబ్బును 2025 ఫిబ్రవరి నాటికి ధ్రువీకరించి తిరిగి ఇస్తామని మోసగాళ్లు ఆమెను నమ్మించారు. చివరికి వారు సదరు మహిళకు క్లియరెన్స్ సర్టిఫికెట్ కూడా ఇచ్చారు. అయితే గడువు దాటిపోతున్నా కూడా తన డబ్బును తిరిగి ఇవ్వకపోవడంతో ఆమెకు అనుమానం వచ్చింది. తాను మోసపోయానని గ్రహించి, ఈనెల 14న బెంగళూరులోని తూర్పు డివిజన్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన కుమారుడి వివాహం, ఇతర కారణాల వల్ల ఫిర్యాదు చేయడంలో చాలా ఆలస్యమైందని సదరు మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. దీనితో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించాం' అని పోలీసులు తెలిపారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com